చరిత్రధన్యులు

రచయిత:
శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.

పబ్లిషర్సు:
రౌతు బుక్కు డిపో,
ప్రొ:- రౌతు చంద్రయ్య అండ్ సన్సు.
రాజమహేంద్రవరము.

కాపీరైటు] 1954. [మూల్యము: రు 1/-

అనుక్రమణిక.

౧	శాలివాహనుఁడు	[సాహిత్యరక్తి]	 1
౨	మాధవవర్మ	[బాహుశక్తి]	 45
౩	గొంకరాజు	[ప్రభుసేవాసక్తి]	 83
౪	అన్నమయ్య	[దైవభక్తి]	 106

శాలివాహనుఁడు.

౧

దీపకర్ణి కొన్ని సంవత్సరములనుండి వేటకుఁ బోవుట మిక్కిలి తగ్గించినాఁడు. పోయినపుడైనను వెనుకటి యుత్సాహముగాని మునుపటి యుత్తేజకతగాని యతనిలో నుదయించుటలేదు. జీవితములో నేవేని దుఃఖరేఖలు పొడసూపినపుడు వానిని చెఱుపుకొనుటకై యాభూవరుఁడు వేట నొక సాధనముగా నుపయోగించుకొనెడివాఁడు. నేఁడు మృగయావినోదమువలనను శాంతింపని యేదో యొక విచారము దీపకర్ణిలో దాఁగియున్నదని యూహింపవలయును.

తన తరువాత రాజ్యభారము నాదుకొను పుత్రసంతానభాగ్యము దీపకర్ణికిఁ బట్టలేదు. అంతతో సరిపెట్టక భగవంతుఁడాతనికి మరియొక ఘోరవిపత్తు తెచ్చిపెట్టినాఁడు. కన్నులకు వెన్నెల వత్తియైన ప్రాణేశ్వరి "శక్తిమతి" గతించినతరువాత దీపకర్ణికి లోకమెల్ల శూన్యమనిపించినది. ఆమె మరణానంతరమా ప్రభువు జీవితప్రయాణ మొకయర్థములేనిది. విషాద

మేదురమైన దీపకర్ణి హృదయమును నేఁడు వేఁటకూడ వినోదింపఁ జేయుటకుఁ జాలదుగదా!

మంత్రులకుఁ బరివారమునకుఁ బరమాశ్చర్యముగా నున్నది. మహీపాలుఁడు పూర్వములేని యుత్సాహముతో నాఁడు మృగయా వినోదమునకు బయలుదేఱినాఁడు. అవ్యక్తమైన యొకానొక యానందరేఖ యా ధరాపాలునకు స్వాగతము చెప్పుచున్నట్లున్నది. ఏలొకో! ఆనాఁడతనిలోఁ గ్రొత్త వేడుక పొటమరించినది! భవితవ్యములకు సూచనలు సర్వత్రి కానిపించుచుండును.

సపరివారుఁడైన దీపకర్ణి భూపాలుఁడు కాంతారమునఁ బ్రవేశించి విచ్చలవిడిగా వేఁట కుపక్రమించెను. ఆ నాఁటి యతని వేడుకను జూడఁగాఁ బట్టఁబగ్గములులేవు. వరాహములను దునుమాడెను. బెబ్బులులను దూఁటాడెను. మదగజములను జెండాడెను. చిరకాలమునుండి యణఁగి యణఁగి యతనిలోనున్న మృగయా వినోదోత్సాహ మొక్కసారి యుబికి యుప్పొంగినటు లయ్యెను. ఇట్లు రెండు మూఁడు జాములా వేడుక సాగినది.

ఆ పూఁటకు వేఁట విరమింపఁ దలఁచుకొన్న సమయమున దీపకర్ణి మనస్సు నాకస్మికముగాఁ దివిచి యెవరో యీఁచినటులయ్యెను. ఆతని కన్నులు దవ్వులనున్న యొంక సింహముపైఁ బడెను. "వరాహములను బెబ్బులులను సంహ

రించుటకాదు. నన్నుఁ బోడుపు" మన్నటు లాపంచాననము వచ్చుటను దీపకర్ణి పరికించెను. సింగము కంటఁబడిన వెను వెంటనే యాధరాఖండలుని కండరములు పొంగి సర్వాంగ ములు సుద్రిక్తము లయ్యెను.

అట్టి స్థితిలో దీపకర్ణి కుత్తరక్షణమున నొక యాశ్చ ర్యము రేకెత్తెను. ఆ భయంకరమృగము మందమారుతము నకుఁ గదలాడు సరస్తరంగమువలె మెల్లఁగా వచ్చుచుండుట మఱియు నచ్చెరువు గొలిపెను. ఆశ్చర్యములో నాశ్చ ర్యము! ఆ సింహముపై నొక పసియీడు పిల్లవాఁడు కాఁ బోలు! ఆ యపూర్వదృశ్యము చూచి దీపకర్ణి పులకితుఁ డయ్యెను; చకితుఁడయ్యెను. ఫణిరాజు పడగపైనున్న మణిని దలంచుకొని, దీపకర్ణిగుండె యొక్కసారి జల్లుమన్నది. సింహము మీఁది మీఁదికి రాఁబోవుచుండెను. క్రూరమృగము నుపేక్షింప రాదని వాఁడియమ్ము వింట సంధించి యాతేఁడు సింగము మొగము గాఁడునట్లు కొట్టెను. ఆబాణము మొగముదూసికొని మృగము భూమికొరగునంతలో శరవేగమున నేఁగి పిల్లవాని యొడలు నొవ్వకుండఁ జటాలునసెత్తి దీపకర్ణి ముద్దాడెను.

అంతలో నా మహీకాంతుని యెదుట దివ్యమంగళ మూర్తియగు నొక మహాపురుషుఁడు. దీపకర్ణి కది యంతయు వింతగా నుండెను. అది కలయో, మతిభ్రమయో, వైష్ణవ మాయయో యతఁ డూహింపలేకపోయెను. తాను వేఁటకు వచ్చుటయేమి! సింహముపైఁ బసిపిల్లవాఁ డుండుటయేమి!

సంతాన హీనుఁడైన తన కాబాలుఁడు దొరకుటయేమి! ఈ మహాపురుష సాక్షాత్కారమేమి!

ప్రత్యక్షమైన పురుషుఁడు దీపకర్ణి భూపాలుని నిండు హృదయముతో దీవించి యిట్లు పలికెను: "మహారాజా! నేనొక యక్షుఁడను. సంతానవంతుఁడనైన నేను గారణాంతరముచే శప్తుఁడనై యిట్లు సింహరూపమున నుంటిని. వీఁడు నా కన్న కుమారుఁడు. నా పేరు సాతుఁడు. అపుత్రికుఁడవైన నీవు వీనిని పుత్రనిర్విశేషముగా భావించి పెంచుకొనుము. నీ యభిమతార్థము నెఱవేఱును. నీ మూలమున నాకు శాప విముక్తి కలిగినది. కృతజ్ఞుఁడను. ఈ బిడ్డ సామ్రాజ్య ధురంధరుఁడై శాశ్వతకీర్తి ప్రతిష్ఠల నార్జించుకొనఁ గలవాఁడు కాఁగలఁడు. మఱినాకు సెలవు."

దీపకర్ణికిఁ బెన్నిధానము లభించిన యానందము కలిగెను. సాతుఁడు వాహనముగా నుండుటచే నాపిల్లవానికి "సాతవాహనుఁడు" అను నామకరణము చేయఁబడెను.

౨

ఆంధ్రదేశచరిత్ర ప్రథమమున సాతవాహ-
దీపమువంటివాఁడు. బాల్యము గడచిన య
వేద, రాజనీతిజ్ఞత, సాహిత్యరక్తి మొదలగు తో

వెన్నెలవలెఁ దెలుఁగుదేశము నాల్గు చెఱఁగులలోఁ జల్లఁదనము విరియఁజేసెను. సాతవాహనునకే శాలివాహనుఁ డనియు, హాలుఁడనియు నామాంతరములు వెలసెను.

హాలనేత యెంతయాకారవంతుఁడో, అంత ప్రజ్ఞాశాలి. ఎంత ప్రజ్ఞాశాలియో, అంత గర్వరహితుఁడు. ఎంత గర్వరహితుఁడో, అంత రాజ్యకార్య ధుర్వహుఁడు.

ధాన్యకటకమున హాలమహారాజు కొలువు వసంతారామమువలె నందగించి యుండును. దేశ దేశములనుండి విద్వాంసులు, కళానిపుణులు, కవిశిరోమణులు వందలు వేలుగా విచ్చేసి హాలుని కొల్వు నలంకరించు చుందురు. హాలుఁడు కొలువుదీర్చిననాఁడు పండితుల దోసిళ్ళలో బంగారుపంట. హాలుని కటాక్షము సోఁకిన కవుల గళములకు ముత్యాల సరములు. ప్రాకృతభాషపై నాతనికిఁగల మక్కువ యింతయని వక్కాణింపరానిది. ఆ బాసలోఁ గవిత చెప్పఁగల ప్రతికవియు హాలుని గౌరవమునకుఁ బాత్రుఁ డగుచుండెను. 'కవివత్సలుఁ' డను బిరుదనామ మతనియెడల నన్వర్థమైనది.

ఒకనాఁటి కొలువులో రత్నఖచితమైన సువర్ణపీఠమున హాలనేత సురేంద్రునివలె సముపవిష్టుఁడై యుండెను. ఆతని కుడివైపు మహాతేజస్వంతులైన యిర్వురు మూర్తులుచితాసనములపైఁ గూర్చుండియుండిరి. వారి కన్నులలో నార్ద్రతేజోరేఖాస్ఫురణములు పరిఢవిల్లుచున్నవి. గంభీర సుందరములైన

వారి వదన సరోజములలో సరస్వతి లాస్యము చేయుచున్న ట్లున్నది.

వారెవరు! మహామంత్రులై యుందురని వారి వేష సౌష్ఠవములు చెప్పక చెప్పుచున్నవి. పెదవులనుండి తొల కాడు చిఱునవ్వు కప్పికొనుచున్నను నాతనిలో నధికార దర్పము, అహంకార చ్ఛాయ స్పష్టముగా విస్ఫారుచునే యున్నవి. అతఁడు ప్రధానమంత్రి 'శర్వవర్మ' కావలయును. రెండవ సచివోత్తముని ముఖములో మందహాసము లేదు. ఆతని కన్నులు పరమ నిశ్చల స్ఫురణములై యోగానేక తీవ్ర భావనలోనున్న యతని యవస్థను వెల్లడించుచున్నవి. అతఁడు 'గుణాఢ్యమంత్రి' కావుట సత్యము.

హాలభూపతికి వామపార్శ్వమునఁ బట్టపురాణి లీలావతి యొక రమణీయ మణిపీఠమున నుపవిష్టయై యుండెను. లీలా వతి సుగుణవతియేగాక సురుచిర రూపవతి. భాస్వర తేజస్వతియే గాక సాహిత్యములో రెండవ భారతి. ఆమె మహారాజుతో పాటు కొలువుకూటమునఁ గూర్చుండి రాజకీయగోష్ఠులలో సాహిత్యచర్చలలోఁ బాలుగొనుచుండును. రాజకీయము లైన రహస్యము లామె మిక్కిలి చాకచక్యముతోఁ జక్కదిద్ది భర్త కానందము కలిగించుచుండును. సాహిత్య చర్చాసందర్భము లందామె యందె వేసినచేయి. లీలావతి చెప్పిన సాహిత్యపుఁ దీర్పులు కాదనుటకు మహారాజునకుఁగాని, మహాపండితులకుఁ

గాని గుండెదిటవుండదు. ఆమెమాట లెంత మధుర మధుర ముగా నుండునో, అంత వా(డివా(డిగా(గూడ నుండును.

లీలావతి సింహళరాజ పుత్రిక. ఆమెను ప్రేమించి పెండ్లియాడినది మొదలు హాలమహారాజులో సాహిత్యప్రీతి చిగిర్చి కుసుమించి పరిమళింపసాగెను. ఆదంపతు లిరువురు కవిత్వపు సొగసులు ముచ్చటించుకొనునపుడు వినువారికి(గడు ముచ్చటగా నుండును. రాజకీయ తంత్రములమీ(ద నున్న శ్రద్ధకంటె(గవిత్వగోష్ఠిపై వారి కెక్కుడు మక్కువ.

నా(డు హాలభూపాలుని పార్శ్వమున భారతీదేవివోలె(గూరుచుండిన లీలావతితో సభామండపము మహోజ్జ్వలలీలా మండితమై యొప్పుచుండెను.

మహారాజ్ఞి పెదవి కదలుననగా, సభ్యలోకమున వింధ్య మా(కిడినట్లు నిశ్శబ్దత యేర్పడెను. లీలావతినోరు కదలి నచో మంచిముత్తెములు జలజలరాలును. ఆమె తలచు మాటలు వెచ్చపెట్టదు. మందహాసభాసుర కటాక్షాంచల ముతో నొక్కసారి పట్టపుదేవి మహాప్రభువువంక(బరికించెను. ఆమె చిఱునవ్వులో నెంతో యర్థము దా(గియున్నది. శాలి వాహన భూజాని పరేంగితజ్ఞు(డుగావున నా యర్థము లెస్సగా(దెలిసికొన(గలిగెను. "మన సాహిత్యచర్చ యింక నారం భింతము ... మీ ప్రాకృతభాషకంటె మా సంస్కృత సార స్వతము రసోదంచితమైనది సుడీ!" అని రాణి తన్నధిక్షే

పించుచున్నట్లు శాలివాహనుఁడు భావించెను. ఆ యాక్షేపణము మహారాజునకుఁ దేనెలో మెదిపిన మిర్యపుటుండవలె దియ్యగాఁ జులుకుగా నుండెను.

రాణి యందుకొనెను: "శ్రీ వారి ప్రాకృత భాషలోని 'గాథలు' మా సంస్కృత సాహిత్యములోని శ్లోకములతో నెన్నఁటికి సాటిగావు. కోపమురానిచో నొక్కమాట మనవిచేసెదను. ఏ భాష వేదపురాణ శాస్త్రములకు జన్మభూమియో, ఏవాణి దేవతల ముఖపద్మములను బవిత్రముగావించెనో, ఏ సరస్వతి వ్యాసవాల్మీకి ప్రభృతి ఋషిప్రవరుల మహోత్తమ రచనలతో నిత్యనవ్య శోభావంతమై యలరారుచున్నదో, యట్టి గీర్వాణసాహితి సర్వజన సేవ్యమైనయది. ప్రాకృతమైనను, మఱియొకటియైనను సంస్కృత సరస్వతి తరువాతఁ బ్రశంసింపఁ దగినవే. మహారాజుల సన్నిధిని వలసినచో వేలకొలఁది యుదాహరణములు చూపించుటకు సంసిద్ధురాలను."

[illegible] 'రాణిగారు చెప్పినవి సత్యోక్తులు" అన్నట్లు [illegible] జూచెను. శర్వవర్మ చూచిన చూపులో [illegible]రము, నొక యాత్మవిశ్వాసము గుర్తించి గుణాఢ్యుఁ డిట్లు వచించెను:

[illegible]మా ప్రభువులకు సంస్కృత భాషోన్నతి తెలియక పోదు. కాని మధుర మధురములైన పదములు, హృదయ

తంత్రిలనుబట్టి యూ(ప(గల భావములు కావలయునన్న చో(బ్రాకృతభాషకు(బ్రాకృతభాషయే సాటి. ఆ భాషలోని యొక్కొక్క 'గాథ' యొక్కొక్క సంస్కృత కావ్యమునకు(బోటివచ్చును. బండ్లకొల(ది సారస్వత ముండుటయే భాషకు ఘనతకాదు. సాహిత్యములోని జీవమునుబట్టి దాని విశిష్టత వెల్లడియగుచుండును. ఈ సంగతి శ్రీ రాణిగారికి(దెలియదని కాదు. ఇంతకును, వారి గీర్వాణ భాషాభిమాన మద్వితీయ మైనది."

గుణాఢ్యమంత్రి మాటలకు హాలరాజు బుజములు పొంగెను. "సెబాసు! నా యభిప్రాయమునే యచ్చముగా గుణాఢ్య పండితులు వెల్లడించినారు. లీలావతికి(బ్రాకృత సరస్వతీ మధురిమ తెలియదు పాపము!" అని యాత(డు వెడ నవ్వు నవ్వెను.

లీలావతి ముఖాంబుజము జేవురించెను. శర్వవర్మ గుణాఢ్యునివైపు చుఱచుఱ చూచుచు నేదో పలుక(బోవు చుండ(గా, రాణి యందుకొని యిట్లు పలికెను:

"ప్రభువులు చెప్పినది సత్యము. నేను ప్రాకృతస్త్రీని గాను. నాకు(బ్రాకృత మాధుర్యములు తెలియవు. పోనిండు. ఒక శబ్దము నెట్లు విడ(దీయవలయునో యేలినవా రెఱు(గరు పాపము! భాషా పరిజ్ఞానమే లేనిచో రసవిచార మెక్క డిది?"

రాణి యెత్తిపొడుపుమాట హాలరాజు గుండెలో సూది గుచ్చినట్లు పొడుచుకొనెను. అప్పటి హాలనేత ముఖవైఖరి పరికించి రాణి తొందరపాటునకు శర్వవర్మ నివ్వెరపడి పరిష్కారదృష్టితో నీవిధముగా మాటాడెను:—

"ఇంతకును నొక్కొక పువ్వున నొక్కొక్కతీరు పరిమళము. మాలతీపుష్పములోని సౌరభము విరజాజి కుండదు. విరజాజిలోని తావి సంపెంగకు రాదు. సంపెంగలోని సౌరభము మఱియొక కుసుమమున కుండదు. దేని విశిష్టత దానిది. సంస్కృత భాషాదృష్టిలోఁ బ్రాకృతము నిస్సారమైనచోఁ బ్రాకృతవాణి దృష్టిలో సంస్కృతము తృణప్రాయమగును. ఈ వివాదములు తేలునవి కావు.

అంతతో నాఁటి సాహిత్యచర్చకు స్వస్తి.

3

హాల మహారాజు కోటలోని చంద్రకాంత శిలాసౌధమున నేకాంతమునఁ గూర్చుండెను. అతని ముఖము, మంచు ముసుఁగుతోనున్న పంకజమువలె నుండెను. సువిశాల సుందరమైన యతని నొసటిపై నొక విషాదనీలరేఖ చూచువారికి సుస్పష్టముగా గోచరించుచుండెను. హాలరాజు కొలఁదినాళ్ల

క్రితము జరిగిన యొక విచిత్రసంఘటనమును దలఁపునకుఁ దెచ్చుకొనుచున్నట్లు మనము భావింపఁగలము.

"ఒకనాఁడు లీలావతియు హాలరాజు క్రీడోద్యానమునఁ బద్మసరస్సులో జలక్రీడ లాడుచుండిరి. లీలావతి యొక తామర పూవు నూడఁబెఱికి యాటవేడుకతోఁ బ్రాణనాథుని చెక్కిలి నొవ్వ నేసెను. రసిక చక్రవర్తియగు హాలుఁడు దిగ్గున రెండు తామరమొగ్గ లందుకొని లీలావతి రెండుబుగ్గలు నెఱ్ఱవాఱు నట్లు గొట్టెను. లీలావతియుఁ దన చిగురువ్రేళ్ళతో నీళ్ళుతీసి జల్లుజల్లుగాఁ బ్రియునిపైఁ జల్లుచుండెను. హాలుఁడు తన మగతనమును బ్రదర్శించుటకో యన రాణి యుక్కిరి బిక్కిరి యగునట్లు ముఖముపై నదేపనిగ జలము గొట్టు చుండెను. సలిలసమ్మర్దమునకు లీలావతి తాళలేక పోయినది. ఆమె కూపిరి యాడలేదు. తోడనే సంస్కృతభాషలో నామె భర్త నుద్దేశించి "మామోదకైస్తాడయ" యని ప్రార్థించెను. హాలుఁ డామె వేఁడుకోలు విన్నాఁడు. వెంటనే చల్లులాట చాలించి యట్టహాసముచేసి "ఓహో! రాణిగారికి మోదకము లతోఁ దాడనము కావలయునుగాఁబోలు" ననెను.

ఆ మాటకు లీలావతి పకుక్కన నవ్వఁగా, రాయంచ ఱెక్కలు జాడించినట్లుండెను.

"మహారాజులుంగారు నాభాష నీరీతిగా నర్థముచేసి కొన్నారు. నేను గోరినది, మోదకములతోఁ గొట్టుఁడని

కాదు. ఉదకములతోఁ గొట్టవలదని ప్రార్థించితిని. "మా-ఉదకైః" అను రెండు పదములు కలిపినచో "మోదకైః" అ యగును. ప్రభువులకు సంస్కృత భాషా పరిచయము తక్కు యనుటకు నాకు సాహసములేదు" అని రాణి యెత్తిపొడుపు మాట వాఁడిగా విసరెను".

ఇది కొంతకాలము వెనుక జరిగిన వింత సంఘటనము ఈ సన్నివేశము తలంచుకొన్నప్పుడు హాలరాజు మనస్సునకు గుదురుపాటుండదు. గోరుచుట్టుపై రోఁకటి పోటువలె లీలావతి నిండోలగమున నన్నమాట యతనికి మఱియు వ్యథాకర మయ్యెను. హాలుఁడు తనలోఁ దానిట్లు భావించుకొనెను.

"లీలావతిచే నిండుసభలో నటు లనిపించుకొంటిని. గుణాఢ్య శర్వవర్మ లుండఁగాఁగూడ సంస్కృతశబ్దము విడ దీయుట నాకుఁదెలియదని యామె యధిక్షేపించెను. శర్వవర్మ రాణిపక్షము వాఁ డయ్యెను నన్ను సమర్థించుచు మాటాడి నాఁడు. నిజమే...ఆలోచింపఁగా నాకుఁ బ్రాకృతవాణిపై మమకార ముండవచ్చును. ఈ యొక్క భాషలోనే ప్రపంచ మంతయు నున్నదని మురిసి ముచ్చటపడుటకంటె నితర భాషలు కూడఁ బఠించి వానిలోని సొగసులు గుర్తించుటలోఁ దప్పేమి? ప్రాకృతమున నెట్టి వైదుష్యమును సంగ్రహించితినో సంస్కృత మునఁగూడ నట్టి పాండిత్యమును సంపాదింపవలయును. లీలా వతి భాషాగర్వమును బరిహరింపవలయును. శర్వవర్మాదులకు

సంతోషము నొదవింపవలయును. ఆంధ్రదేశమున సంస్కృత సారస్వతచందిక్రలు గాయింపవలయును. నాఁటిదాఁక నిద్ర పోరాదు."

ఇట్టి భావనలో నేకాంతముననున్న హాలపతిని దర్శించుటకు గుణాఢ్యమంత్రి విచ్చేసెను. గుణాఢ్యునకు మహారాజునకు నొకటే ప్రాణము. హాలుఁడెట్టి యేకాంతమున నున్నను వచ్చి మాటాడుట కొక్క గుణాఢ్యునకే చనవుకలదు. శర్వవర్మకు హాలపతితోనున్న చనవు వేఱు. గుణాఢ్యున కున్నట్టి చనవు వేఱు.

శర్వవర్మ లీలావతితో నరణముగా వచ్చిన పండితకవి. అతఁడు రాణిగారిమాటతో హాలసంస్థానమునఁ బ్రధానమంత్రి యయ్యెను. గుణాఢ్యుఁడు హాలునకు చిన్ననాఁటినుండిమిత్త్రుఁడు. ఆకారణమున గుణాఢ్యుఁడును మంత్రిపదవి నందెను. పండితులు సచివోత్తములై రాజ్యతంత్రములు నడపుచుండుట భారతదేశమునఁ గ్రొత్తకాదు. గుణాఢ్య శర్వవర్మల కిరువురకు లోలో వైరబీజములు కలవు. అవి సాహిత్యచర్చాసందర్భములలో మొలకెత్తు చుండును. మొత్తముమీఁద, రాణియు శర్వవర్మయు సంస్కృతభాషాపక్షము. హాల గుణాఢ్యులు ప్రాకృతభాషాపక్షము. తఱచు గుణాఢ్యుఁడు మహారాజును దర్శించి గంటలకొలఁది సంభాషణము నెఱపుచునే యుండును.

ఆలోచనామగ్నుఁడైన హాలునకు గుణాఢ్యమంత్రిని చూడఁగనే ప్రాణములు లేచివచ్చెను. అభివాదములు, ప్రత్యభివాదములు నైనవెనుక మంత్రి యిట్లు ముచ్చటింపఁదొడఁగెను.

"మహారాజా! తమరు కూర్చిన 'గాథాసప్తశతి' కావ్యములోని 'గాథలు' మననము చేసికొనుచున్నకొలఁది చవులూరుచున్నవి. ఏమి సొగసైనభావములు! ఏమి సుందరమైన పదసంధానము! జానపద పరిస్థితులు కన్నులకుఁ గట్టినటులు చిత్రింపఁబడినవి. ఒకగాథ ప్రబంధశతమునకు దీటువచ్చునది. ఈకావ్య మొకఁడే తమకీర్తిని బరమశాశ్వతము చేయఁగలదు. ప్రభువులతోపాటు కవయిత్రీమణులును గవులును బెక్కుమంది చిరకీర్తి నందుకొనఁగలరు."

గుణాఢ్యమంత్రి మాటలు సాతవాహనుఁడు మనస్సునకుఁ బట్టించుకొనలేకపోయెను. భూవరుఁడు పరధ్యానములో నుండెనని మంత్రి కనిపట్టెను. ఒక్కింత తడవు నిశ్శబ్దత. హాలభూపతి సచివసత్తముని జూచి "మీవలె నుభయభాషలు సాధించినవా రేమన్నను జెల్లిపోవును. మాకు సంస్కృత సారస్వతములో నున్న పరిచయ మల్పాల్పము. అట్టి పరిచయముతో నా వాఙ్మయము నిస్సార మనుకొనుటయుఁ, బ్రాకృతమే యుత్తమోత్తమవాఙ్మయ మనుకొనుటయు నన్యాయము కదా! భాషను గూలంకషముగా సాధించినపిమ్మట దాని యొక్కువ తక్కువలు వక్కాణించుట కధికారము కలుగును.

అచిర కాలములో గీర్వాణ సాహిత్యమున నైపుణ్యమును మేము సంపాదించి తీరవలయు" నని పలికెను.

ఏలికపలుకులకు గుణాఢ్యుఁడు చాల నివ్వెఱపడెను. ఇంతలో నచింతితముగా నిట్టిభావమును వెల్లడించిన మహారాజున కేమి బదులుచెప్పవలయునో యతనికిఁ దోఁచలేదు. హాలుఁడు సంస్కృతభాషావిశారదుఁ డగుట గుణాఢ్యునకుఁ గిట్టదా? - అదికాదు; ప్రాకృతభాష కవలంబము సన్నగిల్లును. ప్రాకృతభాషాభిమానులగు తమవంటివారి కాశ్రియము వెనుకఁబడును. మహారాజు గీర్వాణభాషాప్రియుఁడైనచో వచ్చెడి యిబ్బంది యిది.

గుణాఢ్యుని యెదుట హాలుఁ డింతదాఁక నెన్నఁడునిట్టి యన్యభాషాభిమానము ప్రకటించుమాట మాటాడలేదు. "ప్రాకృతవాణికిఁ బతనదశ కాఁబోలు!" నని గుణాఢ్యుఁడు లోన భావించి యూరకుండి "ప్రభువులచిత్త" మని పలికి సెలవుదీసికొని వెడలిపోయెను.

౪

పట్టపురాణి లీలావతికి రేయి నిద్దురపట్టలేదు. ఆమె యెన్నఁడును భర్త కెదురాడి యెఱుఁగదు. వాఙ్మయవిషయకముగాఁ బ్రియునితో భిన్నాభిప్రాయము వచ్చినను మృదు

పాకముగా బదులు చెప్పుటయేకాని ముదురుధోరణిలో మాటాడి యెఱుఁగదు. ఆమె సింహళేశ్వరుని ప్రియపుత్రిక. తండ్రి యామెను గారాబముగాఁ జూచుకొని యొక విద్వాంసుని గురుత్వముతో సంస్కృతభాష నభ్యసింపఁజేసెను. తద్భాషారహస్యము లామెకుఁ దెలియనివి లేవు. సుశిక్షితమైన పాండిత్యమును వెల్లడించుచు నామె సంభాషించునపుడు షట్శాస్త్రములం దందెవేసిన కోవిదులకు గుండెదడగా నుండును.

సహజముగా నామెది కోకిలగళము. పంచమస్వరములో నేదేని శ్లోకము పఠించి యామె దానిలోని విశేషార్థమును వ్యక్తము చేయునపుడు శ్రోతలు ముగ్ధులగుచుందురు. హాలుని సారస్వతప్రీతి, గుణప్రశస్తి, ప్రాకృతభాషావైదుష్యము గుర్తించి యామె యాతనిని వలచినది. హాలనేతయు లీలావతి సాహిత్యపరతకు మురిసియే ప్రేమించి పెండ్లియాడెను. సప్త గోదావర తీరమున నున్న భీమేశ్వరక్షేత్రమున లీలావతీ హాల నేతలకు వివాహము జరిగిన దని కావ్యప్రసిద్ధమైన విషయము.

ఒకరి నొకరు సాహిత్యబాంధవముతోఁ బ్రేమించుకొన్న యీ వాల్లభ్యము పొరపొచ్చెములు నరమరలు లేక యింతదాఁకఁ జక్కఁగా సాగుచున్నది. ఇప్పుడు తన మాట తొందరవలన హాలుని హృదయమున కేమేని నొవ్వు కలుగునేమో యని లీలావతికి దిగులుగా నున్నది.

జలక్రీడాసందర్భమునఁ దా నన్నమాటను సభలో నామె మరల నుటంకించినది. అది ప్రియుని మనస్సున నాటు కొన్నటులుకూడ నామె గుర్తించినది. మృదుహృదయ యగు లీలావతి కిఁకఁ గుదురెట్లుండును ?

లీలావతి వెనువెంటనే శర్వవర్మకు వర్తమాన మంపెను. ఆ మంత్రిశేఖరునికడఁ దన చింత వెల్లడించుకొన్నచో హృదయము కొంత బరువు తగ్గు నని యామె యభిప్రాయము. శర్వవర్మ తన్నుఁ దండ్రియై జూచుచున్నాఁడు. అరణముగా వచ్చిన కవి యైనను నేఁడు శర్వవర్మ హాలరాజు తలలోనాలుక. శర్వవర్మ 'యిది యిట్లుచేయవలయు' నన్నచో హాలరాజు జవదాఁటఁడు.

మహామంత్రి లీలావతీ దర్శనార్థము విచ్చేసెను. యథోచితములైన మర్యాద లయిన పదపడి శర్వవర్మ "అమ్మా! నిన్నటి కొలువులోఁ దాము కొంచెము తొందరపడితిరేమో యనిపించినది. మహారాజుగారు ప్రాకృతభాషలో సాటిలేని విద్వాంసులు. వారినిగూర్చి వాఁడిగా మాటాడుట నాకు భయము" అని పలికెను.

లీలావతి యేవిషయము శర్వవర్మతో ముచ్చటింపఁ దలఁచుకొనెనో యావిషయ మతఁడే ముందుగా నందుకొనెను. రాణి కది మఱియుఁ జిన్నతనముగా నున్నది.

"మహామంత్రీ! అదే నాకును భయముగా నున్నది. మహారాజుల నేవిధముగానేని సంస్కృతభాషాప్రియులనుగాఁ జేయవలయును. ఈయుద్దేశముతో నే నపుడపుడు మార్దవము విడిచి పరిహాసములు పలుకుట జరుగుచున్నది. కాని, నిన్నటి సాహిత్యగోష్ఠిలోని నామాట ప్రభువును గొంత కష్టపెట్టి యుండును. నా "క్షమాపణము" వారితోఁ దాము చెప్పవలయును. అభిజ్ఞవరులగు తమకుఁ బెక్కు వివరింపనక్కఱ లేదు గదా!"

పట్టపురాణి యీపలుకులు విని శర్వవర్మ యెంతో నొచ్చుకొనెను. ఆమె పడుచున్న బాధ నర్థముచేసికొనెను. "దయార్ద్రహృదయుఁడగు హాలరాజు మీవిషయమున నన్యథా భావించువాఁడుకాఁడు. మతేమియు దిగులు పడకుఁడు. నేను వెళ్ళి ప్రభువులను దర్శించెదను...ఇదియు మేలునకే వచ్చిన దని సరదిచెప్పి మహామంత్రి నిష్క్రమించెను.

౫

మరునాఁడు ధాన్యకటకమునఁ గొలువులో హాల భూపాలుఁడు పసిఁడిగద్దె నలంకరించియుండెను. యథాపూర్వము శర్వవర్మయు గుణాఢ్యుఁడు వారివారిపీఠములయం దాసీనులై యుండిరి. మహారాజ్ఞి లీలావతియు సభ కొక

లలిత శోభను దెచ్చుచు హాలప్రభువు పరిక్క నుపవిష్టుఁడై యుండెను.

మాధవి, రేవ, అనుపలబ్ధ, అణులక్ష్మి మున్నగు కవయిత్రీరత్నములు సభాభరణములుగాఁ దీర్చియుండిరి. సంస్కృత ప్రాకృత దేశభాషావిద్వత్కవు లెందఱో సంస్థాన పరిషత్సభకు మండనాయమానముగాఁ గూరుచుండియుండిరి. పండితకవినిబిడమై కొలువు నీరవముగా విరాజిల్లుచుండెను.

ఆసమయమున ననభ్రవృష్టివలె హాలమహారాజు సభ్యలోకమును బరికించి యిట్లు పలికెను :

"మంత్రివరులారా! పండితశేఖరులారా! నిత్యసాహిత్యగోష్ఠుల ఫలముగా మాకొక క్రొత్త తలంపు కలిగినది. అది మీయెదుట వెల్లడించెదము.

ప్రపంచములోని ప్రతిభాషకు నొక ప్రత్యేకత, యొక విశిష్టత యుండవచ్చును. ఏభాషయైనను బఠించినతరువాతఁ గాని దానిలోని భావోన్నతి మనకు గోచరింపదుగదా! భాషావివాదములవలనఁ బ్రయోజనము లేదు. మాకుఁ బ్రాకృతభాషలో నున్నంత గాఢప్రవేశము గీర్వాణసాహిత్యములో లేదు. నేఁడు సంస్కృతవాణిని సాధించితీరవలె నని యభినివేశము పొడముచున్నది. వ్యాకరణశాస్త్రబలము లేని వట్టి వాఙ్మయ పరిచయము గాలిమేడ వంటిది.

కావున సరహస్యముగా వ్యాకరణ సర్వస్వము మాకు శీఘ్రకాలములో బోధింపవలయును. మీ పండితవర్గములో దీనికిఁ దగినవా రెవరో వచింపుఁడు".

హాలప్రభుని యీ యపూర్వాభిలాషమునకు సభలోని గీర్వాణభాషాపండితుల మనఃపద్మములు వికసించినట్లయ్యెను. ప్రాకృతభాషాకోవిదుల కబ్బురపాటు భంగపాటు వాటిల్లినటులయ్యెను. రాణి లీలావతి తలంపని తలంపుగాఁ బ్రియునకుఁ గలిగిన యపూర్వ మధురాశయమునకు మురిసిపోయెను. మబ్బులేని మెఱపుగదా! లీలావతి శర్వవర్మవంక సాశ్చర్యముగాఁ బరికించెను. శర్వవర్మ వినమ్ర దరహాస భాసురముఖముతో మహారాజ్ఞిని దిలకించెను. గుణాఢ్యునకు మనసు క్రుంగినటులుండెను. సభ కొలఁదినిమిషములు మౌనముద్రితము.

సాహసించి గుణాఢ్యుఁడు లేచి —

"ప్రభూ! శాస్త్రాభ్యాసము సాధారణమైనది కాదు. వ్యాకరణముకాదు, తర్కముకాదు, మీమాంసకాదు. ఏ శాస్త్రము నధ్యయనింపవలె నన్నను నిండుగాఁ బండ్రెండేండ్లు పట్టును. అందులో, శబ్ద శాస్త్రాధ్యయనము మఱియుఁ గష్టతరమైనది. అయినను, ప్రభువులు మేధానిధులు కాఁబట్టి యాఱు సంవత్సరములలో శబ్దశాస్త్రము నే నుపదేశింపఁగలను" అని వచించెను.

"ఆఱు సంవత్సరము" లన్నంతనే హాలరాజు గుండె లరచేత నొక్కుకొనెను. "అంతవఱకు నట్లె పఠించుచుండవల సినదే! శీఘ్రముగా సాధించుటకు వీలు కలుగదా!" యనెను. గుణాఢ్యుఁడు తలయడ్డపుటూఁపుతో 'నాకు సాధ్యముకాదు. తరువాతఁ బ్రభువుల చిత్తము' అని యూరకుండెను.

శర్వవర్మ గంభీరత కొంత సడలించుకొని యానందో త్సాహములు దాఁచుకొన యత్నించుచు హాలప్రభునిఁ గని యిట్లు పలికెను :

"మహారాజా! గుణాఢ్యమంత్రి మనవిచేసినట్లు శాస్త్ర పాఠమునకుఁ బండ్రెండేండ్లు పట్టుట లోకసామాన్యమైన విష యము. కాని, కుశాగ్రబుద్ధిసంపన్నులగు ప్రభువుల కట్లుగాక యాఱుమాసములలో సర్వశాస్త్రము బోధింపఁగలను. సంస్కృతభాషాభిలాష ప్రకటించుటయే మాకుఁ బదివేలు."

శర్వవర్మ మాటలు విని గుణాఢ్యుఁడు కోపాసూయలను బట్టలేకపోయెను. మంత్రుల కిరువురకు వాదము రేఁగెను.

గుణాఢ్యుఁడు:— "ఓయీ శర్వవర్మా! వేగిరపడుచున్నావు. మహారాజుగారెంత మతిమంతులైనను, నీవెంత బోధన శక్తికలవాఁడవైనను శబ్దశాస్త్ర మాఱుమాసములలో నధ్యయనించుట సాధ్యముకాని కార్యము. ఇది గర్వో క్తిగాఁ గనిపించుచున్నది. ఆఱు సంవత్సరములలోఁ జెప్పుటయే యసాధ్య మని నేను భయపడుచుండఁగా,

ఆఱుమాసములలో బోధించుటయే !! నిండుసభలో నిట్లు ప్రతారించి ప్రతిజ్ఞసేయుట యుచితము కాదు.

శర్వవర్మ:— ప్రతారణము కాదు. ఆఱు మాసములలో శబ్దశాస్త్రము చెప్పఁగల నని మరలఁ జెప్పుచున్నాను.

గుణాఢ్యుఁడు:— చెప్పవచ్చును. మహారాజులకు దెలియుట యసాధ్యమేమో!

శర్వవర్మ:— తెలియునట్లే బోధింపఁగలను.

గుణాఢ్యుఁడు:— ప్రభువు లన్యథా భావింపకుందురుగాక!... శర్వవర్మా! పుడమి తలక్రిందులైనను నీకిపని సాధ్యము కాదు.

శర్వవర్మ:— సాధ్యపడినచో, నేమందువు?

గుణాఢ్యుఁడు:— పెక్కేల, మహారాజా! శర్వవర్మా! సభాస్తారులారా! నాప్రతిన వినుఁడు. ఈ పెద్దమానిసి యాఱు నెలలలో 'శాబ్దము' బోధించి యభ్యర్థిని పండితునిగా దిద్దఁగలిగిననాఁడు సంస్కృత-ప్రాకృత-దేశభాషలు మూఁడును బరిత్యజించి మానినై కాంతారమున నివసింతును.

శర్వవర్మ:— గుణాఢ్యా! ఈప్రతిజ్ఞ తప్పరాదుసుమీ!

గుణాఢ్యుఁడు:— దైవసాక్షిగా.

శర్వవర్మ:— మఱి నాప్రతిజ్ఞ వినుఁడు. ఆఱుమాసములలో మహారాజును శబ్దశాస్త్రపారంగతునిఁ జేయలేనినాఁడు

గుణాఢ్యమంత్రి చేసిన ప్రతినయే నేనును జేయు చున్నాఁడను.

గుణాఢ్య శర్వవర్మల ప్రతిజ్ఞా వాక్యములు సభామండపమునఁ బ్రతిధ్వనించెను. హాలభూపతి యేదియెట్లైనఁ, దన కోరిక నెఱవేఱు నని సంతోషపడెను. భావి పరిణామముఁ దలపోసి సభ్యులు సంభ్రమాశ్చర్యములతో నిండ్లకేఁగిరి. లీలావతికి గుణాఢ్య శర్వవర్మల వివాదము శ్రవణానందకర మయ్యెను.

౬

శర్వవర్మ నిండుకొలువులోఁ జేసిన ప్రతిజ్ఞ సామాన్య మైనదికాదు. ఆఱు సంవత్సరములలో సాధ్యముగాని పని యాఱు మాసములలో నిర్వహింపఁబూనుట సాహసకార్యము కాకపోదు. దూరదర్శియగు మహామంత్రి యింతతొందరపడు నని యెవ్వరును భావింపలేదు. శర్వవర్మ పట్టుదల నెఱిఁగినవా రెవ్వరు నాతనిది తొందర యని యూహింపరు. రాజ్యతంత్రములలో నాతఁడు పెక్కుసారులు దారుణప్రతిజ్ఞలు చేసి కృత కృత్యుఁడగుచుండుట చాలమంది యెఱిఁగినదే. మఱి, ఇది సాహిత్యవిషయకమైన ప్రతిజ్ఞ! ఎట్లు పరిణమించునో!!

శర్వవర్మ కుమారస్వామి భక్తుఁడు. కుమారోపాసనమున నిరంతర నిష్ఠా పరతంత్రుఁడై రేలుంబవళ్లు కూరుచుండుట కలవాటు పడినవాఁడు. మానసికముగా నతనికే దేని యస్వస్థత కలిగినపుడు శక్తిధరోపాసనము చేసి దానిని బరిహరించుకొనుచుండును. రాజకీయముగఁ గ్లిష్టసమస్యలలోఁ దగులుకొన్నపుడు తత్పరిష్కారమార్గముగ షణ్ముఖారాధనము చేయుచుండును.

శర్వవర్మ కది పరీక్షాసమయము. ఏకదీక్షతోఁ గార్యసాధనమునకై కుమారారాధనమున కుపక్రమించెను. సుబోధము, సులభగమ్యము, సుందరము నగు శబ్దశాస్త్ర మతనికిఁ గావలయును. ఆశాస్త్రము హాలభూపతికి బోధించి యతనిని వైయాకరణుని జేయవలయును. ఇదియే శర్వవర్మ యభీష్టము.

సరిగా నొక నెలనాళ్ళు మహామంత్రి షణ్ముఖోపాసనములో దీక్షితుఁ డయ్యెను. కుమారస్వామి కరుణాకటాక్షముచే శర్వవర్మకు సులభసుందరమగు శబ్దశాస్త్రము స్ఫురించి రచింపఁ గలిగెను. రెండవ మాసమునుండి శాలివాహనభూపాలునకు శాస్త్రపాఠ మారంభమయ్యెను.

శాలివాహనుఁడు ప్రాకృతభాష నవలోడించిన కోవిదోత్తముఁడు. ఒక భాషనుగాని, ఒక శాస్త్రమునుగాని సాధించిన విద్వాంసునకు వేఱొకభాష వేఱొకశాస్త్రము మిక్కిలి సులువుగా వచ్చును. మహారా జేకసంథాగ్రాహి. శర్వవర్మ

మహాపండితుఁడు, శాస్త్రోపదేష్ట. ప్రభు మంత్రులిరువురు గురు శిష్యులగుట చూచువారికి వేడుకగా నుండెను. ఆ శైష్యోపాధ్యాయిక నరసి లీలావతి హృదయ మానందవీచికలలో దోఁగాడుచుండెను.

బ్రాహ్మముహూర్తమున హాలరాజు మేలుకాంచును. స్నానసంధ్యాదులైనవెంట వ్యాకరణశాస్త్రపాఠము. ఉదయము పఠించినపాఠము మధ్యాహ్న మొకసారి చింతనము చేసికొనును. దానితో మఱి మఱచిపోవుట యుండదు.

శర్వవర్మ గురుపీఠమున నుపవిష్టుఁడై బోధనము చేయు నపుడు హాలుఁడు వినమ్రుఁడై యాలించుట చూడఁగా "ఆహా! మహారాజభావ మేమైపోయిన" దనిపించును. తనకుఁ దెలియని విషయము వినయముగా గురువు నడిగి శిష్యుఁడు తెలిసికొనును. గురువు శిష్యుని ముఖవైఖరి నరసి యరంటిపండొలిచి చేతఁబెట్టినట్లుగా గూఢవిషయములు బోధించును.

'విశాలమైన సామ్రాజ్యభారము వహించుచున్న హాల నరపతి యైదుమాసములు తాత్పర్యముతో శాస్త్రాధ్యయనము చేయుట యేమి!' యని యాశ్చర్యపడినవారి నోళ్ళు కట్టువడినవి. సామ్రాజ్యము చక్కదిద్దుకొనుచు, శత్రువుల దండయాత్రలను బ్రతిఘటించుచు, దర్శింపవచ్చిన పండిత వర్గమును సత్కరించుచు, రాజకీయముగాఁ బొటమొల్లిన క్లిష్టసమస్యలను బరిష్కరించుచు హాలనేత హేలగా శాస్త్ర మధ్యయనించి

లంకప్రమైన పాండిత్యము నముపార్జించెను. అభినివేశముతో నఖిలము సాధ్యపడునుగదా!

సంస్కృతవాఙ్మయములో శబ్దశాస్త్రములో నేఁడు శాలివాహన భూజానికిఁ దెలియని రహస్యమొక్కటియు లేదు. సర్వము కొట్టినపిండిగా నుండెను. కొమ్ములుతిరిగిన కోవిదుఁడు దర్శనమునకు వచ్చినను నాతని నేదో ప్రశ్నించి శృంగభంగము చేయుచుండెను. గుణాఢ్యునితోఁ బ్రాకృతగోష్ఠి నెఱపు నా నరపతి శర్వవర్మతో సంస్కృతకవితా చర్చలతోఁ బ్రొద్దు పుచ్చుచుండెను.

పట్టపురాణి లీలావతి జీవితములో వసంతోదయమై నూతనపరికరణ మారంభమయ్యెను. ఆమె యాశ్చర్యబంధుర మైన యానందములో మునకలు వేసెను. వృద్ధుఁడైన చ్యవనుఁడు నవయౌవన శోభితుఁడైననాఁడు 'సుకన్య' పడిన సంతోషాతిశయము లీలావతి కపు డనుభూత మయ్యెను. శర్వవర్మయు, రాణియు, మహారాజు, నిరంతర సంస్కృత సాహిత్యచర్చలలో నిమగ్నులై యుండిరి.

హాలరాజు దేవభాషలో విద్వాంసుఁడైనపిమ్మట జరిగిన పరిషత్సభామండపము సుధర్మవలె భాసిల్లెను. హాలప్రభువు వదనపద్మమున నూతనరాగము విరాజిల్లుచుండెను. ఇన్నాళ్ళు లీలావతి లలితమంగళోజ్జ్వలమైన తేజోరేఖముందు హాలుని తేజోరేఖ కొంచెము సన్నవడియున్నట్లు తోఁచెడిది. ఇపు

డటులుకాదు. హాలుఁడు నేఁడు సంస్కృత ప్రాకృతములలోఁ బుంభావ భారతి.

తొల్లిటివలెనే నేఁడును శర్వవర్మయు గుణాఢ్యుఁడును నర్హాసనాసీనులై యుండిరి. మహామంత్రి ముఖము విచ్చిన శతపత్రమువలె నతిమనోహరముగా నుండెను. గుణాఢ్యుని మొగమున నెత్తురుబొట్టు లేదు.

నిశ్శబ్దమైన కొల్వుకూటమున గుసగుసలు బయలుదేఱి నవి. బహుకాలమునుండి ప్రభువునకుఁ బ్రాణప్రాణముగా మెలఁగిన గుణాఢ్యమంత్రి యరణ్యవాసమునకుఁ బాలుపడవల యును గాఁబోలు!

శర్వవర్మ లేచి యుపక్రమించెను. "ఏలినవారు గీర్వాణ భాషావైదుష్యమున నద్వితీయులైనారు. వలసినచో నిచట నున్నవారిలో నెవరేని వారితో వాక్యార్థములు జరుపవచ్చును. నాఁడు నేను చేసిన ప్రతిజ్ఞ దైవానుగ్రహమున సఫలమైనది. ఆఱుమాసములలో శబ్దశాస్త్రము బోధించుటయు గ్రహించు టయు నసాధ్య మనికదా గుణాఢ్యమంత్రి చెప్పెను ! ఇప్పుడు వారేమందురో!"

గుణాఢ్యుఁడు పరమగంభీరుఁడు. ఆతఁడు శర్వవర్మను గన్నెత్తి చూడలేదు. సభ్యులను దిలకింపలేదు. హాలునిం గని "ప్రభూ! దీక్షకు సాధ్యముకాని శాస్త్రములేదు. నా ప్రతిజ్ఞ ప్రకారము నేఁటినుండి సంస్కృత ప్రాకృత దేశభాషలను సన్య

సించి వానప్రస్థమును నెఱపుకొందును. సెలవా సంగు" డని యవనతవదనుఁడై మౌనియై కొల్వునుండి నిష్క్రమించెను.

సాతవాహనమహీపతి గుణాఢ్యునితోడి చిర సంబంధము విడిపోవుచుండుటచే విషణ్ణచిత్తుఁ డయ్యెను. శర్వవర్మయు నొక్కక్షణము గళస్తంభితాశ్రుఁడై నిలఁబడిపోయెను. కొలువు వేఁడినిట్టూర్పులతో నుడికిపోయెను. కొలువులో గుణాఢ్య మంత్రి కూరుచుండు పసిఁడిగద్దె కళాహీన మయ్యెను.

తెలుఁగు రాజధానియగు ధాన్యకటకములోఁ గ్రొత్త శక మారంభమయ్యెను. ఇదివఱ కెక్కడఁ జూచినను బ్రాకృత భాషా పండితులే; ఎక్కడ విన్నను బ్రాకృతకవితా ప్రసంగములే. ఇప్పుడు దేవభారతి ధాన్యకటకములో నర్తనము సేయుచున్నది. ప్రభువునుబట్టి లోకము మాఱును. వాఙ్మయము మాఱును. కళలు మాఱును. మతము మాఱును. సకలప్రవృత్తియు మాఱును.

రాజధానిలోఁ బ్రాకృతమున కుద్వాసనము. సంస్కృత భాష కావాహనము. ఈసంధికాలములోఁ గొందఱు వాఙ్మయ ఘర్షణములతోఁ గుమ్ములాడుకొనిరి. బౌద్ధమతముపై నాదరము సన్నగిల్లినది. వేదమతముపై విశ్వాసము ప్రబలినది. తెలుఁగుదేశమున వేదములు నుపనిషత్తులు క్రొత్త శోభతోఁ జిగురెత్తి కుసుమింపఁ దొడఁగినవి. శ్రీముఖుని 'నాంది'తో నుపక్రమింపఁబడిన బౌద్ధమత నాటకమునకు శాలి

వాహనుఁడు భరతవాక్యము పాడెను. శ్రుతిమతమునకు స్వాగతము చెప్పెను.

సాతవాహనభూపతి యుభయభాషా ప్రవీణుఁడు. ఆతఁడు సంతతము గ్రంథావలోకనముతోఁ బండిత ప్రసంగములతోఁ గవితాప్రశంసలతోఁ గాలక్షేపము చేయుచుండెను. లీలావతీ ద్వితీయుఁడై యాతఁడు అలంకారశాస్త్రమునఁ బరిశ్రమించెను. న్యాయ మీమాంసాదులుకూడఁ బఠించెను.

౭

అది ఘోరారణ్యము. క్రూరమృగముల సంచారము చూపఱకు చిత్తభీతి నొదవించుచుండెను. దట్టమైన వృక్ష సమూహముచే బట్టపగలు కూడ రాత్రి వలెనే కనిపించు చుండెను. నిశాచరులు పిశాచములు సంచరించు నీ మహార ణ్యమున మానవు లుండుటయే సంభవము కాదు. అందులో, ఏకాంకిగా నున్న యీ మానవుఁ డెవ్వఁడు!

ఒత్తుగాఁ బెరిగిన యీ బవిరిగడ్డములో దివ్యసుందర మైన తేజోరేఖలు రసబంధురమైన కవితా వాహిని వెల్లువ కట్టుచున్నట్లు కనఁబడుచున్నది. నిలిచివెలిఁగెడి మెఱుపు తీఁగల వలె విరాజిల్లు నాయన కనుఁదమ్ములలోఁ దీవ్రమైన

తపోదీప్తి పొడసూపుచున్నది. ఆతఁడు మహర్షియో, మహకవియో యూహింపనేరము.

మహర్షివలె నిరాశాభావముతో, నిస్పృహానేత్రములతోఁ బ్రకృతి పరిశీలనము సేయును. మహాకవివలె నిశితదృష్టితో భావనాభరిత సృష్టి చేయుటకు యత్నముచేయును. పరిసరమున నున్న ప్రకృతికి మూఁగచదువులు బోధించు విరాగివలె, దక్షిణామూర్తి యవతారాంశమువలె నతఁడు తోఁచుచున్నాఁడు. ఆతఁడెన్నఁడు మాటాడినట్లు కనుపట్టదు. అతనికే భాషయు వచ్చినట్లు తోఁచదు. దేవభాషగాని, ప్రాకృతముగాని, దేశభాషగాని యాతఁ డుచ్చరింపఁగా వినలేదు. మఱి, భాషరాని యతని నాశ్రయించి యిరువురు శిష్యులుండిరనఁగా నబ్బురముగా నుండదా?

అతనికి బుద్ధిపుట్టినపుడు శిష్యులకుఁ బాఠము చెప్పును. ఆ పాఠము పైశాచభాషలో సాగుచుండును. నాగరకుఁడైన పురుషుఁడు పైశాచము నుచ్చరించుటయేమి? వింతగానున్నది. ఆ పురుషుఁ డహోరాత్రము లేదియో వ్రాయుచున్నట్లే యుండును. భూర్జర పత్రములపై వాఁడిముల్లు పుచ్చుకొని తన రక్తము మషీరసముగా నుపయోగించి యతఁ డేదో గ్రంథము రచించు చున్నాఁడు.

ఆతఁడు రచించుచున్న గ్రంథపత్రములు దొంతులు దొంతులుగా శిష్యులు పేర్చి భద్రపఱుచుచుండురు. ఒకనాఁడు గురుని పరోక్షమున శిష్యులిట్లు సంభాషించుకొనిరి.

గుణదేవు(డు:— నందిదేవా! మన గురువుల గ్రంథరచనము చాల నాశ్చర్యముగా నున్నది! ఏడు సంవత్సరములు దగ్గఱ దగ్గఱగా నయినది! గ్రంథ సమాప్తి యెప్పటి కగునో తెలియదు.

నందిదేవు(డు:—అదే నేను ననుకొనుచున్నాను. శరీరమునందలి రక్తమంతయు హరించిపోవుచున్నది. గురువు లస్థిపంజరమువలె శుష్కించి పోవుచున్నారు. వేసినపీఠము తీసి నటులుండదు. ఏమి దీక్ష! ఏమి కవితాధోరణి!

గుణ:—అది యటులుంచుము. నందీ! గురువులు మొన్న నాకొక రహస్యము చెప్పినారు. నీవప్పుడుస్నానార్థము నదికి వెళ్ళితివి.

నంది:— అది నాకు(జెప్పవా ?

గుణ:— ఆచార్యులు సాతవాహనమహీపతి సంస్థానములో మంత్రులుగా నుండెడి వార(ట. ఆస్థాన విద్వత్కవిత్వ పదవికూడ వారిదేయ(ట. సంస్కృత ప్రాకృత దేశ భాషలలో వారు కవిత్వము చెప్ప(గలర(ట.

నంది:— వింతగా నున్నదే! మఱి వారెపుడును పైశాచము తప్ప నితరభాష మాటాడ రేమి కారణమో!

గుణ:—కారణముకూడ వారేసూచించినారు. సాతవాహనమహారాజు కొలువులో(దాము చేసిన యొక ప్రతిజ్ఞకు(గట్టువడి భాషాత్రయసన్న్యాసము చేయవలసివచ్చినద(ట.

నంది:— ఆ ప్రతిజ్ఞ యెందువలనఁ జేయవలసి వచ్చినదో చెప్ప లేదా!

గుణ:— లేదు. మఱి నే నడుగను లేదు.

నంది:— సెబాసు! మనగురువులు నాలుగు భాషలలో విశారదు లన్నమాట. చాలకాలముదాఁక వారు మౌనములో నుండెడివారు. అటు లుండియే పైశాచభాషలో వైదుష్యము సంపాదించినారు. చూచితివా! ఎన్నఁడును వారు మఱియొక భాష నుచ్చరింపనైన లేదు.

గుణ:— అవునుగాని, నందీ! నా కొక యూహ తోఁచుచున్నది. అది యెటు లుండునో యోచింపుము. మనగురువులు రచించిన గ్రంథ మీవిధముగా నడవిఁగాసిన వెన్నెల కాకుండ సాతవాహన మహీపతి కంకితముగా నిచ్చినచోఁ గీర్తిప్రతిష్ఠలతో వెలసి శాశ్వతముగా దేశమున నిలువఁగల దని తలంచుచున్నాను. ఆ మహారాజునకు మన యాచార్యశేఖరునిపై నపారమైన గౌరవాదరము లుండెడి వని తెలియుచున్నది. మన మిరువురము వెళ్ళి యా మహీపతిని దర్శించి గ్రంథమును జూపించి దానిలోని విశిష్టతను వివరించి చెప్పినచో నతఁడు కృతి గ్రహణమునకుఁ దప్పక యంగీకరించు నని తోఁచుచున్నది.

నంది:— 'బృహత్క-థ' వంటి మహాోత్కృష్ట గ్రంథమును గృతినందుటకు సాతవాహను(డొక్క-(డే సమర్థు(డు. కాని, నా కొకటి సందియము. ఎన్న(డో కొన్ని సంవత్సరములకు(బూర్వము మనగురువులు తత్సంస్థానమున నుండెడివా రంటివి. నవప్రియు(డు రాజ్యభారవహు(డు నగు హాలునకు మనగురువరులు జ్ఞప్తిలో నుందురా? యని—

గుణ:— అట్లనకుము. హాలు(డు సాహిత్యప్రీతికల రసజ్ఞు(డు. గురువులను విస్మరించినను 'బృహత్క-థా' గ్రంథ విశిష్టత గుర్తింప లేకపోవునా?

నంది:— నిజమే. రక్తము ధారవోసి రచించిన మహాగ్రంథము. ఆకథలు, ఆసన్నివేశములు, ఆవర్ణనములు, ఆకల్పనములు, ఆరసోచిత సంభాషణములు, ఆ యతిమానుష ఘట్టములు, ఆ యత్యద్భుత సంధానములు రసికచక్రవర్తియగు హాలుని మనస్సు నాకర్షింపకపోవుట యేమి? ఏడులక్షుల గ్రంథము! ఇట్టి బృహద్గ్రంథము తనపేర నంకిత మగుటయే ఘనముగా భావించి యాత(డు విధిగా నంగీకరించును.

గుణ:— నందీ! సందేహము లేదు. మనము వెంటనే పోయి యాచార్యు ననుమతిని బడయవలయును. ఇంతకును వారి యభిప్రాయమెటు లుండునో!

నంది:— తప్పక యనుమతింతురు.

గుణ:— కానిమ్ము. మనవిచేసి చూతము. యత్నించుట మనవిధి. ఫలితము దై వాధీనము.

—:o:—

౨

అదిగో, మహారణ్యము ప్రక్క నొక పర్వతము. ఆ కొండ మీఁద నతఁ డొక ఋషివలె నున్నాఁడు. అతని ముఖములో దుఃఖచ్ఛాయ స్పష్టముగా గోచరించు చున్నది. ధీరోదాత్తమైన యతని హృదయ మెంత గంభీరముగా నుండ వలసియున్నదో, యంత బేలవడిపోవుచున్నట్లున్నది. అతని యెట్టయెదుట హోమకుండము ధగద్ధగాయమానమై వెలుఁగు చున్నది.

ఇరువురు యువకులు భూర్జరపత్రముల దొంతరలు తెచ్చి హోమకుండము దగ్గఱఁ జేర్చుచున్నారు. వారు గుణ దేవ — నందిదేవులు! ఋషివలె గోచరించు నతఁడు గుణాఢ్య మహాకవి!! భూర్జరపత్రములపై రచింపఁబడినది 'బృహత్కథ'. ఆ బృహత్కథను గుణాఢ్యుఁడు హోమము చేయుటకుఁ బూను కొన్నట్లు తోఁచుచున్నది. కానిచో, మండుచున్న చితాగ్ని ముందు గ్రంథపత్రములు చేర్చుటకుఁ గారణ మేమైయుండును?

గుణాఢ్యమహాకవి యగ్నికుండమునకుఁ బ్రదక్షిణించెను. ఆతని వెంట గుణదేవ నందిదేవులును వహ్నిప్రదక్షిణము గావించిరి. అప్పటి యా గురు శిష్యు లచ్చముగాఁ ద్రేతాగ్నిహోత్రములను దలఁపునకుఁ దెచ్చుచున్నారు. అమృతజ్యోతియై లోకమున శాశ్వతముగా విరాజిల్లఁగల దొక మహాగ్రంథమును భస్మముచేయు దురవస్థ తనకుఁ దటస్థించుచున్న దన్న దిగులుతో నగ్నిహృదయము మూఁడు వ్రక్కలైన దన్నట్లు గురుశిష్యులు విషణ్ణచిత్తులై కూరుచుండిరి.

ఒక్కింతతడవుకిఁ బరమనిశ్చలములైన గుణాఢ్యుని లోచనములు బాష్పసేచనమునఁ జెమ్మగిల్లినవి. ఆయన వహ్నిదేవునకు దోయిలించి యగ్నిప్రజ్వాలనార్థమో యన్నట్లు నిట్టూర్పులు విడుచుచు నిట్లు 'సామిధేని' మంత్రములం బోని వాక్యము లుచ్చరింపఁదొడఁగెను:

"అగ్నిభట్టారకా! కొన్నియేండ్లనుండి నీకొఱకీ గ్రంథమును రచించి భద్రపఱచియుంచితిని. నీ వాఁడి నాలుకలు చాచి దయావీక్షణములతో 'బృహత్కథ'ను నీలోఁ గలుపుకొనుము. ఎక్కడ దోషమున్నదో, అక్కడఁబట్టి నిర్మలముచేయు నీవంటి రసికుఁడు — నీవంటి పవిత్రుఁడు నాకృతి నందుకొన్నచో నంతకంటె ధన్యత యేమి కావలయును!

మహారాజుల సన్నిధిని జేతులు నలిపి సేవించి విసివిపోయితిని. నా కవితామృతధార నీకుఁ జూఱలిచ్చుచున్నాను.

మెచ్చి, నా బృహత్కథా కావ్యము నందుకొనుము. ఇది మూడేండ్లు నాచేసిన తపస్సు పంట. సాతవాహన మహీజాని యీకృతి నాదరించు నని యెంచి శిష్యులచేఁ బంపించితిని. పైశాచభాష యనా భూవరునకు నచ్చక నిరాకరించెనఁట,

ఇంతకును, నాగ్రంథము నీలో శాశ్వతముగా నిలిచి యుండు యోగమున్నది కాఁబోలు! కానిచో, రసిక చక్రవర్తి యగు హాలుఁడు భాషావేషమును బట్టి గుణాఢ్య గ్రంథమును ధిక్కరించుట తటస్థింపదు.

వహ్నిదేవా! వేనవేలు కావ్యములు కాలము కడుపున నడఁగిపోయినవి. నాకృతి జానకీదేవి వంటి పవిత్రశీల యైనచో నీవే శీతలత్వము వహింపవచ్చును. ఎవరు చెప్పఁగలరు! నా ప్రాణప్రియ రచనమైన 'బృహత్కథ'ను స్వీకరించి యీ పేదపండితుని దీవింపుము.”

గుణాఢ్యమహాకవి కన్నులనుండి తొరఁగు బాష్పకణములచే బృహత్కథాగ్రంథపత్రములు చెమ్మగిలినవి. చెమ్మ వడిన కృతిపత్రములు వహ్నికి ముట్టించి వెచ్చపెట్టఁ దలఁచి నాఁడు కాఁబోలు! పాపము! ఒక్కొక్క భూర్జపత్రమే శిష్యుఁడు గయికొని డగ్గుత్తికతోఁ బఠించుచున్నాఁడు. పఠనానంతరము గురువు పత్రమందుకొని యశ్రుసిక్తనేత్రములతోఁ దాని నగ్నికుండమున నాహుతి నొసర్చుచున్నాఁడు. అది ఘోరమైన కావ్యహోమము.

కవితారస పిపాసతో నగ్ని దేవుఁడు నాల్కలు చాచుకొని యొక్కొక్క యాకే యందుకొనుచుండెను. తన కావ్యములోని యొక్కొక్కయాకు దగ్ధమగుచుండఁగా గుణాఢ్యునకు హృదయశతపత్రము నందలి యొక్కొక్క రేకు మాడి యూడిపోవుచున్నట్లుండెను. పరమాద్భుతములగు కథాసన్ని వేశము లెన్ని తఱిగిపోయినవో! ధీరోదాత్తులగు కథానాయకు లెందఱు సురిగి పోయిరో! అపూర్వ సుందరములైన యెన్ని 'పాత్రలు' బూడిదపాలయ్యెనో! అతిలోక మనోజ్ఞములైన యెన్ని వర్ణ నాత్మక ఘట్టములు నుసియైపోయెనో! వేలకొలఁది మహాకథలు! లక్షలకొలఁది యుపకథలు!! పిచ్చుకగూఁడల్లి నట్లుగా నున్న గాథా సంధానము.

అట్టి మహోత్తమ గ్రంథము 'బృహత్కథ' యీవిధముగా నాహుతి కావలసిన దేనా! ఏడులక్షల గ్రంథము! ఎన్నాళ్ళు పరిశ్రమించి, యెంత రక్తము దారవోసి, యెంత మేధావిశేషము ప్రదర్శించి రచింపఁబడిన గ్రంథమో! అక్కటా! తాను గని పెంచిన కావ్యసుందరిని చేతులార గుణాఢ్యుఁడు వీతిహోత్రున కర్పించుచున్నాఁడు. ఆఁతడెంత నిర్దయుఁడో!

"మహాప్రభూ! చాల వింతగా నున్నది. మేమెక్కడ నెప్పుడు చూడలేదు. ఆయన యెవరో తెలియదు. ఋషివలె నున్నాఁడు. ఆయన వెంట నిరువురు యువకు లున్నారు. వారు శిష్యులఁట. ఆయన వారికి గురువఁట. ఋజపత్రిరి రేకులపై నాయన కైతకట్టి వ్రాసిరని చెప్పుకొనుచున్నారు.

కొండమీఁద నొక యగ్నికుండము శిష్యులు సిద్ధము చేసిరి. ఆశిష్యులలో నొకఁడు భూర్జరపత్రములపై నున్న యేదో గ్రంథము చదువుచు నొక్కొక్క పత్రమే గురువున కందిచ్చుచుండును. ఆయాకు గురువు వహ్నికుండములోఁ బడవేయుచుండును. ఆయన కన్నులు చెమ్మగిల్లి యుండును. చిత్రములోఁ జిత్రము! ఆప్రాంతముననున్న పశుపక్ష్యాదులు సైతము చుట్టుచేరి యాగ్రంథము నాలకించుచున్నవి. నిద్రాహారములు మాని యహోరాత్రము లా పఠన మట్లు సాగుచుండఁగా నడవిజంతువు లాలించుట యద్భుతముగా నున్నది. ఆభాష మాకుఁ దెలియదు.

దేవరవారు దయచేసి యీ ఘోరము తొలఁగింపవలయును. అది యేమిగ్రంథమో, ఆతఁడెవఁడో, ఏకారణ

మున నాగ్రంథము హోమముచేయుచున్నాఁడో చిత్తగింపఁ గోరుచున్నాము.”—

వేగరుల విన్నపమువిని సాతవాహనమహీపతి నిర్విణ్ణుఁడయ్యెను. ఒక్క క్షణకాల మాతఁడు వారి మాటలు విశ్వసింపలేకపోయెను. పిమ్మట విశ్వసించియు నాహుతిచేయఁబడుచున్నది యొక గ్రంథమని నమ్మలేకపోయెను. ఏది యెటులైన నచ్చటకు వెళ్ళుటయే యుక్తమని నిశ్చయించుకొనెను.

చారులు దారిచూపఁగా హాలప్రభువు కావ్యహోమము జరుగు కొండకొమ్ము దరిసెను. ఆతఁ డించుక దవ్వుల నుండఁగనే చిటచిట ధ్వనులతో మండుచున్న వహ్నికుండము కంటఁబడెను. దగ్గఱకు వచ్చుచున్నకొలఁది హాలరాజున కేదో చెప్పరాని హృదయపరితాపము ప్రారంభమయ్యెను. జరుగుచున్న ఘోరకార్యమునకుఁ దానే కారణ మన్నభావ మతనికిఁ బొడమెను.

ప్రదీప్త శిఖా సముజ్జ్వలమైన చితాగ్నిహోత్రము వేఁడి హాలభూతల నాథుని ఫాలమునకు సోఁకెను. వహ్నిజ్వాలల యంతరములనుండి యొక మహానుభావుని, ఒక మహాకవిని, ఒక పూర్వమిత్రుని దర్శించి యీ తెలుఁగుఱేఁడు నిశ్చేష్టుఁడయ్యెను. తానుజూచిన మహాకవి యశ్రుధారలచల్లఁదనము కొంత శాంతపఱచెనో యన్నట్లుగా, హాలుని హృదయ ముత్తరక్షణ

మున ప్రకృతిలోనికి వచ్చెను. అంతలో నాసుహీపతి కొక యమృతస్మృతి.

"ఓహో! గుణాఢ్యమంత్రిలా? ... మహాత్మా! ద్రోహము; కావ్యాహుతి చేయుచున్నారా? మా ప్రార్థన మాలించి గ్రంథహోమము చాలింపుడు చాలింపుడు".

హాలప్రభువునకు గంతము గాద్గద్యము వహించెను. అతఁ డగ్నిజ్వాలలలో సగము సగము కాలిపోవుచున్న భూర్జర పత్రము బయటికి లాగి చల్లారఁబెట్టి వహ్నిశిఖల కందిచ్చు వేఱొక పత్రమును బ్రక్కకు నెట్టి, మహాకవి చరణయుగమును ముట్టెను. సాతవాహనప్రభువు రాక నరసియో యన్నట్లు వీతిహోత్రుఁడు తన మంటల నణంచుకొనెను. కావ్యపఠన దీక్షలోనున్న గుణదేవ నంది దేవులకు జీవముపోసినట్లు మహా నందము కలిగెను.

గుణాఢ్యుఁడు మౌనవ్యాఖ్యతో సాతవాహనభూపతిని కౌఁగిలించుకొని యశ్రువులతో నాతని భుజములు తడిపెను. ఎన్నాళ్ళ యెడఁబాటు! ఏడేండ్లు పయిగా నయినది గుణాఢ్యుఁడు హాలసంస్థానమును విడిచివచ్చి. ఏయొక్కనాఁడును గుణాఢ్యుని చూడకుండ హాలుఁ డుండెడివాఁడు కాఁడు. ప్రతి క్షణము గుణాఢ్యునకు హాలస్మరణయే. అట్టి దృఢస్నేహ పాశమును దెగఁద్రెంచుకొనియున్న మానిని నేఁడు దర్శించి హాలపతి యెట్టియానందమనుభవించెనో! అది నిర్వచింపరానిది.

అంతట, గుణాఢ్యుని ప్రక్క నంజలిబంధములతో నిలఁబడియున్న గుణదేవ నందిదేవులను హాలరాజు కనుఁగొని యొకానొక తలంపు తెచ్చుకొని కవివరునెదుట దోయిలివట్టి యీతీరున వచించెను:

"మహాత్మా! ఈ యువకుల నిరువురను జూడఁగా మా కొక విషయము జ్ఞప్తికిఁ దగులుచున్నది. కొన్నాళ్ళకింద టవీరిరువురు భూర్జరపత్రస్థమైన యొక గ్రంథను మాకడకుఁ దెచ్చి చూపించి "యిది మాగురువుల రచన యనియు దీని నంకితముగా గ్రహింపుఁ" డనియుఁ జెప్పినారు. తామే వారికి గురువులై యుండిరని మేము నమ్మనేరక కృతిస్వీకారమునకు నిరాకరణము చేసియుంటిమి. భాష పైశాచమనియు, వ్రాఁతరక్తమయమనియుఁ బత్త్రిములు భూర్జర పత్త్రిములనియుఁ జెప్పఁగా మా కది యేదో వింతగాఁ దోఁచినది. అది కారణముగాఁ దిరస్కరించినమాట వాస్తవము. అంతమాత్రమునకా యీగ్రంథహోమము! కవిత్వసుందరి నీవిధముగా భస్మము చేయుట భావ్యముకాదు. మా పరిపాలనములో నిట్టి దారుణ కార్యము జరుగుట మాకేకాదు, మా సామ్రాజ్యమునకే నష్టహేతువు. మా యపచారము మన్నించి పూర్వస్నేహము పాటింపవలయునని వేఁడుచున్నాము. బృహత్కథా శేషమున కిదే మా యంజలి."

సాతవాహనమహారాజు ప్రార్థనమునకుఁ బశ్చాత్తాపమునకు గుణాఢ్యుని నిండుడెందము కరఁగి, కరుణాభరిత

మయ్యెను. దగ్ధశేషములైన కృతిపత్త్రములు చూపి గుణా ఢ్యుఁడు హానమధురమైన కటాక్షముతో హాలరాజు ననుగ్ర హించెను. హాలప్రభువు బృహత్కథకు దోయిలిఁబట్టెను.

గుణాఢ్యునితో నెన్నో నూతన విషయములు ముచ్చ టింపవలయునని హాలుఁ డువ్విళులూరినాఁడు. కాని, గుణా ఢ్యుఁడు సంస్కృత ప్రాకృత దేశభాషలలో హాని. పైశాచము హాలరాజున కర్థముకానిభాష. ఇంకఁ గవి రాజుల పరస్పర సంభాషణ మెట్లు? ప్రతిజ్ఞా నిర్వాహణమునకై యలనాఁడు కొలువువీడునపుడు గుణాఢ్యుని నోటనుండి వెలువడిన మాటలు స్మృతికిఁ దెచ్చుకొని హాలుఁడు నిట్టూర్చెను.

శిష్యులకు సన్న చేసి, యామహాకవి "పైశాచము"లో నీ తెఱఁగునఁ దన చరమసందేశము వినిపించి హాలప్రభువునకుఁ బ్రాకృతములో ననువదించి చెప్పవలసినదని యాజ్ఞాపించెను.

"సాతవాహన మహారాజా! నీయశస్సు యావదాంధ్ర మునకేకాక యావద్భారతదేశమునను సనాతనమై యుండఁ గలదు. నీవు కవివి. కవివత్సలుఁడవు. నీవంటి మహా ప్రభువునుగన్న యాంధ్రదేశము నిజముగాఁ బరమధన్యమై నది. ప్రాకృతభాషలో నద్వితీయమైన నైదుష్యమును సంపాదించి, యొకానొకపట్టుదలతో నాఱుమాసములలో గీర్వాణ సారస్వతము నెల్లఁ బుడిసిలించి, దేశభాషలోఁ బ్రతిభా సంపద గడించి, "గాథాసప్తశతి" కావ్యసంకలనముచే

నమృతమధురమైన రచనాపాటవమును బ్రకటించి, మహా కవుల కెందఱకో యాశ్రయ మిచ్చి, నూతన శకస్థాపకుఁడవై, కవివత్సలుఁడవై, దుర్వారబాహుబల సంపత్సమేతుఁడవై, నిరస్త సమస్త శాత్రవుఁడవై వెలసిన ప్రభుమౌళివి. నీ చరిత్ర యాదిక్షత్రశిరోమణుల చరిత్రమునకు దీటు వచ్చునది. భావిరాజేంద్రులకు నీసాహిత్యరక్తి యొరవడియై పరిఢవిల్లఁ గలయది. ఒకవంక రాజ్యతంత్రములు దిద్దుకొనుచు, వేఱొక వంక వాఙ్మయమును సేవించుకొనుచు సాగించుచున్న నీజీవిత యాత్ర యాంధ్రరాజచరిత్రమునఁ బ్రథమోదాహార్యమైనది.

కవుల నెంత యాదరముతోఁ జూచి గౌరవించితివో, కవయిత్రులనుగూడ నంత యాదరగౌరవములతోఁ దిలకించిన విశాలహృదయుఁడవు. అణులక్ష్మి, అనుపలబ్ధ, రేవ, మాధవి మున్నగు కవయిత్రీ రత్నములు నీకీర్తికిరీటాగ్రమున విరాజిల్లు చుందురు.

కారణాంతరములచే నీసేవాభాగ్యమునకు దూరమై యీ కాంతారమున నున్నను, హాలరాజు గుణాఢ్యహృదయమున నిత్యనివాసి. పైశాచభాషలో రచింపఁబడిన యీ 'బృహత్కథ' దగ్ధశేషము నీకు హృదయపూర్వకముగా నర్పించు చున్నాను. ఆఱులక్షలగ్రంథ మిందాఁక భస్మమైనది. ఇంక మిగిలినది యొక లక్షగ్రంథము.

వీరు గుణదేవ నందిదేవు లను నాశిష్యులు. వీరివలనఁ బైశాచభాష నభ్యసించి యీగ్రంథమునకుఁ బ్రచార

ప్రశస్తులు తేవలయునని కోరుచున్నాను. నీ 'కథాపీఠము'తో 'బృహత్కథ' ప్రపంచసాహిత్యమున ధ్రువతారమై విరాజిల్లుఁ గాక!"

గుణాఢ్యుని చరమసందేశము మృదుముగ్ధమైన సంస్కృతభాషలో ననువదించి నందిదేవుఁడు సాతవాహనమహారాజునకు వచించెను. సాతవాహనుని మేను హర్షపులకితమయ్యెను. ఆ జేని దోసిలిలో గుణాఢ్యుని యామోద మేదురకటాక్షప్రసవములు పడి యందగించి పరిమళించెను. గుణాఢ్యకవి యోగమార్గముచే దనుత్యాగము చేసికొని పునరావృత్తిరహితమైన దివ్యపదము నలంకరించెను.

సాతవాహనుఁడు 'పైశాచము' కూలంకషముగా నభ్యసించి 'బృహత్కథా'కృతి ప్రశస్తి గుర్తించి దానికిఁ గథాపీఠము వెలయించెను. 'బృహత్కథ' కాలవశమున నేఁడు కానఁబడకున్నను, తద్గ్రంథపోషకుఁడైన సాతవాహనుని కీర్తిని స్థిరము చేసిపోయినది. సామ్రాజ్యాధిపతులలో నింతటి సారస్వతప్రీతి కలవారెందఱుందురు? ఇన్ని వాఙ్మయములలోఁ బాండిత్యము గడించినవారెందఱున్నారు? హాలరాజా! తెలుఁగుచరిత్రలో నీవు నిజముగా నమృతజ్యోతివి.

మాధవవర్మ.

౧

అది నడిరేయి. గుడ్డివెన్నెలసాయముతో నొక చిట్టడవిదారిఁబడి ప్రయాణము సాగించుచున్న యామెయెవరు? ఈ యర్ధరాత్రమున నామె యెక్కడకుఁ బోవుచున్నది? ఆమె ముందు వేఱొకస్త్రీవ్యక్తి మార్గదర్శకురాలై నడచుచున్నది. ఆమె వేసమునుబట్టి చూచినచో దాసివలెను, వెనుకనున్న యిల్లా లొకరాజపత్నివలెను స్పష్టపడుచున్నది.

ఎండకన్నెఱుఁగని సుకుమారగాత్రి, కాలు క్రిందఁబెట్టినచోఁ గందిపోవు పూఁబోడి, చూలాలివలె నడువలేక నడువలేక నడచుచున్నది. ఆమె నిట్టూర్పు గాడ్పులసందడి ప్రకృతి నిశ్చలతను భంగపఱచుచున్నది. ఒకానొక సంభ్రమముతో మిట్టపల్లములలోఁ దడఁబడుచు నడువవలసిన యవస్థ యామెకేల కలిగినదో! దాసి చేయూఁతనీయఁగా నా యంగన పాపము! కంటకావృతమైన త్రోవవెంట నడచి నడచి బడలి నిలఁబడిపోయినది. దాసి కనులలో నశ్రువులు గిఱ్ఱునఁ దిరిగినవి.

"అమ్మా! నీ కెటువంటి దురవస్థ తటస్థించినదమ్మా! ఒక సామ్రాజ్యనేతకుఁ బట్టమహిషివై యుండి, స్వర్ణపీఠము నుండి కాలుకదపని భాగ్యవతిగా బ్రతికి తుదకీ దిక్కుమాలిన కాలిబాటలలో సంచరింపవలసి వచ్చినది. పైగా, నెనిమిది నెలల గర్భిణివి. దుర్భరమైన దుఃఖము దిగమ్రింగుకొని యర్ధ రాత్రమునఁ బ్రయాణించుట! మహారాజ్ఞీ! నాకడుపు తరుఁగు కొని పోవుచున్నది.

రాణి:—చారుమతీ! దైవము ప్రతికూలించినప్పుడు మన మేమియుఁ జేయఁజాలము. తొలిజన్మమున నేను జేసిన పాపము లిట్లు కట్టి పీడించుచున్నవి. నన్నెక్కడకుఁ గొంపోవుచున్నావు! నీ బలవంతముచే నడచుచున్నాను గాని బొత్తిగా నోపికలేదుసుమా!

చారుమతి:—ఓపిక యెటులుండునుతల్లీ! నీ వెప్పుడైన నిట్టి ప్రయాణముచేసి యెఱుఁగుదువుకనుకనా? ఈముండ్లలో నీవంటి రాణినిట్లు నడపించుచున్న నేనెంత దుష్టురాలను!

రాణి:—నీవేమి చేయుదువు? నాయదృష్ట మిట్లున్నది. ఆ దుష్టుఁడు కటకరాజు కత్తితో నన్నుఁగూడ నుత్తరించిన నిట్టికష్టము లేకపోయెడిది, ఈ యనాథప్రాణమును సంరక్షింపఁ జూచుచున్నావు. చారుమతీ! నీకును నా యెడలఁ గరుణలేదా?

చారుమతి:—మహారాజ్ఞీ ! యెంతమాట యనుచున్నావు ! ప్రధానామాత్యుని యాదేశానుసారము నీ గర్భస్థమైన వంశాంకురమును గాపాడుటకుఁ దీసికొని వెళ్లుచున్నాను. ఎన్నికష్టములకు లోనైనను సంతానము నిలుపుకొనుట యవశ్యకర్తవ్యముకదా! దుర్లలితుఁడైన కటకరాజు బల్లహుఁడు రావణునివంటివాఁడు. వాని కంటఁబడకుండ వెలుఁగురాకుండ మనము 'అనుమకొండ' చేరుకొనవలయును. నాబుజము నవలంబనము చేసికొని ధైర్యము వహించి యడుగు వేయుము.

రాణి:—అయ్యో ! దైవమా !

చారుమతి:—నిండుచూలాలివై యడవివెంట నడయాడుచున్న నీయవస్థ చూడఁగా, శ్రీరామ పరిత్యక్తయై కాననములో దిక్కుగానక సంచరించు జానకీదేవిగాథ తలంపునకు వచ్చుచున్నది.

రాణి:—ఆ తల్లితో నీదురదృష్టవంతురాలిని పోల్చుచుంటివా?

చారుమతి:—సుక్షత్రియుఁడగు సోమదేవ భూపాలుఁడు సామాన్యుఁడా? తల్లీ ! అట్టి ప్రభువరునకుఁ బట్టమహిషివై వెలసిన నీభాగ్య మేమంతతక్కువ?

రాణి:—చారుమతీ ! నా కుడికన్నదరుచున్నది. కటకరాజు బల్లహునితో యుద్ధము చేయుచున్న ప్రాణేశ్వరుని గూర్చి దిగులుగానున్నది. వానికి బాసట యెవరేని

యుండిరో లేదో! భర్త నెడఁబాసి స్వప్రాణ రక్షణమునకై యత్నించుచుంటిని. ఛీ. నాబ్రదుకెందులకు!

చారుమతి:—అమ్మా! అధైర్యపడకుము. పూర్ణగర్భవతివై యుండి యీ విధముగా విలపించుట మంచిదికాదు. అనుమకొండ దరియ వచ్చుచున్నాము. తెలవాఱకుండ నాయూరఁ బ్రవేశించవలయును. మహామాత్యుఁడు నా కిటు లాదేశించినాఁడు. 'బల్లహుని బరిమార్చి సామ్రాజ్యము నేలఁగలబిడ్డ రాణికడుపున నున్నాఁడు. వాని భద్రత యవసరము. నీవు జాగ్రత్తగా మహారాజ్ఞిని గొంపోయి యనుమకొండఁజేర్పు" మని.

రాణి:—అయ్యో! ఏమే చారుమతీ! చల్లఁగాజెప్పుచున్నావు. ప్రభువున కేదేని యిక్కట్టు రాలేదుకద! ఆత్మహత్య చేసికొందమన్నచోఁ గడుపుకోఁతయొకటి! ఇస్సీ! ఎంత నిర్భాగ్యజీవిత మైనది!

చారుమతి:—కడచినదానికి వగచి కార్యములేదు. రాజ్యతంత్ర ధూర్వహుఁడగు ప్రధాని చెప్పినట్లు మనము చేయుట శుభోదర్కము.

రాణి:—శుభోదర్కము! నా బ్రదుకునకింక శుభముకూడనా! కందారపుర దుర్గమును దాఁటివచ్చిన క్షణముననే నా జీవితమొక దుర్గమారణ్యమునఁ బ్రవేశించినది.

కానిమ్ము. అనుమకొండలో మన కాశ్రయమిచ్చువా రెవరు? మనల నాదరించువా రెవరు?

చారుమతి:—భక్త రక్షకుఁడు 'మాధవుఁ' డుండఁగా మనకు లోటేమి?

౨

సోమదేవుఁడు కందారపురము రాజధానిగా నాంధ్ర దేశమును బరిపాలించుచుండెను. అతని తండ్రి విజయపాలుడు. విజయపాలునితండ్రి నందభూవరుఁడు. సోమదేవుఁడు తాత తండ్రులను మించి ధర్మ నిబద్ధ బుద్ధియై రాజ్యపాలనము సేయు చుండెను. ఆతని పరాక్రమసంపదకుఁ బరనరపతులు వెఱఁగు పడి పలాయితు లగుచుండిరి. మల్లికార్జునదేవునిపై సోమ దేవునిభక్తి యద్వితీయమైనది. ఆతఁ డెంతభక్తుఁడో అంత ధర్మాసక్తుఁడు.

గోవులయెడల న్నా మహీపతికిఁ గల భక్తిభావ మపార మైనది. సువిశాలమైన యాతని గోష్ఠమునందుఁ గొన్నివందల ధేనువులు నిరంతరము పూజింపఁబడుచుండును. చిత్రవర్ణ భాసురములగు నావులను బరికింపవలయునన్నచో సోమదేవుని గోశాలకుఁ బోవలయును. దేశములో నెక్కడనున్న కపిల

గోవులను గొనితెచ్చి తన యాలమందలో నుంచుకొనుట యాతని కోర్కె ముచ్చట.

కుంజపొదుఁగులు నేల నంటఁగాఁ, బచ్చిక మేసి సమీప నదీతోయములు త్రావి తనుపుతోఁ దలిపిమూడలను నాకి పాల చేఁపుల నోలికించు నాలమందలలో సోమదేవుఁడు ప్రాతస్సాయం సమయములయందు గోపాలకునివలెఁ దిరుగాడుచుండును. భద్రాచలమునందును, మంత్రకూటమునందును సోమదేవునకు ధేనుసంఘము లున్నవి. ఆసంఘముల సంరక్షణమున కధికారివర్గము నేర్పఱచి యతఁడు పుణ్యాకాంక్షతో వానిని పోషించుచుండును. కోటలోని సౌధోపరిభాగమునుండి సోమదేవుఁడు ప్రభాతమున మేల్కొనిన వెంటనే సహస్రగోదర్శనము చేయుచుండును. ప్రతి ప్రాతఃకాలమున నామహారాజు గోష్ఠప్రదక్షిణము సేయుచుండును. పంచగవ్య ప్రాశనముతో సుపవిత్రమైన నాతని దేహము పరిమళించుచున్న బంగారువలె భాసిల్లుచుండును.

రత్నాభరణములతో, బంగారు తొడుగుల శృంగములతోఁ, బసుపుఁగుంకుమలు కలిగిన మోములతో సోమదేవుని యావులు కంటఁబడినపుడు నిజముగా గోలోక సందర్శనానందానుభూతి కలుగును. జాము జాము చేఁపి పొదుఁగెండని పాడియావులు కొన్నివంద లాతనిమందలోఁ గలవు. గోప్రదక్షిణము భూప్రదక్షిణము వంటి దని యాతని

సంపూర్ణమైన విశ్వాసము కలదు. సర్వదేవతలు గోమాతలో నుందు రని యాతనికి నమ్మకము.

గోవులను, ధరణీదేవులను, దేవదేవుని నిరంతరార్చనలతోఁ దనుపుచు సోమదేవుఁడు కందారపురరాజ్యము శాత్రవబృంద భయంకరముగాఁ బరిపాలించుచుండెను. సోమదేవ భూపాలుని పట్టపురాణి సిరియాలుదేవి. ఆమె పతి కనుకూలవతియై సుగుణశీలోన్నతయై పేరుగాంచెను. గోసేవావ్రతమున సోమదేవుఁ డెంత శ్రద్ధాపరుఁడో, సిరియాలుదేవి యంత శ్రద్ధావతి. ఆరాజదంపతులు గోష్ఠ ప్రదక్షిణము చేయునపుడు చూపఱకు నేత్రోత్సవముగా నుండును.

నేఁడు సోమదేవభూపతుని కపూర్వమైన వేడుక. ఎన్ని భాగ్యములు పట్టినను బుత్రజన్మసన్మైభవమున కతఁ డిందాఁక నోఁచలేదు. ధేనుపూజాఫలముగా 'సిరియాలుదేవి' గర్భవతియైనదన్నవార్త సోమదేవుని చెవిలో సుధావింపుపలెఁ బడెను. ఆ ప్రభువున కింక వలసిన దేమి!

ఏనాఁడు చెవులపండువగువార్త నాలించెనో, ఆనాఁడే గుండెదిగులు కలిగించు నొక యుదంతము సోమదేవభూకాంతుఁడు వినవలసివచ్చెను. చంద్రునిలోఁ గళంకము!

గూఢచారుఁడొకఁడు మహారాజును దర్శించి నమస్కరించి యిట్లు వచించెను: "ప్రభూ! తెలుఁగుదేశము నాల్గుచెఱఁగులు తిరిగి పరికించితిని. ఎక్కడఁ విన్నను దేవరవారి

గుణగణములను బ్రశంసించు వాక్యములు మాఱుమ్రోగు చున్నవి. ప్రభువుల గోసేవావైభవమునుగూర్చి, దైవభక్తిని గూర్చి, ధర్మపాలనమునుగూర్చి జనులు ముచ్చటించుకొను చున్నారు. కాని, ఒక్క విషయము మనవిచేయుటకు నాకు భయముగానున్నది. కటకరాజు బల్లహుఁడు దుష్టభావములతోఁ గందారదుర్గము ముట్టడించుటకుఁ జాలనాళ్ళనుండి రహస్య యత్నములు చేయుచున్నాఁడఁట. ఒక భూగృహములో సైన్యమునుంచి పోషించుచు నాకస్మికముగాఁ బ్రభువులకోట నాక్రమింపఁదలఁచెనఁట. కటకదేశమునందలి సంచారములో నీ రహస్య మెట్లో తెలిసికొనఁగలిగితిని."

సోమదేవుఁడు సహజగంభీరుఁడు. చారుఁడు చెప్పిన యీ వార్త విస్ఫారితనేత్రములతో నర్థము చేసికొని "బల్లహుఁడా? కందారదుర్గము నాక్రమించుటయా? సరే కానిమ్ము. అతనికిఁ బోఁగాలము దాపురించినదికాఁబోలు!" నని యంభోధర స్వరగంభీరముగాఁ బలికి గూఢచారుని బంపివైచెను.

అంతట రాజసౌధమున నేకాంత ప్రదేశములోఁ బ్రధానమంత్రిని గానిపించుకొని కందారవిభుఁడు భావికార్యమునుగూర్చి మంతనములు నెఱపెను.

రాజు:—కటకరాజు బల్లహుఁడు కుతంత్రములు పన్నుచున్నాఁ డని చారుఁడు చెప్పినాఁడు. ప్రధానీ! దుర్గ సంరక్షణ

మున నపరిమిత్తులై యుండవలె నని దండనాయకుల కాజ్ఞాపింపుము.

ప్రధాని:—ప్రభూ! మొన్న నేకదా మనరాజధానికి వచ్చి మనము చేసిన విందు గుడిచి పోయినాఁడు! నాఁడు బల్లహుఁడు నెఱపిన నెయ్యమంతయుఁ గయ్యమునకు దారితీయుచున్నదన్నమాట!

రాజు:—చిరకాలమునుండి యీ దుండగీఁడు మనపై దండెత్తి వచ్చుటకు సైన్యపోషణము చేయుచున్నాఁడఁట. మనము చేసిన విందులో నతఁడు తేనె లొలికించుచు మాటాడినాఁడు. కటకమునకు నాంధ్రదేశమునకుఁ బ్రేమానుబంధములు పెంపొందవలెననియు, దేశము శాంతిభరితమైయుండుటకు యుద్ధప్రయత్న విరమణ మవసర మనియు, సైన్యాధిక్యము రాజ్యరక్షణకు సాధకము కారాదనియు, నహింసామార్గ మవలంబించుట దేశక్షేమహేతువనియు నుపన్యసించి పోయినాఁడు. ఆమాటలన్నియు "విందుమాటలు"కాఁబోలు!

ప్రధాని:—బల్లహుని విసపుమెచ్చులు, మీసాల తేనెలు నాఁడు గుర్తింపలేకపోయితిమి. ఇంతకు, బల్లహుఁడు మనదుర్గమార్గ రహస్యములు కనిపట్టుటకు నాఁడు వచ్చియుండవచ్చును. ప్రభూ! మనకుమాత్ర మిప్పుడు సైన్యపుఁ గొఱఁత యే మున్నది! గజ తురగ పదాతి వాహిని

వలసినంత యున్నది. అదిగాక, ఆంధ్రవీరు లెందఱో మన పోషణమున నున్నారుగదా! కదనరంగము పేరు చెప్పినచో వదనములు వికసించు జోదులు వారు. కందార దుర్గముపై నీఁగకూడ వ్రాలనీయరు.

రాజు:—సరే. జాగరూకతతో నుండవలసిన సమయము వచ్చినది.

3

'అనుమకొండ' చిన్నదైనను సొగసైన యూరు. ఆయూరి కెల్లఁ బద్మాక్షీ దేవతాలయము రక్షాబంధముగ నుండెను. పది యిండ్లకుఁ దక్కువగాకుండ బ్రాహ్మణాగ్రహార మాగ్రామమున నుండెను. ఆయగ్రహారములోని పదియిండ్లవారును బాడిపంటలకుఁ గొదువలేని సంపన్నులు. అందఱును వేదశాస్త్రము లధ్యయనించిన కర్మఠులు. వారిలో మువ్వురు నలువురు విప్రోత్తము లగ్నిష్టోమాది యాగములు చేసిన యజ్వలు. సాధారణముగా వారిలో నెవ్వరును గాలుకదిపి పెఱచోట్లకు వెళ్ళరు. అరుగులపైఁ గూరుచుండి శ్రుతిస్మృతి పురాణాదులనుగూర్చి ముచ్చటించుకొనుటయో, శిష్యులకుఁ బాఠములు చెప్పుకొనుటయోతప్ప వారికి. రాజకీయములతో సంబంధములేదు.

అతిథులు, నభ్యాగతులు ననంఖ్యాకముగా నగ్రహార మునకు వచ్చుచుండురు. అర్ఘ్యపాద్యాదులతో నచ్చటివారు నెఱపు నాతిథేయము శ్లాఘాపాత్రమైనది. అగ్రహారము వీథివెంట వెళ్ళినచో, నొకచోట ఋగ్వేదపాఠము, ఒకవంక సామగానము, ఒకప్రక్క యజుర్మంత్రధ్వానము, ఒకదిక్కు పాతంజలము, ఒకచో వ్యాకరణాది శాస్త్రాధ్యయనము చెవుల పండువుగా నుండును. అనుమకొండ కా యగ్రహార మొక నిండు శోభ తెచ్చినది.

క్రైస్తవశకమునకుఁ బూర్వమే యీ ప్రాంతమంతయు నెఱుక రాజ్యములోనిది. 'అనుమకొండ' యను పేరువచ్చుట కొక కారణము చరిత్ర యీవిధముగాఁ జెప్పుచున్నది:

"ఒక కిరాతుఁడు శ్రీపర్వతక్షేత్రప్రాంతమునందలి యర ణ్యమున నిచ్ఛావిహారవర్తియై యనుచరవర్గముతో సంచరించు చుండెడివాఁడు. అతఁడు పరాక్రమశాలి. మెల్లమెల్లఁగా నరణ్యపరిసరపుఁ బల్లియల నాక్రమించుకొని 'హనుమాద్రి'పై నివసించుచు నా కిరాతుఁడొక చిన్న రాజ్యమును నెలకొల్పెను. ఒక దుర్గమును నిర్మించెను. ఒకగ్రామమును గట్టెను. ఆ బోయ ఱేని పేరు 'ఎఱుకదేవరాజు'. ఆరాజునకు "అనుమఁడు - కొండఁడు" అను పేళ్లుగల యిరువురు కుమారులు పొడమిరి. క్రమముగాఁ దండ్రి యనంతరము వారి కారాజ్యము ప్రాప్తిం చినది. ఆకారణమున హనుమాద్రికి వారి పేళ్ళకలయికతో 'అనుమకొండ' యనుపేరు స్థిరపడెను."

ఈగాథనుబట్టి చూచినచో నొకనాఁడు 'అనుమకొండ' యనాగరకప్రాంతమైనట్లు తోఁచినను గథాకాలమునాఁడు వేదశాస్త్రకళానిలయమై యుండెడిది.

అనుమకొండ యగ్రహారములోని విప్రసంఘమున కెల్ల విద్యావయోవృద్ధుఁడైన 'మాధవశర్మ' నాయకుఁడు. అతని నాయకత్వము నిరంకుశమైనది కాదు. అక్కడి వారందఱు మాధవశర్మ మాటమీఁద భక్తివిశ్వాసములు కలిగియుండిరి. మాధవశర్మయు వారివారి చిత్తములు నొవ్వకుండఁ దగవు తీర్పులలోఁ బెత్తనము నెఱపుచుండును. ఆతఁడెంత వైదిక నిష్ఠాపరుఁడో, అంతకుమించిన లౌకికజ్ఞానము గలవాఁడు. శ్రుతిస్మృతిపురాణములలో నాతఁడెఱుఁగని రహస్యములేదు. రాజకీయతంత్రములలోఁ జాణక్యుఁడు. అచ్చటి యాగ్రహారికులలో నాతనికున్నంత పంటభూమి మఱియెవ్వరికిని లేదు. ఆతని కున్నదంతయు ముక్కారుపండు సుక్షేత్రఖండము. పుత్రులతోఁ, బౌత్రులతో, దుహితలతో, దౌహిత్రులతో నాతనియిల్లు దోసతోఁటవలెఁ గన్నులపండువుగా నుండును. మాధవశర్మది నాలుగిండ్ల బవంతి. ఎందఱు బంధువులువచ్చినను, ఎందఱభ్యాగతులువచ్చినను షడ్రసోపేతమైన భోజనపు బంతి. నిత్యకల్యాణము పచ్చతోరణముగా విరాజిల్లు నాయింట మాధవశర్మ యొకయతిథివలె నివసించుచున్నాఁడు. అతఁడు నిస్సంగియైన కుటుంబి. పండువయస్సులోనున్న యాతని నెల్లవారు 'జనకుని'వలె భావించి గౌరవింతురు. 'వాల్మీకి' వలెఁ దలంచి పూజింతురు.

మాధవశర్మ యొకనాఁటి ప్రాతఃకాలమున స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకొని కూర్చుండెను. ఆతని నుదుట నేవో యాలోచనారేఖలు కదలాడుచున్నటులుండెను. ఎన్నఁడును విచారమన్నది యెఱుఁగని యాపండితుఁ డిపు డిట్లుండుటకు హేతువేమైయుండునో! కొంతతడవునకు లోపలినుండి 'నాయనగారూ!' అను పిలుపు శ్రవణమధురముగా వినఁబడినట్లై మాధవశర్మ 'అమ్మా! జానకీ!' యని యాప్యాయముగా సంబోధించెను.

జానకి వచ్చి మాధవశర్మకుఁ బాదవందన మాచరించుటకై దోయిలించి మెల్లఁగా నడుము వంచఁబోయెను. ఆవృద్ధ విప్రునకు మేను జల్లుమని కన్నీళ్ళు గిఱ్ఱునఁ దిరిగెను. వెంటనే "తల్లీ! వలదువలదు. పాదాభివందనమున కిది సమయముకాదు. నిండుచూలాలివై యుంటివి. అదిగాక, నీవంటిసాధ్వి భక్తిభావమును నాయెదుట వెల్లడింపవలయునా? నేను బయివాఁడను గానుగదా! నీవు నా కన్నబిడ్డవు. వడ్డితో బిడ్డను బరికించినపుడే నాకు సంబరము. 'పద్మాక్షి' కరుణాకటాక్షముచే నీ ఘట్టముదాఁటి బయటఁబడినచోఁ గోటలోఁ బాగా వేసినట్లే" యని నిట్టూర్చెను.

జానకి యవసన్నమైన స్వరముతో "నాయనగారూ! కందారపురమునుండి కబురేమియు రాలేదా? ఆదుష్టుఁడు కటకరాజు ఘోరకార్య మేమిచేసినాఁడో యని భయముగానున్నది. దారుణమైన సంగ్రామాగ్నిలోఁ బ్రాణనా

ధుఁడు కుములుచుండఁగా, నేనిచట విందులుగుడుచుట యేమి! నన్నుఁ గందారపురమునకుఁ బంపివేయుఁడు. కర్మ మెటు లున్నదో యటులు జరుగును" అని పలికి యశ్రురుద్ధకంఠయై మాటరాక దుఃఖింపసాఁగెను.

ఒక్క త్రుటికాలము మాధవశర్మ తన పంసుహృదయ మును జిక్కఁబట్టుకొనలేకపోయెను. వెనువెంటనే ధైర్యము తెచ్చుకొని "అమ్మా! మఱియేమియు భయములేదు. కందార పురమునుండి వార్త తెప్పించెదను. నేఁడో రేపో పురుషు రాన్నై యున్న నీవిట్లు లడలుట యుచితము కాదు. నాఁడు 'బ్రహ్మ శిరోనామకాస్త్రము' కీడుఁదొలఁగించి యుత్తరాగర్భముఁ గాపాడిన శ్రీకృష్ణుని యనుగ్రహము నీయందు నిండారుఁ గాక! జానకీ! ఒక్కమాట జ్ఞాపకముంచుకొనుము. గోడకుఁ జెవు లుండునందురు. నాతోఁగాని, మఱియెవ్వరితోఁగాని కందారపురమునుగూర్చి, కటకరాజునుగూర్చి పసంగము తేవలదు. ఎవ్వరు ప్రశ్నించినను 'నా పేరు జానకి యనియు, నాభర్త కాశీయాత్రకు వెళ్ళినారనియుఁ, బుట్టింటికి వచ్చి యున్నాననియే' చెప్పవలయునుసుమా! నేనుండఁగా నీ కేయిబ్బందియు లేదు.'

జానకి యతికష్టముగా నూఱటఁదెచ్చుకొనెను. మాధవశర్మ యామె పరోక్షమున నిట్టూర్చుచు 'పాపము! ఎట్టిమహారాజ్ఞి కెట్టియవస్థ! ఆంధ్రసామ్రాజ్యాధిపతి పట్టపుదేవి

'సిరియాలు' నాయింట 'జానకి'యై ప్రచ్ఛన్నరూపముతో నుండవలసివచ్చినదా? విధివిలాసము!'

౪

కటకరాజు బల్లహుఁడు తనమంత్రిని జూచి ప్రశ్నించెను: 'సోమదేవుని రాణి యెక్కడనున్నదియు జాడ తెలిసినదా?' యని. అమాత్యుఁడు తాను సేకరించిన విషయము రాజుతో నిటులు మనవిచేసెను:

'ప్రభూ! చారులను దేశదేశములకుఁ బంపించితిని. ఇప్పుడే యొకఁడు వచ్చి చెప్పినాఁడు. ఆమె కందారపురపుఁ గోట రాణివాసమునుదాఁటి 'యనుమకొండ' చేరుకొన్నట్టు తెలియుచున్నది. అనుమకొండ బ్రాహ్మణాగ్రహారమున నొక సంపన్నగృహస్థునియింట నొకయిల్లాలు కనఁబడినదఁట. ఆమె యచ్చముగా క్షత్రియాంగనవలె నున్నదఁట. నడకతీరులో, మాటలసొగులో రాచకళవియే గోచరించుచున్నదనిచెప్పినాఁడు. యజ్ఞములుచేసిన కర్మిష్ఠిబ్రాహ్మణునియింట క్షత్రియాంగన యెట్లునివసించుచున్నదో తెలియదు. స్వయముగానే నేవెళ్ళి పరిశీలించవలయునని తలంచుచున్నాను. పిమ్మట దేవరచిత్తము.'

బల్లహుని కన్నులు చింతనిప్పులవలె జేవుఱించెను. "అనుమకొండయగ్రహారములో 'సిరియాలు'ను దాఁచి మమ్ము

లను మోసగించునట్టి బాఁపఁడుకూడ నుండెనా? వాని కెన్ని గుండెలున్నవి! కందారపురపుఁగోటను ముట్టడించి, సోమదేవుని ప్రాణములు కరవాలమున కైరగావించి వచ్చిన మాతోనా వైరము! కానీ, అనుమకొండయగ్రహారము బుగ్గిచేసి విడిచెదము. గర్భవతియైన రాణిని గాపాడుటకు సోమదేవుని మంత్రి చేసిన కుతంత్రమిది. ఆమె పుత్రుని కనవలయును; ఆపుత్రుఁడు పెరిఁగి పెద్దవాఁడై మాతో యుద్ధముచేయవలయును. చేసి, ఆంధ్రరాజ్యమును బునస్థాపనము చేసికొని కందారపుఁగోటపై తెలుఁగుబావుటా ప్రతిష్ఠింపవలయును! సెబాసు! తెలుఁగు మంత్రి యెంత దూరాలోచనము చేసెను? ఇది దూరాలోచనము కాదు, దురాలోచనము. నీవు తత్‌క్షణమే యనుమకొండకు వెళ్ళి యీవిషయము సమగ్రముగాఁ దెలిసికొని రావలయును. ప్రధానీ! ఆలసించుట మంచిదికాదు. శత్రుశేషము నగ్నిశేషము నుపేక్షింపరా' దని కటకరాజు గర్జించెను.

నాఁడే కొంతసైన్యమును వెంటనిడుకొని కటకమంత్రి 'యనుమకొండ'కుఁ బ్రయాణించెను. కటకమంత్రి వచ్చిన సంగతి మాధవశర్మ విని యనుమానించి భారము భగవంతునిపైనుంచి ధీరుఁడై యుండెను. సైనికుల నూరివెలుపల నుండ నియమించి యొక విప్రుని వెంటఁబెట్టుకొని యమాత్యుఁడు తిన్నగా నగ్రహారమున కరిగెను. అగ్రహారములోఁ బెద్దవాఁడు మాధవశర్మ యని చెప్పఁగా విని యతనియింటికే వెళ్ళెను.

కటకమంత్రి తనయింటికి వచ్చునప్పటికి వృద్ధమాధవశర్మ మనుమలకుఁ బారతము చెప్పుచుండెను. వారిలో నొక పిల్లవాఁడు తాతగారి నేదో ప్రశ్నించుచున్నాఁడు. వాని కాటేండ్లకు లోఁబడినయీడు. ఉజ్జ్వలములైన కన్నులు. ధీరమధురమైన శబ్దోచ్చారణము.

'తాతగారూ! శ్రీరాముఁడు సీత నరణ్యములో దిగ విడిచిరమ్మని లక్ష్మణున కాజ్ఞాపించెనుగదా! పాపము! ఒంటరిగా నామె యడవిలో నెంత పరితపించినదో! వాల్మీకిమహర్షి కనఁబడనిచో నామె యేమికావలసినది!'

మనుమని ప్రశ్నకుఁ దాతగారు ప్రత్యుత్తరముగా 'ఉత్తమచరిత్రలకు భగవంతుఁ డేదోవిధముగాఁ దోడ్పడుచునే యుండు'నని పలికెను.

కటకరాజమంత్రి మాధవశర్మకు నమస్కరించి కూర్చుండెను. ప్రక్కనున్న విప్రుఁడు మాధవశర్మకు, బల్లహమంత్రికి నన్యోన్యపరిచయము నెఱపెను. మంత్రి యోగక్షేమాదు లడిగినవెంట వారి కిట్లు సంభాషణము జరిగెను;

శర్మ:— తమరు మాపల్లెకు దయచేసిన కారణము!

మంత్రి:— మఱేమియులేదు. మా ప్రభువు బల్లహుఁడు కందారరాజ్యము నాక్రమించుకొనె నని, బల్లహుని వాఁడికరవాలమున కాంధ్రరాజు సోమదేవుఁడు గుఱియయ్యె నని మీరు వినియే యుండవచ్చును.

శర్మ:— వినకేమి! అది కొన్ని యేండ్ల క్రిందటనే జరిగిన ముచ్చటగదా!

మంత్రి:— కందారపుఁగోట ముట్టడించు సమయమున సోమదేవుని రాణియగు 'సిరియాలు దేవి' రహస్యముగా నెక్కడికో కొంపోవఁబడినది. ఆమె యెక్కడ నున్నదో తెలియక యిన్నాళ్ళనుండి జాడలు తీయుచున్నాము. శత్రుశేషముండరాదని మాప్రభువువారి శాసనము.

శర్మ:— అవును. రాజనీతి రీతి యట్టిదేకదా!

మంత్రి:— మొన్ననే మాకొక వార్త తెలిసినది. ఆమె యీ యనుమకొండ యగ్రహారములో నొక విప్రునియింట సంరక్షింపఁబడుచు నజ్ఞాతవాసము చేయుచున్నదఁట. ఈ విషయము వృద్ధులైన మీకేమేని తెలిసియున్నదేమో యెఱుంగుటకు వచ్చియున్నాను.

శర్మ:— క్షత్రియాంగన విప్రునియింట నుంటయా? మంత్రిగారొక క్రొత్తవింత చెప్పినవారైరి. పాపము! కందారపురాజ్ఞి కిట్టియవస్థ వచ్చినదా? ఆమె యెక్కడ నున్నదో నాకేమియుఁ దెలియదు. పదియిండ్ల యగ్రహారము. ఇక్కడ నెవరియింటనైన నున్నచో నాకుఁ దెలియకుండఁగా నెటు లుండును!

మంత్రి:— అయ్యా! దాఁచనేల! సిరియాలుదేవి తమయింటనే యుండి సంరక్షింపఁ బడుచున్నదనియు మాకుఁ జూచా

యగాఁ దెలిసినది. బల్లహుఁడు సాధారణుఁడు కాఁడు. ఈవిషయము విన్నప్పటినుండియు ననుమక్కొండను భస్మముచేయుదు నని యాప్రభువు మండిపడు చున్నాఁడు. అయినను, తొందరపడుట భావ్యము కాదని స్వయముగా యథార్థము సేకరించుటకు నేనే రావలసివచ్చినది. ఒక వేళ, ఆమె మీ యొద్దికలో నున్న-చోఁ దెలుపుఁడు. మఱేమియు నిబ్బందిరాదు.

శర్మ:— చిత్రముగా నున్న దే! పండిపోయిన వయస్సులోనుండి దైవధ్యానముతోఁ గాలక్షేపము చేసికొనుచున్న నామీఁదనా యీ యభాండము! కందారరాజు రాణి వాస మెక్కడ? నాయింట వసించుట యెక్కడ? కల్పనయైనను యుక్తియుక్తముగా నుండవలయును. మీ రెవరి వలన వింటిరో కాని యిం దణుమాత్రము సత్యము లేదు.

మంత్రి:— సత్యములేదా ? మా ప్రభువుల శాసనముచే మీ యిల్లు 'సోదా' చేయవలసియున్నది. ఏమందురు ?

శర్మ:— అభ్యంతరము లేదు.

మంత్రికి మాధవశర్మకు జరుగుచున్న యీ సంభాషణ మింటనున్న 'జానకి' వినుచున్నది. ఆపేండ్లకుఁ బూర్వ మొక నడిరేయి వేళ కందారదుర్గము విడిచి, యడవిత్రోవలో దాసీ ద్వితీయయై ప్రయాణించునప్పటి హృదయాందోళనానుభూతి సిగిరియాలు దేవి కానాఁడు మఱలఁ గలిగెను.

౫

సువిశాలసుందరమైన పద్మాక్షీ దేవతాలయముఖమండ
పమున ననుమకొండ యగ్రహారములోని బ్రాహ్మణబృంద
మంతయు ద్వాదశినాఁడు తెల్లవాఱి యనుష్ఠానము పూర్తి
యైన పిదప సమావిష్ట మయ్యెను. కటకరాజమంత్రి, బల్ల
హుని యాదేశప్రకారము విప్రులకు భోజనసంతర్పణ మేర్పాటు
చేయించెను. అనుమకొండ యగ్రహారస్థులేగాక చుట్టుపట్టు
గ్రామములనుండి మఱికొందఱు భూసురులును భోజనార్థ
మాహ్వానింపఁబడి వచ్చిరి.

వంట లయినవి. మడులు గట్టుకొని బ్రాహ్మణులు
సపాత్రులై విచ్చేసిరి. పద్మాక్షీ దేవతాలయ ప్రాంగణము
స్వస్తివాచనములతోఁ బ్రతిధ్వనించుచున్నది. స్వస్త్యనంత
రము, కటకమంత్రి లేచి బ్రాహ్మణ బృందమునకు నమస్క
రించి యిట్లు పలికెను:

"భూసురోత్తములారా! మాప్రభువు బల్లహుఁడు
చేసిన యాదేశముతో మిమ్ముల నిచ్చట సమారాధనమున
కాహ్వానించినాము. దయచేసిన మీకెల్లరకుఁ గృతజ్ఞులము.
ఈ సమావేశమున కొక హేతువున్నది. ఈ యనుమకొండ
యగ్రహారములో విద్యావయోవృద్ధుఁడైన మాధవశర్మయింట
"జానకి" యను పేరుగల యామె యున్నది. ఆమె, కందార
పురాధిపతియై కొన్నివత్సరముల క్రిందట మాప్రభువుచే నిహ

తుఁడైన సోమదేవునకుఁ బట్టపురాణి యగు "సిరియాలు దేవి" యని మా సందేహము. మాధవశర్మ "జానకి నా కన్న కూఁతురు. మా యల్లుఁడు కాశికి వెళ్ళుచుఁ గొన్నాళ్ళు పుట్టింట నీమె నుంచినాఁడు" అని చెప్పుచున్నాఁడు. 'జానకి' రూప సౌష్ఠవాదులు, మాటతీరు పట్టిచూచినచో క్షత్రి యాంగనవలె స్పష్టముగా గోచరించుచున్నది. అదిగాక, ఆమె బిడ్డ బాలమాధవుఁ డనువాఁ డాఱేండ్ల వయస్సువాఁడు. కందారపుఁగోట ముట్టడి జరిగియిప్పటి కించుమించుగా నాఱేండ్లు కాలమైనది. ఆముట్టడినాఁటికి "సిరియాలు దేవి" పూర్ణ గర్భిణియని విన్నాము. బాలమాధవుని ముఖములోఁ, గన్నులలో క్షాత్త్ర తేజము సువ్యక్తమగుచున్నది.

ఇన్ని ప్రత్యక్షప్రమాణములచే 'జానకి' "సిరియాలు దేవి" యని నిర్ధారిత మగుచున్నను మాధవశర్మ కాదనుచుండెను. ఈవిషయము నిర్ణయించుకొనుటకు మా కటక ప్రభువీ బ్రాహ్మణ సమారాధనము నేర్పాటు చేయించెను. 'జానకి' బ్రాహ్మణియైనచో నామె వడ్డనము చేయఁగా భోజనము చేయుటకు మీ కేయభ్యంతరము నుండదు కదా! కావున, నేఁటి సంతర్పణమున నామె మీకు వడ్డనచేయును. మీరు భుజింపవలయును. ఆహితాగ్నులు, కర్మిష్ఠులు, నామ్నాయ నైష్ఠికులు నగు మీవంటి విప్రోత్తములు క్షత్త్రియాంగనచేతి యన్నము భుజింతురా? ఇంతకంటె, 'జానకి' బ్రాహ్మణ స్త్రీ యని నిర్ధారించుకొనుటకుఁ దగిన సాధనము కనిపించుటలేదు".

నాఁటి సమారాధనమునకు విచ్చేసిన యనుమకొండ యగ్రహారస్థుల కందఱకు 'జానకి' నిజవృత్తాంతము తెలియును. ఆమె 'సిరియాలు దేవి' యనియు, క్షత్రియాంగన యనియు, కందారపురాధిపతి పట్టపురాణియనియు వారందఱు నెఱుఁగుదురు. ఒకచిత్రమేమనఁగా, ఆ విప్రసంఘములోని కట్టుబాటు వలన మాధవశర్మ యెంతచెప్పిన నంతజరుగును. అతఁడు సర్వవిషయములలోను గ్రామస్థుల కొక యారాధ్య దైవము. ఆవృద్ధుఁడు ధర్మసూక్ష్మము లెఱిఁగిన లోకజ్ఞుఁడు. మాధవశర్మ "యగ్నిలో నుఱుకుఁ" డనుచో వారందఱు సంసిద్ధులు. వారిలో ననేకత్వము లేదు. నేఁడు 'విప్ర సంతర్పణము' జరుగుననఁగాఁ దొలినాఁడురాత్రి మాధవశర్మ రహస్యముగా నొక సమావేశ మేర్పాటుచేసి వారి కిట్లు బోధించెను:

"మిత్రులారా! అగ్నిపరీక్ష వచ్చినది. వర్ణధర్మ సంరక్షణము - దేశసంరక్షణము - ఈ రెంటిలో దేనికిఁ బ్రాధాన్య మీయవలెనన్నది గడ్డుసమస్య. వర్ణాశ్రమధర్మసంరక్షకుఁడగు క్షత్త్రియ ప్రభువు సోమదేవుఁడు కటకరాజుచేతిలో నసువులు గోల్పోయెను. కందారపుఁగోట పరాక్రాంతమైనది. ఆంధ్రదేశమున నుత్కలరాజపరిపాలనము తలసూపినది. మనయాచారధర్మములు, మన కర్మానుష్ఠానము వెనుకటివలె సాగుననుటకు వీలు లేదు. శ్రుతిస్మృతిపురాణములమీఁదఁ గటకరాజునకు భక్తి విశ్వాసములు లేవు. అట్టి నాస్తికుని యేలుబడిలో మన దేశ మెట్టి దుస్థితికి రానైయున్నదో యోచింపుఁడు. మనము

జానకిచేతియన్నము తిన్నచో నామె బ్రాహ్మణియని విశ్వసించి కటకమంత్రి చక్కఁబోవును. బల్లహుని కీసందేహము తొలఁగిపోవును.

అట్లు కానినాఁడు, దుష్టుఁడైన బల్లహుఁడు మనలను బ్రతుకనీయఁడు. సైన్యసహితుఁడై వచ్చి యనుకొనునంత యంతయుఁ గబళింపఁగలఁడు. తెలుఁగు దేశమున స్వతంత్ర [illegible] పరిపాలనము సాగుటయే గొప్పమున్నగా మనము భావింపవలెను. ఆ పని నేదో విధముగా మరియుంపఁజేయుట కర్తవ్యము. "బాలమాధవుఁడు" వర్ధమానసంస్థానమునకు అభివృద్ధి సంపాదించు న్నాఁడు. మఱి నాలుగు మాసములలో [illegible] కంధారరాజ్యమును దిగి [illegible] గలవాఁడగును. [illegible] దేశము [illegible]. [illegible] చారిత్రములు [illegible]. ఇట్టి యాలోచించి [illegible] రాజ్యముగా '[illegible]' [illegible] పవలసియున్నది. [illegible] హెచ్చుగాఁ [illegible]. [illegible] మన జరుగు [illegible] ధర్మసంరక్షణార్థముగా భావించి నా విశ్వాసము."

నిన్నరాత్రి [illegible] వలన విన్న యా [illegible] బోధ [illegible] చెవులలో గింగురుమనుచున్నది. కటక మంత్రి నేఁడు పలికిన మాటలు విని విప్రసంఘమంతయు

సర్వాంగీకారమును వెలిఁబుచ్చెను. 'జానకి' చేతియన్నము భుజించుట కెవ్వరికి నభ్యంతరము లేదు.

బ్రాహ్మణులెల్ల వృద్ధమాధవశర్మను ముందిడుకొని బంతి సాగించిరి. అరఁటియాకులు పఱచి, పరిశుభ్రముగాఁ దుడిచి, యభిఘరించి వడ్డన కుపక్రమించిరి. వంటబ్రాఁపలు పదార్థములు సమృద్ధిగా నాకులలో వడ్డించిరి. 'విశాలాక్షి'వలె జానకి బంతినడుమకు వచ్చి తానుగూడఁ గొన్ని వంటకములు, పచ్చడులు, నూరుఁగాయలు, నుక్కెరలు, చక్కెరలు, వడియములుఁ, గడియములు, నప్పడములు, పప్పులు వడ్డనచేసెను. వడ్డనయెల్ల ముగిసినతరువాతఁ బునరభిఘారము చేయఁబడెను. విప్రులు నివేదనములు చేసికొని భోజనముల కుపక్రమించిరి. "జానకి" బంతి బంతి నడుమకు వచ్చి నడుమనడుమఁ దాకన్నంతము వీచుచుండెను. నేయి వడ్డించుచుండెను. మంచితీర్థము పోయుచుండెను. పళ్ళెరములతో భక్ష్యములు తెచ్చి వడ్డన నెఱపుచుండెను.

చతుర్విధాహారములతో సంతృప్తముగా విప్రభోజనములు ముగిసినవి. బల్లహారాజు సంస్థానమునకు సంబంధించిన యొక భూసురోత్తముఁ డాదృశ్యమంతయు సాంతముగాఁ బరికించినాఁడు. 'జానకి' క్షత్రియాంగన కాదని యతఁడు నిర్ణయించుకొనెను. అక్కడ భోజనపుబంతి తీర్చిన వారెల్లరు సదాచారపరులైన నైష్ఠికులు. వారిలోఁగొందఱు సోమయాజులు. మఱి, 'జానకి' బ్రాహ్మణస్త్రీ కానిచో వర్ణధర్మమును

గాదని వారామె వద్దన కంగీకరింపరుకదా ! ఇది యతని నిశ్చయము. ఆ నిశ్చయమునే మంత్రికి, కటకరాజు బల్లహునకు నాభూసురుఁ డెఱింగించెను. 'సిరియాలుదేవి' పతిమరణ వార్త విని మరణించి యుండవచ్చునని వారు సరిపెట్టుకొనిరి.

౬

'జానకి' యను నజ్ఞాతనామముతోఁ బ్రచ్ఛన్నయై మాధవశర్మ యింటనున్న 'సిరియాలుదేవి' కన్నకొడుకునకు 'మాధవవర్మ' యనుపేరు పెట్టుకొన్నది. ఆపత్సమయమునఁ దన్నుఁ గాపాడి, ప్రసుతివోసి, బిడ్డను పెంచుచున్న యా వృద్ధ విప్రునియెడలఁ గృతజ్ఞతయెట్లు తెలుపవలయునో యా రాణి కెఱుఁగరాకున్నది.

బాలమాధవవర్మ వృద్ధమాధవశర్మ సన్నిధి నక్షర స్వీకారముచేసి పదునాఱేండ్లు వచ్చునరికి సకలవిద్యలు నభ్యసించెను. ఇందాఁక, మాధవవర్మ దృష్టిలో 'మాధవశర్మ'కు మాతామహస్థానము. ఇప్పుడో ! గురుస్థానము. క్షత్రియోచితముగా జాతకర్మాది సంస్కారములు, నుపనయనము మాధవవర్మకు జరుపఁబడెను.

తాతగారు దగ్గఱఁ గూర్చుండఁబెట్టుకొని 'వర్మ'కు శాస్త్రరహస్యములు, ధర్మరీతులు, దండనీతులు, రాజ్యతంత్ర

ములు, వ్యూహనిర్మాణములు నేర్పెను. తల్లి సిరియాలు పదియేండ్లవయస్సు వచ్చునప్పటికి కుమారునకు భారత భాగవత రామాయణములలోని కథా తత్త్వము స్వయముగా బోధించెను.

కుసుమ సౌరభము మునుఁగువెట్టినను దాఁగునది కాదు. పసినాఁటినుండియు బాలమాధవవర్మ క్షాత్ర విక్రమమును ప్రదర్శించు నాటలే యాడుచుండును. అట్టిపాటలే పాడుచుండును. అట్టి మాటలే పలుకుచుండును.

తడిమన్నుతోఁ గోటగోడలఁ గట్టి, తోడివారినక్కడ నిలఁబెట్టి, వారితోఁ బోరాటము సలుపుచును నాటలాడుచున్నప్పుడు సిరియాలుదేవి మాధవవర్మనుఁజూచి మురిసిపోవును. కుమారుని వీరోదాత్తమైన నడకలో, గంభీరమైన చూపులో, విశాల భాసురమైన వక్షస్థలములో నతని తండ్రి మూర్తి కన్నులకుఁ గట్టినట్లై సిరియాలు దుఃఖభరితయగుచుండును. ఆమె తన కన్నులతడి యెన్నఁడును మాధవవర్మకుఁ గనఁబడ నీయలేదు.

సవయస్కులు తమతండ్రులను పిలుచుపిలుపువిని బాలమాధవుఁడు తల్లినిగని 'అమ్మా! చెప్పవే మా నాన్నగారెవరే? ఎక్కడనున్నారు?' అని ప్రశ్నించుచుండెడివాఁడు. ఆ తల్లి మాఱుమాటలు చెప్పి కుమారుని తలఁపు మఱపించి పరోక్షమున దుఃఖించుచుండెడిది.

పదేండ్లుదాటి యుపనయన మయినతరువాత నారాచ బిడ్డ యెట్లు తెలిసికొనెనో, తానొక రాజపుత్రుఁడనని తన తండ్రి మరణించెనని, తల్లి యజ్ఞాతవాసము చేయుచున్నదని కనిపట్టఁగలిగెను. వృద్ధమాధవశర్మ యప్పుడప్పుడు తనతల్లితో మాటాడుచున్న మాటలనుబట్టి, తోడివారిలోఁ గొందఱాడు కొను గుసగుసలనుబట్టి తనచరిత్ర కొంత తెలిసికొనియుండు ననుటలో సందేహముశేదు. దండనీతి, రాజ్యతంత్రము, ఆయ వ్యయముల లెక్కలు, అస్త్రవిద్యలో మెలఁకువలు, అథర్వ వేదములోని కొన్ని రహస్యములు, ప్రజారంజన పద్ధతులు, ఇత్యాదులనుగూర్చి వృద్ధమాధవశర్మ తనకు బోధించుచున్న పుడే మాధవునకుఁ దాను రాచబిడ్డఁడనను నిశ్చయము కలిగెను. చిన్ననాఁటఁ దా నెన్ని ప్రశ్నలు వేసినను నిజవృత్తాంతము తల్లి గాని, మాధవశర్మగాని చెప్పరైరి.

కుశాగ్రబుద్ధియగు మాధవుఁడు పదునాఱేండ్లు వచ్చు నరికి నావులించినఁ బ్రేవులు లెక్కించువాఁడై స్వవిషయము చాలభాగము గ్రహింపఁగలిగెను. వృద్ధమాధవశర్మ తరుణము గుఱుతించి యొకనాఁడు మాధవుని గూర్చుండఁబెట్టి సావధాన ముగా నీవిధముగఁ జెప్పెను:

'బిడ్డా! మాధవా! ఇన్నాళ్లవఱకు నొకవిషయము నీదగ్గఱ దాఁచియుంచితిని. అదియిఁక దాఁగుటలేదు. దాఁచు కొనుటయు భావ్యముకాదు. ఆంధ్రరాజధానియగు కందార పురమును రాచవీడుగాఁజేసికొని రాజ్యపాలనము నెఱపిన

సోమదేవ భూపాలుఁడు నీతండ్రి. పాపము, నీ వెన్నిసారులు ప్రశ్నించినను నీతల్లికాని, నేనుగాని నీ'తండ్రి' యెవరో చెప్పమైతిమి. నిరంతరగోసేవాపవిత్రముచేఁ బవిత్రుఁడై, నిత్య భగవత్పూజలచేఁ బరిపూతుఁడై 'సిరియాలుదేవి' పట్టమహిషియందు నిన్నుఁగన్నాఁడు. కటకరాజగు బల్లహుఁడనుదుష్టుఁడు కందారపుఁగోఁట నాకస్మికముగా ముట్టడించి వీరశిరోమణియగు నీ తండ్రిని మడియింపఁజేసినాఁడు. ఇప్పుడు తెలుఁగుకోటపై కటకరాజు పతాక మెగురుచున్నది. సోమదేవ భూపాలుని మంత్రి, నీతల్లియగు సిరియాలుదేవిని దుర్గమునుండి పరు లెఱయకుండ నాఁటి యర్ధరాత్రమున నీ యనుమకొండకుఁ బంపించివేసెను. నాఁటికి నీతల్లి గర్భవతియై యున్నది. నే నామె నింటఁబెట్టుకొని కన్నకూఁతురువోలెఁ బరికించుచుఁ బురుడు వోయించితిని. ఆమె గర్భమున నీవు జన్మించితివి. తరువాతికథ చెప్పనక్కఱలేదు.

జానకి యను మాఱుపేరితో నాయింటనున్న నీతల్లి తెలుఁగుదేశపు మహారాజ్ఞి. ఆమెయవస్థ యిటుపట్టినది. ఆమె నీమీఁద గంపెఁడాసపెట్టుకొని యెట్టులో గుట్టుగాఁ గాలము గడుపుచున్నది. నీవు యువకుఁడవైతివి. నీ మేధావిశేషము వలన సకలవిద్యలు తెలిసికొంటివి. ఈసందర్భమున నాగురుత్వమొక నిమిత్తమాత్రము. శతవృద్ధుఁడనైన నేనొక్క యమృతవార్త విని తనువు చాలించవలసియున్నది. నీతండ్రియగు సోమదేవుని సంహరించిన బల్లహుని కంఠము నుత్తరింపవల

యును. నీవు పైతృకమైన యాంధ్రరాజ్యసింహాసనము నధిష్ఠింపవలయును. ఇదే నాయభీష్టము."

మాధవశర్మ చెప్పుచున్న మాటలు ధీరనిశ్చలవిస్ఫారిత నయనములతో నాలించి బాలమాధవుఁడు నిశ్చేష్టుఁడయ్యెను. చాలభాగము ధైర్యముతో వినఁ గలిగెను గాని చివరి కీక దుఃఖ మాఁపుకొనలేక పసిపిల్లవానివలె వెక్కి వెక్కి యేడువ సాఁగెను. తనతండ్రి నిర్యాణముకంటె మాతృదేవి యజ్ఞాత స్థితిలోఁ బరాశ్రయణమున నుండుట యాతనికి మఱియు శోక కారణమయ్యెను. మాధవశర్మకు వెనువెంటనే యేమియుఁ బ్రత్యుత్తర మీయలేకపోయెను. తన తల్లిని దర్శించినఁగాని యతని దుఃఖోద్వేగ మాఁగునట్లులేదు. అతఁడు సిరియాలు కడకు బాష్పప్లుతలోచనములతో వెళ్ళి సాష్టాంగపడెను. కన్నీళ్ళతో సిరియాలు కుమారుని శిరము నార్ద్రముచేసి లేవ నెత్తి "నాయనా! ఏమి యీ యుత్తలపాటు!" అని యడిగెను.

మాధవవర్మ డగ్గుత్తికతో "అమ్మా! యిప్పటివఱకు నాకుఁ జెప్పవైతివి. కటక రాజుబల్లవాఁడు నాతండ్రిని సంహరించి, కందారదుర్గ మాక్రమించుకొనెనఁటకదా! ఇప్పుడే తాత గారు చెప్పినారు. తల్లీ! దాసీజనసమాసపరివృతవై యంతః పురములో సంచరించిన నీకా యిట్టి దుర్దశ! ఈయవస్థ యంతయు నామూలముననఁగదా నీకుఁ దటస్థించినది! గర్భస్థుఁ డనై యున్న నన్నుఁ గాపాడుకొనుట కెన్ని యాపదలు పాలు

పడితివో! కష్టపడి కనిపెంచిన నీ ఋణమునెట్లుతీర్చుకొందును!" అని వాపోవసాగెను.

సిరియాలు చేలచెఱఁగున బిడ్డకందోయి నొత్తి "నాయనా! నీవు తీర్పవలసినది తల్లి ఋణముకాదు. నీకై తపించి తపించి కనులార నీమూర్తిని గాంచనోఁచుకొనక కదన రంగమునఁ బ్రాణములు వీడిన తండ్రిగారి యప్పుదీర్చుకొనుటకు యత్నింపుము. అనవలంబరై యత్యంతకష్టస్థితిలో నల్లాడు నీ తల్లిని కరుణాధురీణుఁడై కాపాడి పురుడువోయించి పెంచుచున్న మాధవశర్మ యప్పుదీర్చుకొనుటకు యత్నింపుము. నీతండ్రిని మడియించి కందారదుర్గ మాక్రమించుకొన్న దుష్టబల్లహునిఁ బొలియించి యాంధ్రరాజ్య పునస్థాపనము చేయుట తప్ప పితృ-గురుఋణములు తీర్చుకొనుటకు వేఱొక దారిలేదు.

సర్వమునకును మాధవుఁడున్నాఁడు. 'పద్మాక్షీ దేవి' యున్నది. పద్మాక్షీ కరుణాశీర్వాదముతో, మాధవశర్మ మార్గదర్శిత్వముతోఁ గార్యసాధనమునకుఁ గడంగుము. కందారపురదుర్గాగ్రమునఁ దెనుఁగుజెండా మెగురుచుండఁగాఁ, జైత్రికమైన స్వర్ణపీఠమున నీవు తీర్చియుండగాఁ గనులారఁగాంచి యింతదాఁకఁబడిన దుఃఖము విస్మరించెదను. అంతకుమించి నాకు వలసినది లేదు."

మాతృదేవి యుపదేశము నాదేశముగా భావించి మాధవుఁడు దోయిలించి "అమ్మా! తాతగారి యాశీర్వాద

బలముచే, నుపదేశమహిమచే నచిరకాలములో నీయభీష్టము నెఱవేర్చి ధన్యుఁడనగుదు" నని పలికెను. సిరియాలు పరమానందభరితహృదయముతోఁ గుమారుని శిరము మూర్కొని విజయోదర్కముగా దీవించెను.

౭

రాత్రియొక్క తుత్రిటియైనను మాధవవర్మకుఁ గంటిపైఁ గునుకులేదు. అతఁడు కందారదుర్గము నాక్రమించుకొనుటలో నుపాయములు నపాయములు, సాధకములు బాధకములు యోచించుటకు మొదలుపెట్టెను. ప్రాఁడును బొంగరములేని తన బలముతో నొకబలవద్విరోధిని బ్రతిఘటించుట! సైన్యము లేదు; ధనములేదు; ఆయుధాదికములులేవు. ఏమియులేదు. మాధవవర్మ కున్నది బాహుశక్తియొకటి; దేశభక్తియొకటి, ఈరెండే. వృద్ధమాధవశర్మ యుపదేశోక్తి యీరెండింటికి మెఱుఁగు తెచ్చినది.

మాధవవర్మ కనుమకొండలోఁ బ్రాణమిచ్చు మిత్రవర్గము మాత్రమున్నది. ఆ మిత్రుల సాయముతో-దండయాత్ర సాగించుటయా? దుస్సాధమైన కార్యము తలపైఁ బెట్టుకొన్న మాధవునకుఁ గుదురుండకపోవుటలో నాశ్చర్యములేదు.

ఎట్లో తెల్లవాఱినది. ఆ బాలవీరుఁడు మాధవశర్మ సన్నిధిని గూరుచుండి "తాతగారూ! ఇంతదనుక వ్యర్థముగాఁ గాలము గడచిపోయినది. బల్లహుని సంహరించికాని యిఁక నిద్రింప లేను. తమ యాశీర్వచనముతో ఖడ్గపాణినై వెళ్ళఁదలఁచు కొన్నా" నని పలికెను.

వృద్ధవిప్రున కామాట యుత్సాహ కారణమయ్యెను. అతఁడు 'సరే' యన్నచో బాలమాధవుఁడు వెళ్ళి బల్లహుని మీఁదఁ బడును. ఆక్షణమున నా రాచబిడ్డ సాహసోద్రేకము లట్టివి! దీర్ఘదర్శి రాజ్యతంత్రకోవిదుఁడునగు నావృద్ధమూర్తి మాధవవర్మ యుద్రిక్తహృదయమును శాంతపఱుచుచు నిటు లుపదేశించెను:

"బిడ్డా! సిరియాలు నిజముగా వీరమాత. జన్మాంతర సుకృతము కారణముగా నిన్ను నాయింటఁ బెంచుపట్టి యదృష్టము కలిగినది. నీయెడల నా గురుత్వము నేఁడు చరితార్థమైనది. మాతృఋణము దీర్చుకొనుటకు యత్నించు నీయుద్యమము సఫలమగుఁగాక! రాజకీయరహస్యములు నీవెఱింగియుంటివి. ప్రబలుఁడైన పగవాని నెదుర్కొనునప్పుడెంతో మెలఁకువయుండవలయును. వేళ్ళుపాఱియున్న చెట్టును బుజము వెట్టి పెల్లగించుట సుకరమైన పనికాదు. తఱియెఱసి దండెత్తవలెనుగాని తొందరపడి యరులతోఁ బోరాటమునకు సిద్ధపడుట చేటుదెచ్చునుసుమీ! నీవు బాహుశక్తిసంపన్నుఁడవైనను, పరాక్రమవంతుఁడవైనను వయోనుభవములు తక్కువ

గలవాఁడవు. బలము - ధనము సేకరించుకొని తరుణము గుర్తించి విజయముసాధింపుము.

నాకుఁ దోఁచిన మార్గమొకటి చూపుచున్నాను. ఎట్లు లుండునో యోచింపుము. అనుమకొండ 'ఎఱుక దేవరాజు' పరిపాలనములో నున్నది. అతఁడు చిఱుతఱేఁడు. అల్పమైన సైన్యము కలవాఁడు. ఆతని దుర్గము సులభముగా నాక్రమింపఁదగియుండును. 'ఇంట గెలిచి రచ్చ గెలువు' మన్నట్లు తొలుత నా యెఱుకఱేని పనిపట్టి వాని సైన్యధనములు స్వాధీనము చేసికొని భావిరాజ్య కల్యాణసౌధమునకుఁ దోరణముగా ననుమకొండ నాక్రమింపుము. తరువాత, కందారదుర్గాక్రమణము నల్లేరుపై బండినడక.'

జ్ఞానవయోవృద్ధుఁడైన మాధవశర్మ యుపాయోపదేశములు విని బాలమాధవుఁ డుప్పొంగి యెగిరిగంతువైచెను. వయస్సుగడచి యనుభవము సంపాదించిన పెద్దలవలని యుపయోగ మెట్టిదో యిప్పుడతని కర్థమయ్యెను. తెల్లవాఱు దాఁక బుఱ్ఱకొట్టుకొని యాలోచించినను దేలనిసమస్య నొక యరనిముసములో నాయన తేల్చి చెప్పఁగలిగెను. మాధవవర్మకుఁ గొంద ఱుత్సాహవంతులైన యువకులు తోడు నీడలై యున్నారు. వా రందఱు పనివచ్చినచో ననిలోఁదూకి విక్రమ ప్రకటనము చేయఁగలవారు. వారి సాయముతోఁ దన బాహుస్ఫురణముతోఁ దొలుత 'నెఱుక దేవరాజు' చిఱుదుర్గము ముట్టడించుటకు ముహూర్త నిర్ణయముచేసెను. ఎఱుకరాజు సైనిక

బలసంగ్రహణముకంటె ధన సంగ్రహణము హెచ్చుగా గావించినవాఁడు.

మాధవవర్మ మిత్రవీరుల తోడుపాటుతో నొకనాఁ డెఱుకత్రేనిపై సంగరమునకు బయలు దేఱెను. ఉడుకుర క్తపు బలముతో, యువత్వములోనున్న యుత్సాహముతో, 'నేను, నే'నని బాలవీరులందఱు, మాధవవర్మను ముందిడికొని ప్రస్థానము సాగించుచుండఁగా ననుమకొండ ప్రజావళి యాశ్చర్యముతోఁ జూచుచుండెను. అలవోకగా నాటకుఁబోయినట్లు బోవుచుండిరి కాని పోరాటమునకుఁ బోవుచున్నట్లులేదని గ్రామస్థులు నివ్వెఱ పడసాగిరి.

మాధవుని నాయకత్వముతో జాతీయ యువసైనికు లెఱుకత్రేని దుర్గమును ముట్టడించిరి. ఆకస్మికముగా వచ్చిన యీ ముట్టడిరహస్యము యారాజున కర్థముకాలేదు. కొంత సేపు తనకుఁగల యల్పసైన్యము సాహాయ్యముతో నెఱుక త్రేఁడు పోరుసల్పెను గాని మాధవవర్మ విక్రమముముందు నాతఁడు నిలఁబడలేక పరాజితుఁడై మైత్రినర్థించెను. మాధవ వర్మ యెఱుకత్రేనికిఁ దన భావికార్యక్రమ మెఱిఁగించి . యతని తోడ్పాటు కావలయునని కోరెను. అతఁడు సైన్యధన సాహాయ్యము చేయుట కొడంబడెను. దానితో, మాధవవర్మ ముందరి యుద్యమమునకు 'నాంది' జరిగినది.

౮

అనుమకొండలోఁ బద్మాక్షీ దేవతాలయము. ఆలయ ప్రాంగణమున సిరియాలు దేవి; ఆమెప్రక్క బాలమాధవవర్మ. సిరియాలు పద్మాక్షి సమక్షమునఁ గేలుగవ మొగిచి, తన కుమారుని పక్షముగా నిట్లు ప్రార్థించెను:

'ఓ దయామయీ! పద్మాక్షీ! ఈ బాలభక్తుఁడు మాధవుఁడు నీ కటాక్షమునకై దోయిలి పట్టియున్నాఁడు. అజ్ఞాత యోగములోనున్న యీ నా యాత్మజునిపై కృపామృతము గురిపించి పార్థుని గాపాడినట్లు కాపాడుము. పరరాజుల యేలుబడితో నలమటించుచున్న తెలుఁగు రాజ్యమును స్వాధీనముచేసికొని తనతండ్రి పేరు పెంపులు నిలఁబెట్టుటకు యత్నించు నీకుఱ్ఱనిపై దయనెఱపుము. జగములెల్ల నూఁగింతునను వెఱ్ఱిసాహస మొకటితప్ప యుద్ధరంగములచొప్పు నెఱుఁగనివాఁడు. నా కేదో కొండంతయాస కల్పించి కదనమున కరుగుచున్నాఁడు; పైబరువెల్ల నీదే తల్లీ! తండ్రిలేని యేకైక పుత్రికుఁడు వీఁడు. లేడిపరువుతో నరుగఁజూచు చున్నాఁడు కాని, శాత్రవసింహములకు భయపడుటలేదు. స్వారాజ్య పునస్థాపనమున దీక్షితుఁడై పోవుచున్న యీ చిరంజీవినిఁ గరుణించి నీ కృపావజ్ర కవచము, నీ కటాక్షమండలము కానుకగా నిచ్చి యాశీర్వదింపుము.'

తల్లి ప్రార్థనానంతరము మాధవవర్మ పద్మాక్షికి భక్తి భావముతో మున్మ్రొక్కి మౌనధ్యానము గావించెను. ముద్దుబిడ్డ నొసటిపై కుంకుమతిలకము దిద్ది సిరియాలు 'విజయోఽస్తు!' అని దీవించెను.

వృద్ధమాధవశర్మ నిర్ణయించిన ముహూర్తమున మాధవవర్మ తన సంగడికాండ్రగు జోదులతో, నెఱుక దేవుం దటను పడసిన రాణువతోఁ గందారపురదుర్గము నాక్రమించి యాంధ్ర సామ్రాజ్య పునస్థాపనమునకు బయలు దేఱెను. ఆతని ప్రస్థాన సమయమున ననుముకొండవాసులెల్ల నిండుహృదయములతో జయాశాస్యములు పలికిరి. పెద్దముత్తైదువలు శుభాక్షతలు చిలికిరి.

మాధవవర్మ సైన్యము కందారపురముఁ జేరెను. కందారపురదుర్గములోఁ గటకరాజగు బల్లహుని ప్రతినిధి యుండి పాలనము సాగించుచుండెను. కోటలోని యుద్యోగులలో నెవరో కొలఁదిమంది తప్ప నందఱు నాంధ్రులే. వారికి లోలోన మాధవవర్మ దండెత్తి వచ్చుట యానందము గలిగించెను. బల్లహుని ప్రతినిధి మాధవవర్మ దండురాక కొంతముందుగా నాలించి దుర్గరక్షకుల నప్రమత్తులై యుండనియమించి కటకరాజునకీ వార్త తెలియఁజేయుట కొకనిం బంచెను.

మాధవవర్మ యగ్రగామిగానుండి కోట ముట్టడించెను. బల్లహుని సైనికులు తెలుఁగుసేనతోఁ బోరు నలిపిరి. కాని,

తెలుఁగు యువకుల ముం

దుత్కల సైనికులు పలాయితులు కావలసివచ్చినది. బల్ల హుని ప్రతినిధి యకాండపాతముగా వచ్చిన యీ భండనము నకు భీతిల్లి యథాశక్తిగాఁ బ్రతిఘటించెను. తాను బంపిన వార్తవిని బల్లహుఁడు సైన్యముతో వచ్చి యెదుర్కొను నని యూసించి యెట్లో నిలఁద్రొక్కుకొని సంగరము చేయుచుం డెను.

బల్లహుఁడు కటకసైనికులతో రెండవనాఁటికిఁ గందా రపురము చేరుకొనెను. మాధవవర్మను ముందుగా నెదుర్కొ నెను. బల్లహుఁడు కనఁబడఁగానే మాధవుఁడు నేయి పడిన నిప్పువలె మండిపడి తలపడెను. బల్లహుని దృష్టిలోఁ దొట్టతొలుత మాధవుఁ డకృతాస్త్రుఁడుగాఁ గనఁబడెను. పోరు ముదిరినకొలఁది యతని విక్రమధోరణి నవగాహనము చేసికొని బల్లహుఁడు 'ఓహో' యనుకొనెను. క్రమక్రమముగా మాధ వవర్మ కరవాలపుఁ దళ్తుళలతోఁ గటకరాజు కన్నులు బైరులు క్రమ్మెను.

ఈ మాధవవర్మ, కందారపురాధిపతియై చిరకాలము క్రితము తనకత్తి కెరయైన సోమదేవభూపాలుని కుమారుఁడని బల్లహుఁడు నమ్మలేకపోయెను. మాధవవర్మ క్షణక్షణ వర్ధ మానమైన బలోత్సాహములతో "ఓరీ! నీతాతమూటగాఁ గందారపుఁగోట యాక్రమించితివి. ధర్మమూర్తియైననాతండ్రిని జంపి నాతల్లిని కష్టాలపాలు చేసితివి. నిన్ను బ్రతుకనిత్తు ననుకొంటివా?" యని గర్జించి పోరుచుఁ దనచేతి నిశితహే

తితో బల్లహుని గుండెలపై బొడిచెను. ఆపోటుతోఁ గటక రాజు 'కటకటా!' యని యఱచుచు నసువులు వీడెను.

మాధవవర్మకుఁ బైతృకమైన కందార రాజ్యము స్వాధీన మాయెను. ఆతని వీరసంపదకు, బాహుపరాక్రమమునకు, దెలుఁగులోకమెల్ల జేజేలు వెట్టెను. ఆంధ్రరాజ్య పునస్థాపన మహోత్సవమునకు మాధవవర్మ యాదేశముతో విజయతోరణములు కట్టఁబడెను.

విజయసుందరగాత్రుఁడగు 'మాధవవర్మ' యనుమకొండకుఁ బోయి కటకరాజ రక్తముతోఁ దడిసిన చేతికరవాలము మాతృదేవి పాదముల ముందుంచి మ్రొక్కి, వృద్ధమాధవ శర్మకుఁ గృతజ్ఞతతో సాష్టాంగపడి వారి యాశీస్సులతో నానందాశ్రువులతో నభిషిక్తుఁ డయ్యెను. మాధవశర్మ సిరియాలు దేవిని జూచి, తననిర్భరానందము నిట్లు వెల్లడించెను.

"అమ్మా! నీవు వీరమాతవైతివి. నీమూలమున నా గృహము, నాజీవితము చరితార్థములైనవి. నీవు పడిన కష్టములకు ఫలము లభించినది. మాధవుని పరిపాలనముతోఁ దెలుఁగుదేశమున సువర్ణము పండఁగలదు. ఇది యంతయుఁ బద్మాక్షీవరప్రసాదము. నీభర్తయగు సోమదేవభూపాలుని గోసేవా వ్రతఫలము. ఈ శతవృద్ధు మాధవుని స్వరాజ్య సంస్థాపనోత్సవము చూచుటకు నోఁచుకొని యింతవఱకు జీవించి యున్నాఁడు ... మాధవవర్మా! ఆంధ్రమాతకు నీ జీవిత చరిత్ర మమృతాభిషేకము".

గోంకరాజు

౧

విక్రమాదిత్యచక్రవర్తికి నేఁడు బొత్తిగాఁ జిత్తస్వాస్థ్యములేదు. అతఁడు కర్ణాట సామ్రాజ్యాధిపతి కావచ్చును. పశ్చిమ చాళుక్య చక్రవర్తి కావచ్చును. త్రిభువనమల్లుఁడే కావచ్చును. ఎంత యధికుఁడైన నేమి? ఒక సామంత మండలేశ్వరుఁడు తనసైనికుల నోడించి విజయలక్ష్మిని చేకొనుట కన్నులారఁ జూడవలసివచ్చినది. ఈపరిస్థితి తలఁచుకొన్న కొలఁది యతని హృదయము కలఁతపడుచున్నది; ఆలోచించిన కొలఁది కోపోద్రిక్త మగుచున్నది. క్రోధారుణితములైన యాతని కన్నులు చూచి ప్రక్కనున్న యొకమహావీరుఁడిట్లు పలికెను.

"ప్రభూ! సెలవైనచో స్వయముగా నేను సంగ్రామమునకుఁ బోయి వెలనాటి చోడునకు గర్వభంగము గావించి, దుర్జయ వంశస్థుల వేంగిదుర్గము లాక్రమించి తెలుఁగుదేశమునఁ శ్చిమచాళుక్య జయధ్వజములు నాఁటి వచ్చెదను".

ఈ మాటలు విక్రమాదిత్యుని యుద్రిక్త హృదయక్షేత్రముపై నమృతవర్షమువలెఁ బడెను. అతఁడు మహాసామంతాధిపతియగు ననంతపాలదండనాథుని శక్తిసామర్థ్యము లెఱిఁగినవాఁడు. అట్టి మహావీరుఁడు తలఁచుకొన్నచో వేంగి రాజ్యాక్రమణము ఘనకార్యముకాదు. "అనంతపాలా! నీవు సైన్యములను వెంట గొనిపోయి తెలుఁగుదుర్గము లన్నియు నాక్రమించుకొని వచ్చిన తరువాత మాటాడుకొందము. ఒక దుర్జయవంశీయునిచేత మనసైనికులు పరాభూతులై వచ్చి రనఁగా మాకుఁ దలకొట్టినట్టు లున్నది. ఆలసింపక నీవు శీఘ్ర ప్రస్థానము సాగింపవలె" నని విక్రమాదిత్యుఁడు పలుకఁగా ననంతపాలుఁడు 'దేవరచిత్త' మని బయలుదేఱెను.

మఱునాఁడు కర్ణాట సేనాసాహాయ్యముతో ననంత పాలుఁడు వేంగీరాజ్యాక్రమణమునకుఁ బ్రస్థానము సాగించెను. అనంతపాలుఁడు "రణరంగరాఘవుఁ"డని పేరుగాంచిన మహేశ్వర దండనాయకుని కుమారుఁడు. అశ్వత్థామ వంటి విక్రమ సంపద, సాహసోత్సాహములు కల వీరుఁడు. అనంతపాలునకు గోవిందనాయకుఁడు, లక్ష్మణుఁడు అను నిద్దఱు మేనల్లుండ్రు కలరు. వారిరువురు 'అనియంకభీము'లని ప్రఖ్యాతబిరుదము నందిన దండనాయకులు. సర్వవిధముల వారిది మేనమామ పోలిక.

అనంతపాలుఁడు తానొక్కఁడే లోకమును గ్రిక్కిలి గొనుటకుఁ దగిన పరాక్రమవంతుఁడు. అట్టివానికి గోవింద

లక్ష్మణుల తోడ్పాటొకటి. ఇంకఁ జెప్పుట కేమున్నది? తురగ రేఖా రేవంతులతో, సాహిణులతో, ననంతపాల దండనాయకుఁడు వేంగీరాజ్యమును గబళించుటకుఁ బగపూని బయలు దేఱెను.

దుర్నిరీక్ష్యమైన విక్రమాదిత్య సేనావాహిని యురకలు వేసికొనుచు నాంధ్రధరణిని ముంచెత్తినది. ఆసైన్యము నడచిన ప్రదేశమెల్లఁ జవుడువాఱిపోవుచుండెను. అప్రతిహతమైన యాదండు చూచి చాలమంది గుండెలు పగిలి మరణించిరి. అనంతపాలుని హుంకారముతోనే కొందఱు డిందిరి. ఇట్టి భయంకర దండయాత్ర యెన్నఁడు చూచియెఱుఁగమని తెలుఁగుపెద్దలు నిశ్చేష్టులైరి.

అనంతపాలుని సేనలు తొట్టతొలుత 'విజయవాడకోట' ముట్టడి కుపక్రమించెను. వెలనాటి చోడరాజు వెనుక నొకసారి విక్రమాదిత్యవరూథినితో హోరాహోరిగాఁ బోరి యీ విజయవాడలోనే గెలుపు సంపాదించెను. విజయవాడ పోరాటము పశ్చిమచాళుక్యసైనికు లెవ్వరును మఱచిపోలేదు. లోలోపల విక్రమచోడునితో యుద్ధము చేయుట వారికి భీతిహేతువు. కాని, యనంతపాలుఁడు, గోవింద లక్ష్మణులు నుండఁగా వారి కొక యపూర్వధైర్యము కలిగెను. పొంగిన కృష్ణానదివలె విజయవాడనెల్ల విక్రమాదిత్య వాహిని ముంచియెత్తెను. వేంగిరాజుల సైన్య మనన్యలభ్యమైన యభినివేశముతో శాత్రవుల నెదుర్కొని పోరాడెను.

కొన్నాళ్ళు వారికిఁ బోరాట మావిధమున సాగినది. ఏ విజయవాడకోటసంగ్రామమున వెలనాటి చోడభూపతి మున్ను విజయలక్ష్మినిఁ సంపాదించెనో, ఆ విజయవాడకోట సంగరములోనే, నేఁ డా చోడభూపతి యపజయము పాలుపడ వలసివచ్చెను. అనంతపాలుఁడు విజయవాడదుర్గ మాక్రమించి పశ్చిమచాళుక్యచక్రవర్తి యగు విక్రమాదిత్యుని పేర జయ ధ్వజము నాఁటెను.

వేంగిరాజ్యాక్రమణ గ్రంథములోఁ దొలి ప్రకరణముగా విజయవాడ ముట్టడించి యనంతపాలుఁడు దురంత పరాక్రమ ముతో, గుంటూరుమండలములోని చందవోలు దుర్గము నాక్రమింపఁబోయెను. అక్కడ వెలనాటి చోడరాజు కుమా రుఁడు గొంకభూపతి యనంతపాలు నెదురుకొని కదనము గావించెను. గొంకభూపతి తన తండ్రిని మించిన బాహువిక్ర మము కలవాఁడు. అతఁడు సంగరాంగణమున నిలఁబడినచో నెట్టివాఁడైన శృంగభంగము నందితీరును. అచంచలమైన పట్టు దల, అఖండమైన శరలాఘవచాకచక్యము, అమోఘమైన చోళచాళుక్యపరిభుభక్తి- యిన్ని సుగుణములు మూర్తీభ వించినవ్యక్తి గొంకభూపతి. చందవోలు దుర్గ సంరక్షణమున గొంకరాజు పట్టినపట్టు శ్లాఘాపాత్రమైనది. కాని, దైవ విలాసము విపరీతముగా నున్నపుడు పౌరుషము పనిచేయదు గదా!

అనంతపాలుఁడు చందవోలుకోటపై కర్ణాటపతాక మెగురవైచెను. బెజవాడదుర్గము, చందవోలుదుర్గము తన

వశమగుటచే నింక నాతనికిఁ బట్టఁబగ్గములులేవు. గోవింద, లక్ష్మణ దండనాయకు లిరువురు మేనమామ యుత్సాహాగ్నిని మఱింత రగిలించుచు సమరము సాగించిరి. అనంతపాలుఁడు క్రమముగా యావదాంధ్రము నాపోశనింపవచ్చు నని భావించెను. ఆ యావేశములో, నా విజయానందములో, నా సంగరోత్సాహములో ననంతపాలునకు నొకటికాదు, రెండుకాదు తెలుఁగుదేశములోని దుర్గములు పెక్కు స్వాధీనములయినవి.

పూర్వ చాళుక్యరాజుల తొలిరాజధాని 'వేంగి' చేతఁ జిక్కినది. తూర్పుగోదావరీమండలములోని జననాథపురము (దక్షారామము) స్వాయత్తమైనది. చేబ్రోలుకోట చేతియుసిరికమైనది. ఈకోటలు స్వాధీనపఱచుకొనుటలో ననంతపాలుని సైనికు లాయాగ్రామములకుఁ గల్పించిన నష్టము లపారములైనవి. కోటలు తొలినాఁటి స్వరూపసౌష్ఠవములను గోలుపోయి చాలభాగము కాఁడువాఱిపోయినవి. ఆంధ్రదుర్గములలో నెక్కడఁజూచినఁ గర్ణాటవైజయంతిక లెగురుచుండెను. ఆంధ్రమండలేశ్వరులందఱు కర్ణాటరాజునకుఁ గప్పముగట్టుచుఁ జేతులుకట్టుకొని నిలఁబడి జోహారు చేయవలసినవారైరి. నాఁటి విక్రమాదిత్యమహారాజు కాలములో నాంధ్రదేశమునఁ గర్ణాటసంస్కృతిసంపర్కము ముదిరి తెలుఁగుఁదనము సన్నగిల్లుచున్నదేమో యనిపించెను.

౨

తెలుఁగుచరిత్రలో "మండలికయుగ" మొక స్వర్ణ స్తంభము వంటిదైనచో వెలనాఁటి నాయకులా స్తంభముపై బొదిగిన రత్నములవంటివారు. వెలనాఁటినాయకులు దుర్జయ వంశీయులు. పూర్వ చాళుక్య చోళ ప్రభువులను దైవసములుగా భావించి వారి సామంతులై విక్రమవంతులై యనితర సాధారణమైన ప్రభుసేవాసక్తిని ప్రకటించి ధన్యులైనవారు.

చాళుక్యవంశవర్ధనుఁడగు రాజరాజ నరేంద్రుని యనంతర మాతని సంతానరత్నమైన కులోత్తుంగ-చోళుఁడు తన రాజధానిని వేంగిదేశమునుండి యరవదేశమునకు మార్చుకొనెను. మాతామహస్థానమగు చోళధారుణికిఁ, బైతృకముగా సంక్రమించిన తెలుఁగునేలకుఁ గులోత్తుంగుఁడే ప్రభువాయెను. అందులకే, యీతని నుభయకులోత్తుంగచోడుఁడని ప్రశంసించిరి.

కులోత్తుంగచక్రవర్తి యరవదేశమునుండి పెద్దయుద్యోగులను, సేనానాయకులను దెనుఁగుదేశమునకుఁ బంపుచుఁ, దన కుమారులను ప్రతినిధులుగా నుంచుచుఁ బరిపాలనశ్రద్ధ చూపక పోవుటచే నాంధ్రరాజ్యము చెదరి సామంతపాలనము పాలైనది.

కులోత్తుంగ-చోడచక్రవర్తికిఁ బశ్చిమ చాళుక్యచక్రవర్తి యగు త్రిభువనమల్ల విక్రమాదిత్యునకుఁ గల వైరబీజములు

నానాఁటికిఁ బెంపొందసాగినవి. వేంగిదేశమును మ్రింగఁజూచు చున్న యీ కర్ణాటరాజునెడ సందేహముతోఁ దెలుఁగుదేశ మునఁ బ్రతినిధులై పాలించుచున్న తనకుమారుల కండగా నుండుటకై కొందఱు భృత్యవంశీయులకు రాజలాంఛనము లొసంగి వారిని మండలేశ్వరులనుగాఁ జేసెను. ఆ భృత్య వంశస్థులు చిరకాలమునుండి చాళుక్యరాజులకు నమ్మినబంటులు. వారెన్నఁడును దాముకొలిచెడి ప్రభువులకు ద్రోహముచేసిన వారుకారు. బలపరాక్రమములందుఁ జాళుక్య చోళరాజు లకు సమానులు.

పూర్వాంధ్రదేశమును మండలములుగా విభజించుకొని పరిపాలించిన వంశమునకు వెలనాఁటివంశ మని పేరు. ఈవంశ మునకే దుర్జయవంశమనియుఁ బేరువచ్చినది. కన్నడరాజగు విక్రమాదిత్యుని సైన్యము విజయవాడ, చందవోలు మున్నగు తెలుఁగుదుర్గములు ముట్టడించుటకు వచ్చిన సందర్భమునఁ దమ విక్రమములను బ్రదర్శించి సంగరముచేసిన వెలనాఁటిచోడరాజు, ఆతనికుమారుఁడగు గొంకరాజు దుర్జయవంశములో రత్నముల వంటివారు.

నేఁడు చోడరాజు, గొంకరాజుకూడఁ బరాధీనస్థితిలో నుండవలసివచ్చినది. చోళ చాళుక్యప్రభువులను గొలుచుట వారికిష్టముగాని, విక్రమాదిత్యునకుఁ గ్రిందివారై యుండుట బొత్తిగా నిష్టములేదు. కాని, తెలుఁగు దేశమునకుఁ గర్ణాటరాజ పరిపాలనము తప్పనిదయ్యెను. పరరాజుల దాస్యవిముక్తికై

వెలనాటి చోడరాజుకుమారుఁడు "గొంకరాజు" పడుచున్న శ్రమ యింతయని చెప్పనలవిగానిది.

3

విజయవాడ కారాగారమున నెవరో యిరువురు బంధితులై యుండిరి. వీరకంకణములు దాల్చెడి వారిచేతుల కినుప సంకెలలు వేయఁబడియున్నవి. వారిముఖములలో విచారము గాని విషాదముగాని యెక్కడను గానఁబడుటలేదు. కారాగారమునఁ గట్టఁబడియున్న వారి వదనములలో నట్టి ధైర్యము, నుత్సాహము చూచినచో వింత కలిగింపకమానదు. ఆయిద్దఱిలో నొకఁడు వృద్ధుఁడు. రెండవవాఁడు యువకుఁడు. పోలికలనుబట్టి ముసలివాఁడు యువకునకుఁ దండ్రివలెఁ గనిపించుచున్నాఁడు. వారిలో వారు మెల్లఁగా నిట్లు సంభాషించుకొనుచున్నారు.

వృద్ధుఁడు:- నాయనా! మనమీ కారాగారముననుండి బయటఁబడు నుపాయ మేమైన నాలోచించితివా?

యువకుఁడు:-నాన్నగారూ! ఉపాయమున కేమున్నది! ఈరాత్రి వేళ నిక్కడనున్న కావలివానిని గానిచ్చి మనమీ బంధము తప్పించుకొవలయును.

వృద్ధుఁడు:- ఏమో! ఎట్లుచేయవలెనో నాకేమియుఁ దోఁచుట లేదు. చాళుక్య చోళప్రభువులయెడ ఋణవిముక్తి చేసికొనుట యీజన్మకుండునా యని సందేహించుచున్నాను.

యువకుఁడు:- నాన్నగారూ! మీరేమియు సందేహింపవలదు. ఈబంధవిముక్తియుఁ బ్రభువుల ఋణవిముక్తియునొక్కసారియే. పశ్చిమచాళుక్యుల కర్ణాట పతాక తెలుఁగు దుర్గములపై నిఁక నెగురనీయను. అనంతపాలుఁడు కాదు, గోవింద దండనాయకుఁడు కాదు, హరిబ్రహ్మాదు లెవరడ్డువచ్చినను చాళుక్య చోళపతాకము లాంధ్ర దుర్గాగ్రములపై బ్రతిష్ఠించి తీరెదను.

వృద్ధు:- నాయనా! తొందరపడకుము. ముందు మన మీ నిర్బంధమునుండి తొలఁగి బయటఁబడవలయును. తరువాత నేమిచేసినను జేయవచ్చును. విక్రమాదిత్యుఁడు చండశాసనుఁడు. సైన్యబలము గలవాఁడు. దానికిఁ దోడు రెండవయశ్వత్థామవంటి యనంతపాలుఁడొకఁడు. అతని విక్రమసంపద స్మరించినచో నాకుఁ జెప్పకపోవ నేల! కొంచెము వెఱపు కలుగుచుండును. ఒకటికాదు విజయవాడదుర్గము, చందవోలు కోట, జననాథపుర దుర్గము, చేబ్రోలుకోట యిన్ని- యొక్కసారి యాక్రమించుకొనఁగలిగె ననఁగా ననంతపాలుఁ డెంత పరాక్రమవంతుఁడో యోచింపుము. అట్టివానితో మనము

ప్రతిఘటించుట సాధారణమైన పని కాదు. చెటం దోలంగి మనప్రభువు విక్రమచోళుని కలసికొని కులోత్తుంగచోడచక్రవర్తి సాహాయ్యముం గైకొని కార్యము సాధింపవలయును.

యువ:- నాన్నగారూ! ఈమాసము దాటకుండ వేంగిసామ్రాజ్యమునుండి కర్ణాటులను దఱిమివేయంగలను. మీ రేమియు భయపడవలదు. సందేహపడవలదు. కర్ణాటాధిపతి విక్రమాదిత్యుండు మరణించిన తరువాతం గన్నడదేశమంతయు నేండస్తవ్యస్తముగా నున్నది. అతనికుమారుండు భూలోకమల్లసోమేశ్వరుం డిప్పుడు ప్రభువైనాండు. క్రొత్తగా రాచఱికమునకు వచ్చియుండుటచే భూలోకమల్లుండు కర్ణాటదేశసంరక్షణము నందే శ్రద్ధవహించుచున్నాండు. అతనికిం దెలుంగుదేశ మేమగుచున్నదో యన్న శ్రద్ధయున్నట్లులేదు. ఇక్కడి దుర్గములకుం బ్రతినిధులై పాలించుచున్న కర్ణాటదండనాయకులును "మనకేమి" యను భావముతో నేమఱుపాటుగా నుండియుందురు. ఈసమయమున స్వారాజ్యసంపాదనము మనకు దుస్సాధముకాదు.

వృద్ధు:- నాయనా! నీవు "దుర్జయ"వంశస్థులు మాటాడవలసిన తీరున మాటాడితివి. చిన్నవాండవైనను నీకు ధైర్యసాహసములు హెచ్చు. వృద్ధుండనగుటచే నాకు రక్తపటిమ తగ్గి యధైర్య మావరించుటయు సహజము.

చోళచాళుక్యసామ్రాజ్యమును బునస్థాపనముచేసి మన వంశ గౌరవమును గాపాడి పితృభక్తిని వెల్లడించు బాధ్యత నీయందున్నది. కాళహస్తీశ్వరుని కరుణ నీయెడల నిండారుఁగాక!

యువ:- మన మీగండము గడచి బయటఁబడినచో నేదైనను సాధింపవచ్చును. కానిండు. ఈరాత్రియే కావలివానిని బరిమార్చి యీ కారాగారమునుండి విముక్తులము కావలయును. ఈ కర్ణాట ప్రతినిధుల కన్నులలోఁ గారము గొట్టవలయును.

వారిరువురు మఱికొంతసేపు బహురహస్యముగా నేదో మాటాడుకొనిరి. యువకుఁడు వృద్ధునిచెవిలో చివర నేదియో చెప్పి మందహాసము చేసెను. ఆయువకుని చిఱునవ్వు చూచి వృద్ధుని మొగము వికసించెను. ఇరువురు నొకరినొకరు సాభిప్రాయముగాఁ జూచుకొనిరి.

౪

విక్రమాదిత్య చక్రవర్తి కుమారుఁడు భూలోకమల్ల సోమేశ్వరుఁడు కర్ణాటకమునకు నేఁడుప్రభువు. విక్రమాదిత్యుని యనంతర మాతని కొక పెద్దబాధ్యత తలపైఁబడినది. తండ్రి

వెనుక నతఁడు వినోదములతోఁ గాలక్షేపము చేయుచుండెడి వాఁడు; సామ్రాజ్యమం దేమి జరుగుచున్నను, నాతనికాక దిగు లుండెడిదికాదు. కాని, సోమేశ్వరచక్రవర్తి రాజ్యతంత్రము లలోఁదెలివిగలవాఁడు కాకపోలేదు. తాను ప్రభుత్వమునకు వచ్చినతరువాతఁగాని దానిని పరిదర్శించుట యతనికిష్టము లేకపోయెనుగాఁబోలు !

భూలోకమల్ల సోమేశ్వరచక్రవర్తి యొకనాఁడు కొలువు దీర్చియుండెను. గోవింద దండనాయకుఁడు, అతని కుమారుఁడు దండాధిప లక్ష్మరాజు, సిద్ధిరాజ దండనాయకుఁడు, అతని పుత్రుఁడు కేచిమయ్య మున్నగు మహావీరులందఱు కొలువులో నుండిరి. చక్రవర్తి వారి నందఱనుజూచి యిట్లు వచించెను:—

"వింటిరా ! వేంగిదేశపుఁ బరిస్థితి యెట్లుమాఱినదో ! మా తండ్రిగారు వేంగిదేశ సంరక్షణమునకై 'అనంతపాలుఁడు' మున్నగువారి నక్కడఁ బ్రతినిధులుగా నియమించినారు. అనంతపాలుఁడు మహావీరుఁడనుటలో నాకు సందేహములేదు. అతఁ డింతవఱకు బహుజాగరూకతతో వేంగిని సంరక్షించు చున్నాఁడు. కాని, వెలనాఁటి చోడరాజు, ఆతని కుమారుఁడు ఇమ్మడిగొంకరాజు నాలుగు నాళ్ళక్రిందట విజయవాడ కారాగారమునుండి యెట్లో తప్పించుకొనిపోయిరఁట. మనచే బంధితులైన వెలనాఁటివీరులు వా రిద్దఱు తప్పించుకొని పోయిరనఁగా, రాజకీయముగా మనకది యెంతోనష్టకారణము. వా రిద్దఱు గొప్ప పేరుమోసిన పరాక్రమవంతులు. వారిలో, చోడరాజు

కంటె నతనికుమారుఁడు 'గొంకరాజు' వయస్సుచేఁ జిన్నవాఁడయ్యు మహాబల పరాక్రమములు కలవాఁడు. ఆ తండ్రి కొడుకు లిరువురు విక్రమచోళుని యొద్దకుఁబోయి తెలుఁగుదుర్గములు తిరిగి యాక్రమించుకొనుటకుఁ బన్నాగములు పన్నుచుందురు. వారు ముగ్గురు కలసినచో మనము వేంగిరాజ్యముపై నాస వదలుకొనవలసినదే.

ఆలోచింపఁగా, మా కొకటి తోఁచుచున్నది. అనంతపాలుఁడు మున్నగు మన ప్రతినిధులు వెలనాఁటి చోడులతోఁ గలసి యేదో కుట్రపన్నుచున్నా రనిపించుచున్నది. కానిచో, విజయవాడ కారాగారమునుండి తప్పించుకొనిపోవుట కెన్ని గుండెలుండవలయును ? దీనిలో, ఏదోపన్నగడ యుండితీరును.

దీనికి, మే మొక విఱుగుడు నుపయోగింపఁ దలఁచుకొంటిమి. వేంగిదేశ సంరక్షకులుగానున్న యనంతపాలాది దండనాయకులను గర్ణాటమునకు రప్పించుకొనవలయును. వారికి బదులుగా మీలోఁగొందఱు తెలుఁగు దుర్గములకుఁ బ్రతినిధి

ఈ మార్పు జరిగినచో వెలనాఁటిచోడులకుఁ దెనుఁగుకోటలు వశముకాకుండ నభేద్యములుగా నుండఁగలవు. గోవింద దండనాయకుఁడు, దండాధిప లక్ష్మరాజు, సిద్ధిరాజు దండనాయకుఁడు, కేచిమయ్య, వీరు నలుగురు వేంగిదేశమున కేఁగి దుర్గసంరక్షణము చేయవలయునని యాదేశించుచున్నాము. అనంత పాలాదులు వేంగినివిడిచి స్వదేశమునకుఁ దిరిగివచ్చునట్లుగా నాజ్ఞాపత్రములు పంపించె

దము. అప్రమత్తులై యానలువురును దెలుగుఁగోటలు కాపాడి వెలనాటిచోడుల తంత్రములను బ్రతిఘటించు చుండవలసి యున్నది."

భూలోకమల్ల చక్రవర్తి యాజ్ఞకు గోవింద దండనాయకాదులు నలువురు తలలొగ్గిరి. సముచితమైన సైన్యమును వెంటఁగొని వారు మఱునాఁడే వేంగీదేశమునకుఁ బయనమైరి. అనంతపాలాదుల ప్రాతినిధ్యమునకుఁ దెలుఁగునాఁట నీఁక స్వస్తి చెప్పఁబడెను.

——

౩

క్రీస్తుశకము ౧౧౨౬ సంవత్సరమున పశ్చిమ చాళుక్య సార్వభౌముఁడు విక్రమాదిత్యుఁడు స్వర్గస్థుఁడయ్యెను. అది మొదలు విక్రమచోడ చక్రవర్తికిఁ గొంత మనశ్శాంతి యేర్పడెను. పశ్చిమ చాళుక్యరాజగు విక్రమాదిత్యుఁడు సామాన్యుఁడుకాఁడు. అతని కాలములోఁ బరాధీనమైన తెలుఁగు దుర్గములను స్వాధీనము చేసికొనుట యెవ్వారితరమును గాక పోయినది.

కాళహస్తీశ్వరుని సన్నిధానమున నొకనాఁడు విక్రమచోడ చక్రవర్తియు, వెలనాటి చోడరాజు, ఆతని కుమారుఁడు

గొంకనరేంద్రుఁడును సమావేశపడిరి. వారి మువ్వురముఖము లందు నవ్యక్తముగా నొక సంతోషతరంగము పొంగి ప్రవహించుచున్నటు లుండెను. వారు మువ్వురు నీశ్వరసాక్షిగా నేదో ప్రతిజ్ఞ చేసికొనుట కచ్చటఁగూడియుందురని తెలియుచున్నది. విక్రమచోడచక్రవర్తి ప్రతిదినము కాళహస్తీశ్వరుని సందర్శించి పోవుచుండును. ఈనాఁడుకూడ నెప్పటివలెనే యీశ్వరసందర్శనమున కామహారాజు విచ్చేసెను. అతనివెంట మఱియిద్దరు క్రొత్తవారుండిరి. వారెవరో తెలిసికొందమను నూహ యెక్కడివారికిఁ గలుగలేదు. మహారాజు గుడిలోనికి వెళ్ళివచ్చినతరువాతఁగాని యితరభక్తులు, యాత్రికులు వెళ్ళుటకు వీలులేదు. ఈనాఁడు విక్రమచోడచక్రవర్తి యొక జాముసేపు దేవసన్నిధిలో నుండిపోయెను. అర్చకులకు, వచ్చిన భక్తులకు నిది యాశ్చర్యముగా నుండెను.

కాళహస్తీశ్వరారాధన మయినతరువాత, ముఖమండపముపైఁ గూరుచుండి విక్రమచోడచక్రవర్తి వెలనాఁటి చోడుని, గొంకరాజును జూచి యిట్లు పలికెను: "ఈశ్వర కరుణచే మీరు పశ్చిమచాళుక్యుల చెఱనుండి బయటఁబడి వచ్చితిరి. విజయవాడ కారాగారమునుండి మీరెట్లు తప్పించుకొనివచ్చితిరో, మిక్కిలి యాశ్చర్యముగా నున్నది. మీ తండ్రికొడుకు లిరువురు మాయెడల, తెలుఁగుదేశమునెడల నపార గౌరవాదరములు కలవారు. వీరాధివీరుఁడైన యనంతపాలుని

బారినుండి తొలఁగిపచ్చుట సాధారణకార్యము కాదు. ప్రకృతము మన కర్తవ్య మేమి యాలోచించితిరి?''

గొంకరాజు వినయవినమితశిరస్కుఁడై మహారాజుతో నిట్లు పలికెను:

"ప్రభూ! అనంతపాలుని బుట్టలోఁ బెట్టుకొంటిమి. చెఱనుండి యెట్లు బయటఁబడితిమో యీగాథయంతయు నునవిచేసి విసిగింపను. ఇప్పుడు భావికార్యక్రమమునుగూర్చి యోచింపవలెను. అనంతపాలాది ప్రతినిధులపై పశ్చిమచాళుక్య చక్రవర్తి యగు భూలోకమల్లునకు విశ్వాసము పూర్తిగాఁ బోయినదని విన్నాను. మేము కారాగారమునుండి తప్పించుకొనిపోవుటలో ననంతపాలుని ప్రమత్తత కారణమైయుండునని భూలోకమల్లుఁడు భావించి యాంధ్రదుర్గ రక్షణకై క్రొత్తవారిని గొంపఱిని కర్ణాటమునుండి పంపుచున్నాఁడనియు, ననంతపాలాదులను దిరిగి కన్నడదేశము వచ్చివేయవలె నని యాజ్ఞాపించెననియు నిన్ననే తెలిసికొంటిని. ఇంక మన ప్రయత్నము సఫలమైనట్లే. సందేహాము లేదు. ఇపుడు కన్నడమునుండి వచ్చువారందఱును క్రొత్తవారు. వారికిక్కడ దుర్గముల లోఁతుపాతులు తెలియవు. అనంతపాలుఁడు భూలోకమల్లచక్రవర్తియెడలఁ గసితో నుండును. తన ప్రాతినిధ్యము బాగుగాలేదని చక్రవర్తి యాక్షేపించుటయే దీనికిఁ గారణము. ఈసందర్భమున వేంగిరాజ్యాక్రమణము మనకు సుకరము. కావున నాకస్మికముగా దుర్గముల నాక్రమించుటకుఁ

బ్రయత్నము చేసెదను. యథార్థమైన ప్రభుభక్తి కలవాఁడనై సచ్ఛోఁ గస్నడపతాక పెట్టికి తెలుఁగురాజ్యమున నాంధ్రజయ ధ్వజము నెలకొల్పఁగలవాఁడను. ప్రభువుల యానతికి, నాశీస్సులకు నంజలిపట్టుచున్నాను.''

గొంకమయ్య యాలోచనమునకు విక్రమచోడుని హృదయ మానందభరితమయ్యెను. గొంకమయ్య తండ్రి వెలనాఁటిచోడరాజు యువకునివలె యుద్ధోత్సాహమును బ్రదర్శించెను.

౬

గొంకరాజు నాయకత్వముతోఁ బశ్చిమచాళుక్యరాజుల పారతంత్ర్యమునుండి తెలుఁగుదేశమును విడిపింపఁజేయుటకు సర్వప్రయత్నములు జరిగెను. వెలనాఁటిదుర్జయవంశీయులందఱు నవనవోత్సాహములతో యుద్ధరంగములకు దూకిరి. గొంక రాజు మేనమామ పండయ్య, బావమఱఁది గొంకయ్య మున్నగువారు బెబ్బులులవలె రణరంగమునఁ బ్రవేశించిరి. దుర్జయ వంశీయుల సేనావాహిని వేంగిదేశము నలుగడలను ముంచి యెత్తెను.

గొంకరాజు ఖడ్గపాణియై యెల్లయెడలఁ దానే కనిపించుచుఁ దన సైనికులను బురికొల్పుచు వేసవిసూర్యునివలె

వెలుఁగుచుండెను. పశ్చిమచాళుక్య మంత్రులు, దండనాయకులు గుమిగూడి దుర్జయుల నెదుర్కొనుటలో నెత్తులు వేసికొని తమసేనలను వ్యూహములుగాఁ బన్నుచుండిరి. కళింగరాజులు పశ్చిమచాళుక్యులకుఁ దోడుగా వచ్చిరి. కర్ణాటరాజసేన మహాసముద్రమువలె భయంకరముగా నుండెను.

గోదావరీతీరమునఁ గర్ణాటసేనలకు, దుర్జయసేనలకు దారుణమైన ప్రతిఘటనము జరిగెను. కళింగవాహిని తోడ్పాటుతోఁ గర్ణాటసేనల విజృంభణమునకుఁ బట్టఁబగ్గములులేవు. దుర్జయసేనలు శక్తికొలఁది శాత్రవుల నెదుర్కొని కదనరంగమున విహారము చేయుచుండెను. గొంకరాజు పార్థునివలె యుద్ధముగావించుచుండఁగాఁ గర్ణాటవీరులకు గుండెబెదురుగా నుండెను. తన 'దుర్జయ' సేనలు శత్రువాహినిచే సంహరింపఁబడి పలుచవడిపోవుచున్నను 'గొంకమయ్య' యధైర్యపడక ద్విగుణీకృతోత్సాహముతోఁ బ్రళయరుద్రునివలెఁ బోరాటము సాగించుచుండెను. గొంకమయ్య వాఁడిఖడ్గమున కెరయై మొందలో మహావీరులు వీరస్వర్గ మలంకరించిరి. గొంకరాజు హుంకారము విని గుండెలు పగిలి మొందలో కర్ణాటవీరులు ప్రాణములు గోల్పోయిరి. అచంచలమైన మాతృదేశభక్తితో, అవ్యాజమైన చాళుక్యచోళప్రభుభక్తితో, అమోఘమైన బాహుశక్తితో యుద్ధరంగమునఁ గాలునివోలె విజృంభించిన 'గొంకమయ్య' రణనైపుణ్యమును జూచి యుభయపక్షముల వారు నివ్వెఱపడుచుండిరి. 'గొంకమయ్య' లో నిట్టి యద్భుత

యుద్ధకుశలత దాఁగియున్నదని కర్ణాటవీరులెవ్వరును దలంచి యుండలేదు.

'గోంకరాజు' నెదుర్కొని గోవిందదండనాయకుఁడు, లక్ష్మణదండనాయకుఁడు, కేచిమయ్య మున్నగు కర్ణాటవీరులు పోరుసలుపుచుండిరి. తనకుఁ దోడ్పాటుగాఁ జెప్పఁదగినవీరుఁ డెవ్వఁడును లేకున్నను 'గోంకరాజు' నిశ్శంకసాహసోత్సాహ ములతోఁ గర్ణాటవీరత్రియమును దానొక్కఁడే ప్రతిఘటించెను. అపూర్వమునమోఘమునైన గోంకమయ్య సమర చాతురికి శాత్రవులు చెల్లాచెదరగుచుండిరి. కళింగసేనలు కకావికలగుచుండెను.

గోవిందదండనాయకుఁడు, లక్ష్మణదండాధిపతి, కేచిమయ్య— ఈముప్పురుమహావీరులును గోంకరాజు విక్రమాటోపమునకుఁ దాళలేకపోయిరి, వయస్సులో గోంకరాజు కర్ణాటవీరత్రియముకంటెఁ దక్కువవాఁడేకాని, పరాక్రమములో వారిని మించినవాఁడు. సైంధవవధనాఁడు పార్థుఁడు చూపిన విక్రమక్రమము నేఁడు గోంకరాజు ప్రదర్శించుచుండెనా? యనిపించినది. గోవిందదండనాయకాదులు ముప్వురును గోంకరాజు ముందు నిలఁబడి తలపడుటకు సమర్థులుగాక పరాజితులై పలాయితులైరి.

కర్ణాటసేనాశోణితముచేఁ దడిసిన గోంకరాజు విజయఖడ్గమున కింక విశ్రాంతి లభించెను. పశ్చిమచాళుక్యుల పతా

కములుపోయి, చోళచాళుక్యవైజయంతికలు వేంగిదేశదుర్గ ములపై నెగురఁజొచ్చినవి. పరాక్రాంతములైన విజయవాడ, చందవోలు, జననాథపురము, చేబ్రోలు, వేంగి మున్నగు కోట లాంధ్రమాతృస్తవగీతములతోఁ బ్రతిధ్వనించినవి. ఎక్కడ విన్నను 'గొంకరాజు' పరాక్రమశ్లాఘావాక్యములే. ఎక్కడ నాలించినను వెలనాఁటిదుర్జయుల ప్రభుభక్తిప్రశంసలే. వెలనాఁటిచోళుని కదుపు నేఁటికి ఫలించినది. గొంకరాజు కోరిక నేఁటికి సఫలమైనది. తెలుఁగువారి వాంఛి తము నేఁటి కీడేరినది. పశ్చిమచాళుక్యాధికారము నేఁటితో సమాప్తమైనది.

విజయలక్ష్మీవిరాజమానుఁడగు 'గొంకరాజు' చాళుక్య చోళచక్రవర్తియగు కులోత్తుంగచోడుని దర్శించుటకు బయలుదేఱెను. ఆహా! దుర్జయవంశీయుల ప్రభుభక్తి యెంత టిదో యరయుఁడు! తాను గర్ణాటసైన్యమును జెండాడి శాత్రవుల శిబిరములనుండి కొల్లఁగొట్టిన ధనకనకరాసులను, రథగజతురగాదులను వెంటఁబెట్టుకొని వెళ్ళి గొంకరాజు కులోత్తుంగచక్రవర్తి కుపాయనముగా నర్పించి, యిట్లు మనవి చేసికొనెను.

"ప్రభూ! ఈ కానుకలన్నియు దేవరవారివి. తమ యాశీర్బలమువలనఁ గర్ణాటపతాకలను బెఱికి వేంగిదుర్గము లపై చోళచాళుక్యపతాకలను బ్రతిష్ఠించి వచ్చితిని. గోవింద దండనాయకాదులగు కర్ణాటవీరశిరోమణులందఱుఁ దమ

విధేయుని ఖడ్గధారకు బెదరి చెదరి పాఱిపోయినారు. నేటితో బ్రభువుల ఋణమునుండి విముక్తుండ నగుచున్నాను. ఆంధ్ర రాజ్యము స్వాధీనముచేసికొని ప్రభువుల కర్పించి ధన్యుండ నగుచున్నాను. ఇంతకంటె నాకేమియు నక్కఱలేదు. దుర్జయ వంశము ప్రభుసేవాపరాయణ మైనదని యీసంఘటనము చాటినచో నాకదే పదివేలు."

గోంకరాజు సేవాధర్మమునకుం గులోత్తుంగచక్రవర్తి యాశ్చర్యపడి, యానందభరితుండై నిండుకొలువులో నాతని నభినందించి యిట్లు వచించెను:

"గోంకరాజా! చాళుక్యచోళ గౌరవమును గాపాడిన వీర మూర్ధన్యుండవు నీవు. నీ వీరత్వ మెంత శ్లాఘాపాత్రమో నీసౌజన్యమంత ప్రశంసాయోగ్యమైనది. వేంగిరాజ్యములోని దుర్గముల నన్నిటిని గర్ణాటుల బారినుండి తప్పించిన నీ పరాక్రమము హృదయపూర్వకముగా నభినందించుచున్నాను. "దుర్జయవంశీయులు" మాయెడల భక్తివిశ్వాసములు కలవారు. నీ వా వంశమునకు రత్నమువంటివాండవు. వెలనాంటి చోడ రాజు నీవంటి పుత్రునిగని ధన్యుండయ్యెను. యావదాంధ్రమును నద్వితీయవిక్రమముతో నాక్రమించుకొంటివి. నీవు తెలుంగు రాజ్యమును మా కర్పణచేయవలసిన యవసరము వాస్తవమునకు లేదు. కాని నీకుంగల ప్రభుభక్తిని బురస్కరించుకొని యా రాజ్యము నాకర్పించుటకు వచ్చియుంటివి. నీ సేవాధర్మము తెలుంగు దేశచరిత్రలో సువర్ణాక్షరములతో ముద్రింప

దగినదికాని సాధారణ మైనదికాదు. ఇట్టి యమోఘ విజయఁ గౌరవమును బ్రభువునకు దారవోయఁ దలఁచుకొన్న నీ నిష్కామ రాజభక్తి యద్వితీయమైనది. చాళుక్యచోళసామ్రాజ్యము మీ "వెలనాటి దుర్జయవంశము" నెన్నఁటికి విస్మరింపఁ జాలదు. నీ భుజబలముతో నార్జించిన యాంధ్రరాజ్యమునకు నిన్నుఁ బట్టాభిషిక్తునిఁ జేయుచున్నాను. సర్వాధికారములతో దానిని బరిపాలించుకొనుము."

కులోత్తుంగచోడచక్రవర్తి గొంకరాజు నాశీర్వదించి వేంగిరాజ్యాధిపతిగాఁ బట్టముగట్టెను. ఆసందర్భమున వైతాళికులు గొంకరాజు నీవిధముగాఁ గైవారముచేసిరి.

"చలమర్తిగండ, వీరమహేశ్వర, చాళుక్యరాజ్యభవన మూలస్తంభ, క్రీడాలోడిత గౌడకుంతల కుభృత్సేనార్ణవ, శివపాదశేఖర, వేంగి విషయషోడశ సహస్రావనీవల్లభ, శంకర కింకర, గొంకనరేంద్ర జయ విజయీభవ! జయవిజయీభవ!"

గొంకనరేంద్రుఁడు కులోత్తుంగునకు వినమ్రుడై మ్రొక్కి సెలవుఁ గైకొని తెలుఁగుదేశమునకు విచ్చేసి ధనదుపురమను నామాంతరముగల "చందవోలు" రాజధానిగాఁ బ్రాగాంధ్ర దేశమును క్రీస్తుశకము ౧౧౩౨ సం॥ నుండి ౧౧౬౨ సం॥ వఱకుఁ బరిపాలనము గావించెను. "మండలికయుగము" న గొంకరాజునకు సాటియైన పరాక్రమవంతుఁడు, ప్రభుభక్తి భరితుఁడు మఱియొకఁడు లేఁడనుట యతిశయోక్తి కాదు.

అన్నమయ్య

౧

కడప మండలములోని తాళ్లపాక గ్రామములో 'తాళ్లపాక' వారి కుటుంబములు నాలుగైదుకలవు. తాళ్లపాకవారు నందవరీక స్మార్త విప్రకుటుంబమునకుఁ జెందినవారు. వారందఱు సదాచార పరాయణులు, సత్యవాక్య పరిపాలకులు. ఒకరికింత యాతిథ్యమిచ్చుటకుఁ దాము తృప్తిగా భుజించుటకుఁ దగినసంపత్తి కలవారు. 'తాళ్లపాక'లో అన్నమయ్య యను వ్యక్తిపేరు విన్నవారు పెక్కుమందియుండరు. అన్నమయ్య పదునాఱు సంవత్సరముల వయస్సువచ్చువఱకుఁ జదువు సంధ్యలతో సంబంధములేక మందునివలెఁ దిరుగుచుండెడివాఁడు. 'రఘువంశము' చంకనుబెట్టుకొని గురువుగారి యింటికి వెళ్లి వచ్చుటయేతప్ప నతనికొక యక్షరమైనను వచ్చినట్లులేదని గ్రామస్థులు పరిహసించుచుండెడివారు.

అన్నమయ్య చిన్ననాఁటినుండియుఁ బరిహాసములకు లెక్కసేయని స్వభావముకలవాఁడు. ముఖముమీఁద నాడి పోసినను దుడిచివేసికొను చిత్తవృత్తి యతనికి వెన్నతోఁ

బెట్టినది. కాని, యూరిలో నొకరిద్దఱకుఁ దప్ప నతనిలో నంతర్గతముగానున్న యున్నతభావమును గ్రహించినవారులేరు. అన్నమయ్య జడబుద్ధియనియు, వెఱ్ఱివాఁడనియుఁ గొందఱు పరిహాసము చేయుచుండుట విన్నప్పు డాతని తలిదండ్రులకుఁ జాల దిగులుగా నుండెడిది. తన్నుఁ బరిహసించువారినిజూచి 'యన్నమయ్య' చిఱునవ్వు నవ్వుకొని పోవుచుండువాఁడు.

అన్నమయ్య పసితనమునుండియు నేకాంతమునఁ గూర్చుండుట కలవాటుపడెను. అతనికి సంఘములోఁ గూర్చుండుటకాని, లేనిపోని మాటలతోఁ గాలక్షేపము చేయుటకాని కిట్టదు. తా నొక్కఁడు నేతోఁటలోనికో, యే దొడ్డిలోనికో పోయి తనలోఁదాను కూనిరాగములు తీసికొనుచుండువాఁడు. అతని యీ యేకాంతస్థితిని జూచిన యజ్ఞులుకొందఱు 'పిచ్చివాఁ'డని పరిహాసము చేయుచుందురు.

అన్నమయ్య పూర్ణచంద్రునివలె షోడశవర్షవయస్కుఁడయ్యెను. ఇప్పుడిప్పుడే యతని కన్నులలో వెనుకలేని యుజ్జ్వలత్వము నరసి పెద్దలు కొందఱాశ్చర్యపడుచుండిరి. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుఁడు. అతఁడు ప్రభాతమున నిద్రనుండి మేలుకాంచినతోడనే మధురమైన కంఠస్వరముతో వేంకటేశ్వరస్వామిపైఁ గీర్తన లేవో పాడుకొనుచుండును. ఆ కీర్తన లాతఁడు స్వయముగా రచించ్చినవేకాని, యితరకవి యెవ్వఁడును రచించినవికావు. ఈ విషయము గ్రాహ్య

స్థలలోఁ జెక్కుమందికిఁ దెలియదు. ఎవరో వ్రాసినపాటలు 'అన్నమయ్య' పాడుకొనుచుండెనని వారిభావము.

ఒకనాఁటి సుప్రభాతమున నన్నమయ్య యీ క్రింది పాట పాడుకొనుచుండెను:—

'పాలయలుక నిద్దురలు భోగించ దొరకొంటి
వలర వడిమేల్కొనవె - అఖిలేశ్వరా!
తరుణికై నపుడె పరితాపసూర్యుఁడు వొడిచె
వరుసఁ జెవికన్నుఁగలువలు మొగిచెను
మరుని సాయకపుఁదామరలు వడివికసించె
కరుణతో మేల్కొనవె కమలేశ్వరా!
కాంత నిట్టూర్పులను గాలియును నగ్నియును
వంత చెమటలవాన వరుణుఁడును
వింతలుగ నిన్ను సేవింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె పరమేశ్వరా!'

* * *

"తాళ్లపాక" వీథివెంటఁబోవుచు నొక బాటసారి యీ పాటవిని యాఁగి నిశ్చేష్టుఁడై సాంతముగాఁ గీర్తనమాలించెను. ఆ బాటసారి సాధారణుఁడుకాఁడు. సాళువ నరసింహరాయల మిత్త్రుఁడైన యొక భూస్వామి. అతఁడు చదువుకొన్నవాఁడు. వేంకటేశ్వర పదారాధన తత్పరుఁడు. శ్రుతిపేయమైన వేంకటేశ్వర ప్రభాతగీతము చెవినిబడఁగనే యతఁడు పరవశుఁడై ముందునకు సాగలేగపోయెను. ఈ పాటగాఁడెవఁడో తెలిసి...

కొందమను జిజ్ఞాస యతని కుదయించెను. వెంటనే 'అన్నమయ్య' యున్నచోటికి వెళ్లిచూచెను.

అన్నమయ్య వీథియరుగుపై గూరుచుండి భక్తినిమీలితలోచనుఁడై "కడగి మేల్కొనవె వేంకటరమణుఁడ!" యని పాడుచుఁ బది నిముసములకుఁ గన్నులు తెఱచి చూచెను. చూచినతోడనే చేతులుజోడించి నిలఁబడియున్న యొకనూతన పురుషుఁడతనికి గోచరించెను. అన్నమయ్యకు వేంకటేశ్వర సాక్షాత్కారమైనంత యానందము కలిగెను. అతఁడు వెంటనే "మహానుభావా! దయచేయుఁ"డని క్రొత్తపురుషు నాహ్వానించెను. ఆ బాటసారి వినయ వినమిత గాత్రుఁడై యన్నమయ్యకు నమస్కరించి యిట్లు పలికెను.

"తమరెవరో మహాభక్తులుగా, గాయకోత్తములుగా నున్నారు. పేరు తెలిసికొనుటకు వేడుకపడుచున్నాను."

"అయ్యా! నేను వేంకటేశ్వర శ్రీ చరణరేణువను. నా పేరు 'అన్నమయ్య' యందురు. తమరెక్కడినుండి రాక?"

"నేను సాళువనరసింహరాయలవారి బాల్యమిత్రుఁడను, 'విద్యానగరము'నకు మామిత్రుని రాజకీయ కార్య సందర్భముతో వెళ్లుచున్నాను. ఈతోవవెంటఁ బోవుచుఁ దమ సంకీర్తనము విని యాఁగిపోయితిని. నాజన్మము ధన్యమైనది. వేంకటేశ్వరపదభక్తులగు నరసింహరాయలవారు తమ సంకీర్తనము విన్నచో నెంత పొంగిపోదురో యనుకొనుచున్నాను.

కొలఁదినాళ్ళలో నరసింహరాయలవారు తమ దర్శనార్థము విచ్చేయుదురు. వారి మహోద్యమమునకుఁ దమ యాశీర్వాదము, సహకారము కావలసియున్నవి."

౨

సాళువ నరసింహరాయలు విద్యానగర సామ్రాజ్యమునకుఁ జక్రవర్తియయ్యెను. శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యసేవలకు ఫలముగాఁ దాళ్ళపాక అన్నమాచార్యుల యాశీర్బలముతో బహుప్రయత్నముమీఁద సామ్రాజ్యమును సంపాదించిన శ్రీ నరసింహరాయలను నాంధ్రప్రజలందఱు శ్లాఘించుచుండిరి. నరసింహరాయలకు నన్నమాచార్యులపై నపారమైన భక్తి. ఆతని పరిచయము లభించినప్పటినుండియు నరసింహరాయలకు వేంకటేశ్వర పద పద్మారాధనాసక్తి యభివృద్ధి కాఁ దొడఁగెను. భగవదనుగ్రహము వలనఁ దనకు సామ్రాజ్యాధిపత్యము లభించినదనియు, ఆలాభమునకుఁ గారణము 'అన్నమయ్య' సాహచర్యమే యనియు నరసింహరాయలకు సంపూర్ణవిశ్వాసము కలదు.

రాయలు భక్తిగౌరవములతో 'నన్నమయ్య'ను నందలము నెక్కించెను. అసాధారణ భోగభాగ్యములతో నలరింపఁ

జేసెను. ఒక్క క్షణమైనను 'రాయలు' అన్నమాచార్యుని యెడఁబాటు సహించెడివాఁడు కాఁడు. అన్నమయ్య మధురమైన కంఠమెత్తి వేంకటేశ్వరునిపై రచించిన సంకీర్తనములు పాడునపుడు 'రాయలు' విని పరవశుఁడై పోవును.

ఒకనాఁడు నరసింహరాయల కోరికపైఁ దాళ్ళపాక అన్నమాచార్యులు భక్తిభరిత హృదయుఁడై యిట్లు పాడుచుండెను.

"ఏమొకో చిగురుటధరమున ఎడనెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా!"

"నాదనామక్రియ" రాగము నాలపించి యీపల్లవి నందుకొనుసరికి సాళువ నరసింహరాయ లానందము పట్టలేక పోయెను. ఆచక్రవర్తి యెంత దైవభక్తికలవాఁడో, అంత శృంగారరసాసక్తి కలవాఁడు. అన్నమయ్య పాట పూర్తియైనది. నరసింహరాయలు "అన్నమాచార్యా! తమ శృంగార సంకీర్తనములు వినుట కెంతో యింపుగా నుండును. శ్రీ వేంకటేశ్వరస్వామివారిపై పాడిన యీ సంకీర్తనముల వంటివి 'విద్యానగరచక్రవర్తి'ని గూర్చి కూడ రచించి పాడినచో వినవలయునను కుతూహలము కల"దనెను.

చక్రవర్తిమాటవిని 'అన్నమయ్య' తొలుత నాశ్చర్యపడి, కొంతసేపున కసహ్యపడి యిట్లుపలికెను:

"మహారాజా! తమనోటినుండి యిట్టిమాట వెడలునని నేనెన్నఁడు భావింపలేను. పరమేశ్వరుఁడైన వేంకటరమణుని

శృంగారమును వర్ణించువాఁడనుగాని, మానవుల తుచ్ఛశృంగారములు వర్ణించు కవినిగాను నేను. మీయభిలాష నావలన నెఱవేఱదు. క్షమింపుఁడు."

[illegible] గుండెకు [illegible] దాను బ్రహ్మరథముపట్టి, యతనికి ధనకనకవస్తువాహనాదు లొసఁగి, యసామాన్యగౌరవము చేయుచున్నాఁడు. చక్రవర్తి యాదేశమును గాదనుట కెన్నిగుండె లుండవలెను! అన్నమయ్యకు వేంకటేశ్వరునిమీఁదఁ దప్ప మానవమాత్రునిమీఁద లక్ష్యము లేదు. అతనికి మహారాజాధిరాజు - సామాన్య మానవుఁడు నను భేద మంతకంటెను లేదు. నరసింహరాయలపై నన్నమయ్యకుఁ గల గౌరవ మాచక్రవర్తి దైవభక్తిని బురస్కరించుకొని వచ్చినదికాని యన్యముకాదు. చక్రవర్తి నేఁడు తన్నుఁగోరిన కోరిక మిక్కిలి క్షుద్రమైనది. దేవతాశృంగారమును వర్ణించుకొను భక్తుఁడు మానవ శృంగారము నెన్నఁడైన వర్ణించుటకు వేడుకపడునా?

శృంగారగానపరవశుఁడైన నరసింహరాయల కాక్షణమున నాలోచనమేలేదు. కర్మవశమున నతని నోరు జాఱినది. అన్నమయ్య తృణప్రాయముగాఁ దన యాదేశమును ధిక్కరించివైచెను. చక్రవర్తి కోపము పట్టలేక 'అన్నమయ్యను శృంఖలాబద్ధునిజేసి ఖైదులోఁ బడవేయుఁ' డని సేవకుల కాజ్ఞా

పించెను. చిదానందమూర్తియగు అన్నమాచార్యులు నరసింహరాయల యవివేకమునకు నవ్వుకొని, సేవకులువేయు సంకెళ్ళకుఁ జేతు లిచ్చెను.

3

నిన్నగాక మొన్న విద్యానగరములోఁ గారాగార బంధితుఁడైన అన్నమాచార్యులు నేఁడు 'తాళ్ళపాక' లోని స్వగృహమునఁ గూర్చుండియుండుట కందఱు నాశ్చర్యపోయిరి. సాళువ నరసింహరాయలు తనకిచ్చిన దివ్యసౌధము, వస్తువాహనాదులు, సమస్తము విడిచి నిర్విచారపురుషుఁడై 'యన్నమయ్య' తన యింటియరుఁగుమీఁదఁ గూరుచుండి దివ్యసంకీర్తనము చేసికొనుచుండెను. తిరుపతి వేంకటేశ్వరుని కరుణాకటాక్షమునకు లక్ష్యభూతుఁడగు నన్నమాచార్యునకు విద్యానగర చక్రవర్తి వేయించిన యినుపసంకెలలు కనకకంకణములైనవి. కారాగారము పూజామందిరమైనది. బంధితుఁడైన తరువాత విముక్తికొఱకు నా మహాభక్తుఁడు పాడిన పాటలకుఁ గరఁగి తిరుపతి వేంకటేశ్వరుఁ డన్నమయ్యను బంధముక్తుని గావించెను. వెంటనే యతఁడు విద్యానగరమున నుండుట కిష్టపడక 'తాళ్ళపాక' చేరుకొనెను.

అన్నమయ్య విచిత్రముగా బంధముక్తుఁడైన వార్త చక్రవర్తికిఁ దెలిసి, యతఁడు తన తొందరపాటునకుఁ బశ్చాత్తాపపడి ప్రాయశ్చిత్తముగా నా భక్తశిరోమణి చరణములపైఁ బడుటకుఁ 'దాళ్ళపాక' గ్రామమునకుఁ బ్రయాణించెను. విద్యానగరచక్రవర్తి వచ్చునప్పటికి 'అన్నమయ్య' సుఖశయ్యలో గోవిందరాజస్వామిని గూర్చి యిట్లు పాడుకొనుచుండెను.

ఉప్పడము కావయ్యా - ఉయ్యేల మంచముమీఁద
గొప్పగొప్పకన్నుల గోవిందరాజా!
పవ్వళించే వీడ వచ్చి - పాయనీ యలవెల్ల
ముమ్వంక మేనితోడ ముచ్చటదీర
నవ్వేడి శ్రీపతిచూపు నాటిన చిత్తపు మేన
క్రువ్వని కలువదండై - గోవిందరాజా!
నిద్దురించే వీడవచ్చి నిలుచున్న యలవెల్ల
ప్రొద్దుపొద్దునకుదీర భోగీంద్రుపై
ఇద్దఱు సతులు నీకు నేచిన తాళగతుల
గుద్దేటి పాదములతో గోవిందరాజా!
మెండుగ మేలుకొంటివి - మించిన కౌఁగిటిలోన
కొండుకపాయపుసిరి కోపించగా
ఉండవయ్యా సుఖలీల నుడివోని ప్రియముతో
కొండల కోనేటిరాయ గోవిందరాజా!

* * *

నేనొకండలేకుండితే నీకృపకుఁ బాత్రమేది
పూని నావల్లనే కీర్తి పొందేవు.........

నరసింహరాయలు 'అన్నమయ్య' పాదములపైఁబడి, 'మహాత్మా! నీవల్లనే నేను గీర్తిపొందితిని. ఇప్పుడు నీయెడల సపచారముగావించి యపకీర్తియుఁ బొందుచుంటిని. క్షమింపుము' అని ప్రార్థించెను. అన్నమయ్య వినయగౌరవ స్నేహములతోఁ జక్రవర్తిని గౌఁగిలించుకొని. 'మహారాజా! నీవంటి వాఁడిట్లు పలుకుట భావ్యముకాదు. ఏదోజరిగినది. అంతయుఁ దిరుపతి వేంకటరమణుని లీలావిలాసము. ఈ పేదభక్తుని యింటికిఁ బెన్నిధానము వచ్చినది. ఇంతకంటె నాకేమి కావలయును' ననిపలికి మధురకంఠముతో నాశువుగాఁ గొన్ని కీర్తనములు గానముచేసి వేంకటేశ్వర సాక్షాత్కారభాగ్యము నరసింహరాయలకును గలిగించెను. ఆ సార్వభౌముఁ డన్నమాచార్యుల మహిమ కచ్చెరువడి చాగిలి మ్రొక్కి యాశీస్సులు వడసి వెడలిపోయెను.

౪

అన్నమయ్య తిరుపతి వేంకటేశ్వరస్వామికిఁ దనవాగ్గేయ వైభవముతో నిత్యార్చనలుసలిపిన ధన్యమూర్తి. అతఁడు తనకుఁ బదునాఱు సంవత్సరములవయస్సు వచ్చినప్పటినుండియు దినమున కొక్క సంకీర్తనమైనను జెప్పకుండ నుండలేదు. తొంబదియేండ్ల పూర్ణపురుషాయుష్యము భగవత్సంకీర్తనముతో నతఁడు గడపెను. అన్నమయ్య సంకీర్తనములు ముప్పదివేలకుఁబైగా నున్నవి. వానిలోఁ గొన్నిమాత్రమే నేఁడు దొరకియున్నవి. రాగిరేకులపైఁ జెక్కఁబడిన వారి కీర్తనములు తిరుపతి దేవస్థానమువారు భద్రపఱచియుంచిరి.

నాదబ్రహ్మోపాసనముచేఁ బవిత్రజీవితముగడపి చరిత్రగణ్యులైన క్షేత్రయ్యకు, త్యాగరాజునకు, తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనములు మేలుబంతులైన వనుటలో సత్యోక్తి యుండదు. స్వానుభవమును సరసమధురమైన తెలుఁగుభాషలోని సంకీర్తనములతో వెల్లడించి వేంకటరమణుని కృపావిశేషమునకుఁ బాత్రుఁడైనయన్నమయ్య తెలుఁగునాఁట మాసిపోవని ధన్యమూర్తి.

అన్నమయ్య విశిష్టాద్వైత మతస్థుఁడైనను శ్రీ వేంకటేశ్వరమహిమకు లోఁబడి వైష్ణవమత స్వీకారముచేసినవాఁడు. అహోబలమఠమున కధిపతియగు ఆదివన్ శఠకోపయతి

యన్నమాచార్యుల వైష్ణవగురువు. అన్నమాచార్యులకుఁ బెదతిరుమలాచార్యులను పేరుగల కుమారుఁడుండెను. ఆయన రచించిన కీర్తనములుకూడ నెన్నో తామ్రశిలాశాసనములలో లభించినవి.

చక్రవర్తి సాళువ నరసింహరాయులవంటి వానినేని లెక్కసేయక,తనమానసము నిరంతరము శ్రీ వేంకటరమణునిపై నిలిపియుంచి, అర్చావైభవముతో భగవంతుని సాక్షాత్కరింపఁ జేసికొని, నిండుగాఁ దొంబదియేండ్ల పవిత్రజీవితయాత్ర సాగించి, ప్రతిదిన సంకీర్తన రచనా ప్రతిజ్ఞ సాధించుకొని 'పూనినావల్లనే కీర్తిపొందేవునీవు' అని వేంకటేశ్వరుని యెదుట నిర్భయముగాఁ జాటిచెప్పి ముప్పదివేలకు మించిన దివ్య సంకీర్తనములతోఁ దెలుఁగు ధరిత్రిని బవిత్రము గావించిన చరిత్రధన్యుఁ డన్నమయ్య.

జాతిభేదములు కూడదని విశ్వసించిన 'అన్నమయ్య' రచించిన యీపాట యెంత సొగసుగా నున్నదో చూడుఁడు.

విజాతులన్నియు వృథా వృథా
అజామిళాదుల కదియే జాతి.
ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన
నిక్కమెఱింగిన మహానిత్యుఁడే ఘనుఁడు
వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి
యాదరింపని సోమయాజికంటె

పదియును లేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించుభక్తుండె ఘనుఁడు.

పరమగు వేదాంతపఠన దొరకియును సదా
హరిభక్తి లేని సన్యాసికంటె
సరవిమాలిన యంత్యకులజుఁడైన
నరసి విష్ణుని వెదకునాతఁడే ఘనుఁడు.

*   *   *

తన సంకీర్తనముల చౌర్యముచేసినవారిని దూషించుచు అన్నమాచార్యులు రచించిన యీ పాటలోని హాస్యరస మాధుర్యము నాస్వాదింపుఁడు.

వెఱ్ఱులార! మీకు వేడుక కలిగి తేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా?
ముడిచివేసినపువ్వు ముడవ యోగ్యముకాదు
కుడిచివేసిన పుల్లె కుడువగా రాదు—
బడి నొకరు చెప్పిన బ్రతిచెప్పబో తేను
అడరి శ్రీహరికి నది అరుహముకాదు—
ఉమిసిన తమ్మలో నొకకొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల—
అమరంగ ఛాయాపహారము చేసుక
తమమాట కూర్చితే దైవము నగడా?—వెఱ్ఱులార!

శ్రీ వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షమునకుఁ బాత్రుడవై, ఆదర్శమైన భక్తియోగమును మేలుబంతిగా మాకందిచ్చిన మహాత్మా, అన్నమాచార్యా ! నిన్నుఁగీర్తించి ధన్యత సంపాదించుకొందుము.

రాయల ముద్రణాలయము, తణుకు. అక్టోబరు — 1954.